# ఏటి ఒడ్డున నీటిపూలు

నవల

- కొలిపాక రమామణి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 176

జనవరి 2016 నుంచి ఏప్రిల్ 2017 వరకు

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా పునర్ముద్రణ పొందిన నవల

రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

## (ప్రారంభం)

### ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)



తాళ్ళూరు నాగేశ్వరరావు

కొలిపాక రమామణి

రావులపాటి సీతారాంరావు

కీలక ఉగాది నవలల పోటీలో విజేతలు

మొదటి బహుమతి పొందిన 'కొత్త ఇల్లు' నవలా రచయిత శ్రీ తాళ్ళూరు నాగేశ్వరరావు. జననం ఏప్రిల్ 1, 1934. స్వగ్రామం తెనాలి తాలూకా కొలకలూరు. సాగర్ విశ్వవిద్యాలయంలో ఆయన ఎమ్. కామ్., ఎల్. ఎల్.బి. చదివారు. ప్రస్తుతం తెనాలి వి. ఎస్. ఆర్. కాలేజీలో కామర్స్ డిపార్టుమెంట్‌లో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. 1949 నుంచీ రచనలు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకూ ఆయన 13 నవలలూ, 500 కథలూ, కొన్ని నాటికలూ, వ్యాసాలూ రచించారు. ఒక్క ''ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక'' లోనే ఆయన కథలు 74 ప్రచురించబడ్డాయి. ఆయన రచించిన కొన్ని కథలు ఆంగ్ల, హింది, కన్నడ భాషల్లోకి తర్జుమా చేయబడ్డాయి.

రెండవ బహుమతి పొందిన 'ఏటి ఒడ్డున నీటి పూలు' నవలా రచయిత్రి శ్రీమతి కొలిపాక రమామణి. స్వస్థలం తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ. హైస్కూలువరకూ ఆమె విద్యాభ్యాసం కాకినాడలోనే సాగింది. కాలేజీ చదువు నర్సాపురం, వాల్తేరులలో పూర్తి అయిన తరవాత కొంతకాలం ఆమె తిరుపతిలోని పద్మావతి స్త్రీల కళాశాలలో ఉద్యోగం చేశారు. మూడేళ్లుగా భర్త ఉద్యోగరీత్యా ఆమె రాజస్థాన్‌లోని జయపూర్‌లో నివసిస్తున్నారు. ఆమె రచించిన కొన్ని కథలు పత్రికలలో ప్రచురించబడ్డాయి. కాని, నవలా రచనలో ఈ నవలే ఆమె ప్రప్రథమ ప్రయత్నం.

మూడవ బహుమతి పొందిన 'బ్రతుకు బొంగరం' నవలా రచయిత శ్రీ రావులపాటి సీతారాంరావు. జననం ఆగస్ట్ 4, 1943. స్వగ్రామం ఖమ్మం జిల్లాలోని ముదిగొండ. ఆయన ఖమ్మం కళాశాలలో బి. ఎ., నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎమ్. ఎ. చదివారు. ప్రస్తుతం గద్వాలలోని ఎమ్. ఎ. ఎల్. డి. గవర్నమెంట్ కళాశాలలో పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. కథకులుగా ఆయన తెలుగు పాఠకలోకానికి చిరపరిచితులే.

"మేం పూలు తీసుకుని ఓ గంటలో వస్తాం" అంటూ పెళ్లి ఇంటిలోంచి బయట పడ్డారు చారుమతి, శ్రీదేవి. వాళ్ళ స్నేహితురాలు పద్మ పెళ్లి ఉదయమే అయింది.

"తొందరగా రండి. చీకటి పడగానే బంతులాట వేడుకలు ఉంటాయి." వెనకనించి పద్మ తల్లి వరలక్ష్మిగారి గొంతు వినిపించింది.

చారుమతి, శ్రీదేవి రిక్షా కట్టించుకుని మసీదు వీధికి వచ్చారు. మసీదుకు ఎదురుగా ఉన్న అంగట్లో మల్లెమొగ్గలు, జాజులు, గులాబీలు, సంపెంగలు గుట్టలుగా పోసి ఉన్నాయి.

"ఏం పూలు తీసుకుందాం?" శ్రీదేవి పూలవంక చూస్తూ అడిగింది.

"పద్మా వాళ్ళ నాన్నగారు సర్పవరం నుంచి మల్లెలు, కనకాంబరాలు, గులాబీలు తెచ్చారుగా. మనం సంపెంగలు తీసుకుందాం" అంది చారుమతి.

రెండు రూపాయలు పెట్టి కొమ్మ సంపెంగలు కొని పొట్లం కట్టించారు. అప్పటికే చీకటి పడుతూంది. గబ గబా నడుస్తూన్నచారుమతిని ఆపింది శ్రీదేవి.

"ముందు మనం రాములవారి ఆలయంలోకి వెళ్లి పద్మ కోసం భగవంతుణ్ణి ప్రార్థిద్దాం. రా" అంది.

అక్కడికి కొంచెం దూరంలో ఉన్న రాములవారి ఆలయానికి వెళ్ళారు ఇద్దరూ. అప్పుడే పూజారి ఆలయం తలుపులు తీసి సీతారాముల విగ్రహాలకి పూలమాలలు అలంకరిస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లల్ని చూడగానే పూజారి పళ్ళెం తీసుకువచ్చాడు. చారుమతి అరి చేతిలో ఉన్న సంపెంగపూల పొట్లం విప్పి, సగం పూలు పళ్ళెంలో ఉంచింది. పూజారి నిర్లక్ష్యంగా వెళ్లి ఏవో మంత్రాలు అస్పష్టంగా గొణుగుతూ పూలు విగ్రహాల పాదాల ముందు విసిరేశాడు. పళ్ళు, కొబ్బరికాయ దొరకలేదని అతని చింత.

చారుమతి బాధపడింది. "చూశావా, అంత మంచి పువ్వులు నిర్లక్ష్యంగా ఎలా విసిరేశాడో? చక్కగా విగ్రహాలకి అలంకరించ కూడదా?" అంది శ్రీదేవి వైపు తిరిగి.

"మనం మాల కట్టి ఇస్తే వేసేవాడేమోనో పూజారి. మనదే తప్పు" అంది శ్రీదేవి కళ్ళు మూసుకుని భగవంతుడికి నమస్కరిస్తూ.

"పద్మకి మంచి భర్తని ఇయ్యి. వాళ్లిద్దరు చిలకా గోరింకల్లా, పిల్లా పాపలతో సుఖంగా కలకాలం బ్రతికేటట్లు చెయ్యి. పద్మ ఎప్పుడూ సంతోషంగా ఉండాలి." చారుమతి కూడా భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా ప్రార్థించి కళ్ళు తెరిచింది. స్నేహితురాళ్ళిద్దరూ రామారావు పేటలో ఉన్న పెళ్ళివారి ఇల్లు చేరేసరికి లోపల పందిట్లో సన్నాయి వినిపిస్తూంది. ఆడవాళ్ళంతా చక్కగా అలంకరించుకుని పట్టుచీరలు గరగరమంటూ ఉంటే హడావిడిగా తిరుగుతున్నారు. అందరి తలలోనూ మల్లెలు, గులాబీలు గుబాళిస్తున్నాయి. పందిరి మధ్య తివాసి పరిచారు. అక్కడే అగరుబత్తులు, పన్నీరుబుడ్డి గంధము, పూలదండలు, తమలపాకులు, పళ్ళు పళ్ళాలల్లో అలమరుస్తున్నారు ముత్తైదువులు.

"అమ్మయ్య! వచ్చారా?" అంది పద్మ స్నేహితురాళ్ళిద్దరినీ చూసి సంతోషంగా.

పద్మని లోపల గదిలో కూర్చోబెట్టారు. చుట్టూ అత్తగారూ, వారివైపు వారూ కూర్చున్నారు.

'ఎంత అందంగా ఉంది పద్మ!' అనుకుంది చారుమతి, పద్మని ఆశ్చర్యంగా చూస్తూ. మల్లెపువ్వుల జడ కుట్టారు. అప్పుడే విచ్చుకుంటున్న ఎర్ర గులాబీ మొగ్గల దండ గుచ్చి జడ పైన మాల అమర్చారు. లేత నీలం పట్టు చీర కట్టారు. మెడలో తెల్లటి పొడవైన మల్లెపూల దండ వేశారు. అసలే పెద్దవైన పద్మ కళ్ళు తీర్చి దిద్దిన కాటుకతో ఇంకా అందంగా చేశారు. నుదుటిపైన తిలకం బొట్టు, బుగ్గన దిష్టి చుక్కలతో అప్పుడే దివి నుంచి దిగి వచ్చిన దేవతలా ఉంది పద్మ.


"ఎక్కడివర్రా సంపెంగ పూలు? అబ్బ ఒకటే సువాసన!" అన్నారు ఎవరో.

అప్పటి దాకా పద్మనే తన్మయత్వంతో చూస్తున్న చారుమతి ఒక్కసారి మేలుకొని సంపెంగ పూల పొట్లం తీసి, పళ్ళెం నిండా పూలు పోసి పద్మ చేతిలో పెట్టింది.

"ఇన్ని పూలు నేనేం చేసుకోను?' అంది పద్మ ప్రీతిగా పూల వంక చూస్తూ.

"పెట్టుకో!" అంది శ్రీదేవి, దారం తీసుకుని సంపెంగలు గుచ్చబోతూ.

"అవి అలా ఉంచమ్మా. రాత్రికి పక్కల మీద వెయ్యచ్చును" అంది పద్మ మేనత్త.


కొత్త సీరియల్

ఏటి ఒడ్డున నీటి పూలు

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కీలక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి రు. 3000/- అందుకున్న నవల వచ్చే సంచికలో (17-7-68) ఆరంభమవుతుంది.

—ఎడిటర్

"అయ్యో! అన్ని పూలు పక్క మీద వేస్తే పాములు రాగలవు" అన్నారు ఎవరో హాస్యంగా.

అప్పుడే యౌవనంలో అడుగుపెట్టిన స్నేహితురాళ్ళు ముగ్గురు ఆ సంభాషణ విని ఎందుకో తెలియకుండానే సిగ్గు పడ్డారు. శ్రీదేవి మాల కట్టకుండా సంపెంగలు పళ్ళెంలోనే ఉంచేసింది.

"లేవండి వదినగారూ, వేళ మించి పోతూంది" అంటూ అంతలోనే వరలక్ష్మిగారు వచ్చి అందరినీ లేవదీశారు. పద్మని చేయి పట్టుకుని ఆప్యాయంగా ముందరి పందిట్లోకి నడిపించుకుని తీసుకెళ్లారు. పందిట్లో తివాసీమీద పెళ్ళికొడుకు మాధవరావు కూర్చుని ఉన్నాడు. పద్మని అతనికి ఎదురుగా కూర్చో బెట్టారు.

'రతీమన్మదుల్లా ఉన్నారు' అనుకున్నారు చుట్టూ ఉన్న స్త్రీలు వాళ్ళిద్దరిని చూసి. పద్మ ఛామనఛాయ. చక్కటి పొడుగూ, తగ్గ ఒళ్ళు, తీర్చి దిద్దిన కనుముక్కు తీరులతో అందంగా ఉంటుంది. ఆమె కంటే ఒక ఛాయ ఎక్కువ మాధవరావు. పద్దెనిమిది ఏళ్ళ పద్మకి. ఇరవై ఐదేళ్ళ మాధవరావు ఈడూ జోడూ.

ఆ సాయంకాలం బంతులాట తంతు అంతా ఆడవాళ్లదే. మగవాళ్ళంతా దూరంగా తప్పుకున్నారు. ఒంటరిగా మిగిలి పోయిన పెళ్లి కొడుకుకూడా పద్మ లాగే సిగ్గుపడుతూ ముభావంగా కూర్చున్నాడు.

మాధవరావు తల్లి కాంతమ్మ అతని పక్కనే కూర్చుంది. మగపెళ్లి వారి తాలూకు పెద్దావిడ ఒకరు పెళ్లి కొడుకును ప్రోత్సహించింది.

"బాబూ! ఇంకొంచం గంధం పుయ్యి. మెడ చేత్తో వంచి మరీ వెయ్యాలి దండ. సెంటు బాగా రాయి. దెబ్బ తగలదులే, ఆ పూలబంతి గట్టిగా విసురు."

మాధవరావు ప్రతి పనీ చెయ్యబోయే ముందు, 'ఆజ్ఞ కావాలి' అన్నట్టు తల్లి వేపు చూస్తున్నాడు. కాంతమ్మగారు ఇవేవి ఇష్టం లేనట్టు ముఖం చికాకుగా పెట్టుకుని కూర్చుంది.

దూరంగా తల్లీ కొడుకులను చూస్తున్న చారుమతి, శ్రీదేవి నవ్వుకున్నారు.

"అబ్బాయి మరీ అమ్మకూచిలా ఉన్నాడే" అంది శ్రీదేవి మెల్లిగా.

"పూర్వకాలం సరదాలని ఆవిడకి అయిష్టమేమో" అంది చారుమతి.

బంతులాట అవగానే విందు భోజనం చేసి పద్మ దగ్గిరా, తక్కిన వాళ్ళ దగ్గిరా సెలవు తీసుకుని ఇళ్ళకి బయలు దేరారు చారుమతీ, శ్రీదేవి.

"పద్మ ఎంతో మంచిది. అతనితో సుఖ పడుతుందంటావా?" అంది చారుమతి రిక్షాలో కూర్చోగానే.

"ఎందుకు సుఖ పడదూ? ఇది వాళ్ళ అమ్మకి, నాన్నగారికి ఒక్కర్తే కూతురైతే, అతను వాళ్ళమ్మకి ఒక్కడే కొడుకు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. పద్మకి ఏ కొరతా ఉండదు" అంది శ్రీదేవి, తనకు పద్మ సుఖపడడం మీద అపనమ్మకం లేనట్లు.

చారుమతి కాస్సేపు ఊరుకుని, "పద్మ పెళ్లి అయిపోయింది. తరువాత నీదే!" అంది.

"ఏమో, నీదే ముందవుతుందేమో?"

"నాది ఎలా అవుతుంది, దేవీ! నాకు లైన్ క్లియర్ కావాలిగా! నీకైతే ఈ బెడద లేదు. మీ అక్కలకు పెళ్లి అయిపోయింది. బావ సిద్ధంగా ఉన్నాడు."

చారుమతి మాటలకు శ్రీదేవి నవ్వేసి ఊరుకుంది.

సూర్యారావు పేట లో తన ఇంటిముందు రిక్షా దిగబోతూ శ్రీదేవి చారుమతిని ప్రశ్నించింది.

"నువ్వు రేపు విశాఖపట్నం వెళ్ళడం ఖాయమేనా? దేనికిప్పుడు ప్రయాణం?"

"రేవతక్క ఉత్తరం వ్రాసింది. అక్కడ స్కూళ్ళల్లో ఏవో ఖాళీలు ఉన్నాయట. నేనక్కడి వెళితే బావ సహాయం చేస్తారట."

"పంతులమ్మ ఉద్యోగం కోసం అంత దూరం విశాఖపట్నం వెళ్ళడం అనవసరం అనిపిస్తూంది నాకు. ఉద్యోగం దొరికినా మీ నాన్నగారికి అక్కడినించి ఎంతో కొంత పంపాలి కదా? ఎంత పంపగలవు?"

"నిజమే, దేవి. కాని అమ్మ ఒప్పుకోవడం లేదు. ముందు ఎక్కడో అక్కడ ఉద్యోగంలో చేరిపోతే, నెమ్మదిగా కాకినాడలో చూసుకోవచ్చు అంటుంది. ఆవిణ్ణి చిన్నబుచ్చలేక విశాఖపట్నం బయలు దేరుతున్నా, నాకిష్టం లేకపోయినా."

"సరే, తిరిగి రాగానే మాయింటికి రా. విశేషాలన్నీ చెప్పాలి. విష్ యు గుడ్ లక్."

"థాంక్స్. గుడ్ నైట్."

శ్రీదేవి ఇంటి లోపలి వెళ్ళగానే, "గంజాం వారి వీధికి పోనీయ్" అని రిక్షావాడితో చెప్పి తన ఆలోచనలో పడిపోయింది చారుమతి.

చారుమతి, పద్మ కాకినాడలోనే పుట్టారు. ఒకే హైస్కూల్లో చదివారు. ఫోర్తుఫారంలో మధ్యలో వచ్చి కలిసింది వాళ్ళతో శ్రీదేవి. ఆమె నాన్నగారికి తరుచు బదిలీలు అయ్యే ఉద్యోగం. చదువు కోసం తన అక్కగారింట్లో కాకినాడలో ఉంచారు శ్రీదేవిని.

శ్రీదేవి మేనత్తగారి ఇల్లూ, వెనకాల పెరడూ పెద్దవి. పెరట్లో పెద్ద మామిడిచెట్టు కింద కూర్చుని చారుమతి, శ్రీదేవి, పద్మా కబుర్లు చెప్పుకునే వాళ్ళు. ప్రతి సాయంత్రం ఒక అరగంటైనా ఆ చెట్టు కింద గడపక పోతే ముగ్గురికీ ఆ రోజు వెలితిగా తోచేది. వయస్సుతో బాటు వారి స్నేహం కూడా పెరిగింది. ఒకే రకంగా పయనిస్తున్న వారి జీవితాలు మూడు మార్గాలుగా చీలిపోయాయి. ఎస్.ఎస్.ఎల్. సి. పరీక్షలు అవగానే, శ్రీదేవి కాలేజీలో ఇంటర్ మీడియట్ క్లాసులో చేరింది. చారుమతి టీచర్ ట్రైనింగ్ లో చేరింది. అమ్మ, నాన్నల ఆదేశం ప్రకారం పద్మ ఇంట్లో కూర్చుని వరుని కోసం నిరీక్షించింది. రెండేళ్ళ నిరీక్షణకి ఫలితం మాధవరావు లభ్యం కావడం. వేసంగిలో కళ్యాణ గడియ వచ్చింది.

'ఇక పద్మ మాకు దూరమయిపోతుంది' అనుకుంటున్న చారుమతి, "ఏ ఇల్లమ్మా?" అన్న రిక్షావాడి కేకతో ఈ లోకంలో పడింది.

"అదే, కొళాయి పక్క ఇల్లు."

## 2

చారుమతి తలుపు శబ్దం చెయ్యగానే డాబా మీది నుంచి దిగివచ్చి శాంతమ్మ తలుపు తీసింది.

"నిద్ర పోతున్నారా అంతా? ఇంత నిశబ్దంగా ఉంది" అంది చారుమతి లోపలి అడుగు పెడుతూ.

"గంట ఎంత అయిందనుకున్నావ్! పది దాటింది. అందరు పడుకున్నారు. పెళ్లి ఇంట్లో కూర్చున్న నీకు ఎంత పొద్దు పోయిందో తెలిసి ఉండదు" అంది శాంతమ్మ.

చారుమతి గబగబా బట్టలు మార్చుకుని కింద దీపం ఆర్పి, డాబా మీదికి వెళ్ళింది. వాళ్ళ డాబా చిన్నది. సన్నగా పొడుగ్గా ఉంటుంది. మనిషి అడ్డంగా పడుకుంటే, కాళ్ళు దాటుకుంటూ వెళ్ళాలి. డాబా అంతా ఇంట్లో మనుషులతో నిండి పోయింది. ఒక రకంగా చెప్పాలంటే ఇరుగ్గా ఉంది. చారుమతి తల్లి పక్కనే పడుకుంది. శాంతమ్మ పద్మ పెళ్లి విషయాలు అడిగింది.

"అయితే మామగారు లేరా? అత్తగారేనా? ఒక్కడే కొడుకా? పోనీలే, ఆడపడుచుల పోరు ఉండదు మీ పద్మకి. అత్తగారు మంచిదిలాగే కనబడిందా?"

"ఆవిడ చాలా చిన్నదానిలా ఉందమ్మా. నలభై ఏళ్ళు ఉంటాయేమో! చాలా అందంగా ఉంది. పాపం, బొట్టూ అదీ పెట్టుకుంటే ఇంకా బాగుంటుందేమో."

"మీ పద్మ అదృష్టవంతురాలు! మంచి మొగుణ్ణి సంపాదించింది."

శాంతమ్మ గొంతులో కొంచెం ఈర్ష్య కూడా తొంగి చూసినట్లు అనిపించింది చారుమతికి.

మాట్లాడుతూనే నిద్ర పోయింది శాంతమ్మ. చారుమతికి నిద్ర రాలేదు. " ఆ సంపెంగపూలు అలా ఉంచమ్మా! రాత్రి పక్కల మీద వెయ్యొచ్చు." పద్మ మేనత్త మాటలు జ్ఞాపకం వచ్చాయి. అంటే, ఈ రోజు శోభనం చేస్తారు. పద్మని గదిలోకి పంపించి ఉంటారు. తెల్లచీర కట్టారేమో! భర్తతో ఏం మాట్లాడుతుంది? ఇద్దరూ ఒకే గదిలో ఎలా గడుపుతారు?

పద్మ పెళ్ళిలో నుంచి తనకు జరగబోయే పెళ్ళి లోకి వెళ్ళి పోయాయి చారుమతి ఆలోచనలు. తను ఎవరిని పెళ్ళి చేసుకుంటుంది? అతను ఎలా ఉంటాడు? శోభనం నాడు రాత్రి తాను ఎలా ఉంటుంది? తరువాత ఏం ఆలోచించాలో తెలియలేదు. ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేశాయి.

చారుమతి ఊహించినట్లు ఆ రోజు రాత్రి పద్మ శోభనం గదిలో ప్రవేశించ లేదు. రాత్రి పది గంటలకి వరలక్ష్మి సావకాశంగా కూర్చున్న వియ్యపురాలి తగ్గిరికి వెళ్ళి అడిగింది.

"ఏమండీ, వదినగారూ, సావకాశంగా కూర్చున్నారు? రాత్రి ఏర్పాట్లు ఏం చెయ్యాలో చెప్పలేదు."

"రాత్రికి ఇంకేం ఏర్పాట్లు ఉన్నాయి? రేపు తెల్లవారుఝాము బండికి అమ్మాయిని తీసుకుని మేం మద్రాసు వెళతాం" అంది కాంతమ్మ.

వరలక్ష్మి ఆశ్చర్య పోయింది. కొంచెం తటపటాయించింది.

"ఏదో ఆ కార్యం అడ్డు కూడా ఈ రోజే తీర్చేయ్యాలనుకున్నాము" అంది మెల్లిగా

"పిల్ల అత్తవారింట్లో శోభనం చేసుకోవడం మా ఆచారం. మా ఇంట్లోనే చేసుకుంటాం." ముభావంగా అంది కాంతమ్మ.

వరలక్ష్మి నిరుత్సాహ పడింది. కాని రోజంతా పెళ్ళి హడావిడిలో అలిసిపోయిన పద్మ ఇవేవి పట్టించుకోకుండా ఆదమరిచి నిద్ర పోతోంది అప్పటికే.

చారుమతీ, శ్రీదేవి ప్రేమతో ఇచ్చిన పువ్వులు వ్యర్థంగా వాడిపోతూ ఆమె పక్కనే ఉండిపోయాయి.

## 3

చారుమతికి మెలకువ వచ్చేసరికి బాగా తెల్లవారి పోయింది. పక్కన చూస్తే డాబా అంతా ఖాళీగా ఉంది. దూరంగా మాత్రం శంకరం ముఖం నిండా ముసుగు పెట్టుకుని పడుకుని ఉన్నాడు.

'అయిదుగురి అమ్మాయిల మధ్య అపురూపంగా అబ్బాయిగా పుట్టడం ఎంత అదృష్టం!' అనుకుంది మనసులోనే. శంకరం పొద్దున్న పదిగంటల దాకా నిద్ర లేవడు. ఎంత ఆలస్యంగా లేచినా అడిగే వాళ్ళుండరు. శంకరం ఏం చేసినా చెల్లుతుంది ఇంట్లో. నెలకు అయిదు, ఆరు సినిమాలైనా చూస్తాడు. "వాడికేమే మగమహారాజు!" అంటూ శంకరానికి మద్దతు వస్తుంది మామ్మ. చారుమతికి ఆ మాట వింటే ఒళ్ళు మండుతుంది. అబ్బాయి పొడిచేసేదేమిటో?

"అక్కా! అమ్మ లేవమంటూంది. రైలుకు వేళ అయిపోతూందిట." కిందనుంచి మాలతి గట్టిగా కేక పెట్టింది.

చారుమతికి వెంటనే తన ప్రయాణం గుర్తుకు వచ్చి, పక్క చుట్టి కిందికి వెళ్ళింది. వరండాలో ఏదో రాసుకుంటున్నాడు సూర్యారావు.


"అమ్మా చారూ! ఇప్పుడే లేచావా?" అంటూ పలకరించాడు.

"ఏం నాన్నా? పిలిచావా?" దగ్గిరికి వెళ్ళింది చారుమతి.

సూర్యారావు ఎందుకో తటపటాయించాడు కాస్సేపు.

"ఏం లేదమ్మా. నువ్వు ఒక్కర్తివీ విశాఖపట్నం వెళ్ళగలవా? భయం లేదు కదా?" సందేహిస్తూ అడిగాడు.

చారుమతి ఆలోచించింది. తనకు తోడు కావాలంటే ప్రయాణానికి రెట్టింపు ఖర్చు అవుతుంది.




"నాకేమి భయం లేదు నాన్నా."

దిగులు తీరినట్టు ఒక నిట్టూర్పు విడిచాడు సూర్యారావు.

"నిన్ను పదిగంటలకు మెయిల్లో ఎక్కించి నేను కోర్టుకు వెళతా. తొమ్మిదింటికంతా సిద్దంగా ఉండు" అని తిరిగి తన పనిలో తల దూర్చాడు. తను పాతికేళ్ళుగా గుమాస్తాగా పనిచేస్తున్న ప్లీడరుగారు చనిపోతే, రెండేళ్లుగా కొత్త ప్లీడరు దగ్గర చేరాడు సూర్యారావు. ఈయన దగ్గిర చేరినప్పటినించీ పని ఎక్కువైంది అతనికి.

ఒక చిన్న పెట్లో బట్టలతో, చిన్న బుట్టలో రేవతి కోసం శాంతమ్మ కట్టి ఇచ్చిన పిండివంటలతో స్టేషను చేరింది చారుమతి. ఒక్కర్తిని పంపడానికి భయపడుతున్నాడు సూర్యారావు. మెయిల్లో కాకినాడ నించి విశాఖపట్నం వెళ్ళాలంటే చాలా ప్రయాస. కాకినాడ నుంచి ఏ ఊరు వెళ్ళాలన్నా సామర్లకోట లో మారాలి. ఊరు పెద్దదయినా, అన్ని సౌకర్యాలు ఉన్నా, ప్రయాణ సౌకర్యాలు, రైళ్ళ సౌకర్యాలు లేక కాకినాడ పౌరులు పెక్కు ఇబ్బందులు పడతారు. కాకినాడ నించి తిన్నగా హౌరా దాకా వెళ్ళే బోగీ ఒకటి సామర్ల కోటలో మెయిలుకు తగిలిస్తారు. కాని ఆ బోగీలో ఒకే ఒక చిన్న మూడవ తరగతి పెట్టె ఉంటుని. బోగీ ప్లాట్ ఫారం మీదికి రాక మునుపే కూలీల సాయంతో ప్రయాణికులు ఎక్కేస్తారు. అది ప్లాట్ ఫారం మీదికి వచ్చేసరికే కిటకిట లాడుతూ పిప్పళ్ళ బస్తాలా తయారవుతుంది. అందులో ఎక్కిన ప్రయాణికుల అవస్థ వర్ణించలేము! అది పెద్ద నరకయాతన! ఎక్కిన వాడు దిగలేడు. దిగిన వాడు ఎక్కలేడు. లోపల పిల్లల, స్త్రీల యాతన మరీ అధ్వాన్నం. లావేటరీకి వెళ్ళాలన్నా వీలవక కళ్ళనీళ్ళ పర్యంతం అవుతుంది స్త్రీలకు.

సూర్యారావు, చారుమతి స్టేషనుకు వచ్చే సరికే ఆ మూడవ తరగతి పెట్టె నిండిపోయి మనుష్యులు వేళ్ళాడుతున్నారు. చేసేది లేక వేరే పెట్టెలో కూర్చుంది చారుమతి.

"నువ్వేం భయపడకు నాన్నా! సామర్లకోటలో జాగ్రత్తగా దిగి మెయిల్లో ఎక్కుతానులే. నేనేం చిన్నదాన్నా? పగలు ప్రయాణమేగా!" అంది చారుమతి తండ్రి దిగులు చూసి.

అయినా సూర్యారావుకు తృప్తి కలగలేదు. భారంగా దిక్కు తోచని వాడిలా నుంచున్నాడు. కాసేపు ఉండి, "నేనలా రైలంతా చూసి వస్తానమ్మా, ఎవరైనా తెలిసివాళ్ళు కనిపిస్తారేమో? నీకు సాయంగా ఉంటారు" అని వెనక పెట్టె వైపు నడిచాడు.

'ఎందుకు నాన్న ఇంత దిగులు పడతాడు?' జాలిగా నవ్వుకుంది చారుమతి.

బండి ఇక రెండు నిమిషాలలో కదలబోతూంది అనగా సూర్యారావు ఒక నూతన వ్యక్తిని వెంటబెట్టుకుని వచ్చాడు. అతని వెనకే కూలీ ఒక సూట్ కేసూ, హోల్డాలు పట్టుకు వచ్చి చారుమతి ఎదురు సీటులో పెట్టాడు.

"ఈమేనండీ మా అమ్మాయి, చారుమతి. ఒక్కత్తే విశాఖపట్నం వెళుతోంది. ఒంటరిగా ఇదే మొదటిసారి ప్రయాణం. మరేం లేదు. సామర్ల కోటలో బండి మారినపుడు మీరు కొంచెం సహాయం చేస్తారుగా?" సూర్యారావు చారుమతిని పరిచయం చేశాడు.

"మీరింతగా చెప్పాలా గుమాస్తా గారూ! ఆ మాత్రం సహాయం చెయ్యలేనా? మీరేం దిగులు పడకండి. అమ్మాయిని క్షేమంగా విశాఖపట్నం చేర్చడం నా బాధ్యత. ఇక మీరు నిశ్చింతగా ఇంటికి వెళ్ళండి." నవ్వుతూ అన్నాడు అతను.

చారుమతి తెల్లబోయి 'ఎవరా ఇతను?' అనుకుంటూ చూసింది. అతనికి ముప్పై ఏళ్ళు ఉండవచ్చు. కొద్దిగా లావుగా ఉన్నాడు. పొడుగైనా, లావుమీద కొంచం పొట్టిగా కనిపిస్తున్నాడు.

"ఈయన రాధాకృష్ణగారమ్మా! మా ప్లీడరు గారి అబ్బాయి. ఈయన కూడా ఈ మధ్యే లా పాసై ప్రాక్టీసు పెట్టారు." చారుమతి సందేహాలు తీర్చాడు సూర్యారావు.

గార్డు విజిల్ ఊదాడు. రైలు కదిలింది.

"అమ్మా! జాగ్రత్త! వెళ్ళగానే ఉత్తరం రాయి. రాధాకృష్ణగారు సామర్లకోటలో సహాయం చేస్తారు. భయపడకు." సూర్యారావు మాటలు రైలు శబ్దంలో కలిసి పోయాయి. కనిపించేంత వరకు తండ్రిని చూస్తూ చెయ్యి ఊపింది చారుమతి.

'నాన్న ఎంత చిక్కి పోయాడు! వయస్సు కంటె ముసలివాడిలా కనిపిస్తున్నాడు. నేను ఉద్యోగంలో చేరగానే పని సగం తగ్గించుకోమని చెప్పాలి.' మనస్సులో తండ్రిని గురించి బాధ పడింది. తండ్రి అంటే ఎంతో ప్రేమ, జాలి చారుమతికి. అతనికి పిల్లలంటే తగని అపేక్ష. వాళ్ళ కోసమని శక్తికి మించిన పని చేస్తాడు. ఎంత పని చేసినా, నిజాయితీ పరుడైన సూర్యారావు సంపాదన ప్లీడరు గుమాస్తాగా ఏ మాత్రం? అతని సంపాదనలోనే ముసలితల్లీ, భార్యా, అయిదుగురి పిల్లల పోషణ గడవాలి. అతను ఎప్పుడూ మోయలేని బరువు మోస్తూ కుంగి పోయినట్లు ఉంటాడు.

తండ్రిని గురించిన ఆలోచనలతో కిటికీ దగ్గిరే పరాకుగా కూర్చున్న చారుమతి, సామర్లకోట స్టేషను చూసి, "అరే! అప్పుడే వచ్చేసిందా!" అనుకుని ఆశ్చర్య పోయింది.

రాధాకృష్ణ తన సామానుతో బాటు చారుమతి సామాను కూడా కూలీ చేతికి ఇచ్చాడు. ఇద్దరూ ఇవతలి ప్లాటుఫారం నుంచి అవతలి ప్లాటుఫారం మీదికి మారారు. సామాను ఆడవాళ్ళ వెయిటింగ్ రూములో పెట్టించి, "మీరిక్కడే కూర్చోండి. మెయిల్ ఎంత లేటో కనుక్కుని వస్తాను" అని వెళ్ళాడు అతను.

"రెండు గంటలు లేటుట!" అన్నాడు కాసేపయినాక వచ్చి.

"అబ్బ" అంది విసుగ్గా చారుమతి.

"కాంటీనుకు వెళ్లి కాఫీ తాగుదాం, రండి" అన్నాడు అతను.

అప్పుడే పరిచయమైన అతనితో వెళ్ళడానికి సంశయించింది చారుమతి.

"మీరు వెళ్ళండి. నేనిక్కడే కూర్చుంటాను" అంది.

"ఫరవాలేదు. రండి. వైజాగ్ దాకా మళ్ళీ ఏం దొరకవు" అంటూ బలవంతం చేశాడు అతను.

కాంటీన్ ఖాళీగానే ఉంది.

"రెండు వడలు, రెండు కాఫీ" అని సర్వరుకు చెప్పి, టేబిల్ మీద రెండు చేతులూ ఆన్చి ముందుకు వంగి కూర్చున్నాడు రాధాకృష్ణ. చారుమతి మొహమాట పడుతూ కూర్చుంది.

"మీ పేరు ఏమిటి? మీ నాన్నగారు ఏదో కొత్తపేరు చెప్పారు. మరిచిపోయాను." నిశబ్దాన్ని భంగం చేస్తూ అడిగాడు.

"చారుమతి."

"బాగుందండీ మీ పేరు."

"మా నాన్నగారు ఆడపిల్లల పేర్లు మాత్రం మంచివి పెట్టారు. రేవతి, భానుమతి, చారుమతి, మాలతి, భగవతి... మా పేర్లు."

"ఏమిటేమిటీ! మీరు అయిదుగురు అక్క చెల్లెళ్ళా? సూర్యారావుగారికి ఇంతమంది పిల్లలని ఇన్నాళ్ళు నాకు తెలియనే తెలియదు." ఆశ్చర్యంగా అన్నాడు రాధాకృష్ణ.

"నాకో అన్న కూడా ఉన్నాడు. పేరు శంకరం."

"ఏం చేస్తున్నాడు?"

"బి.ఎ. ఆఖరు సంవత్సరం లోకి వచ్చాడు. నా కంటే వాడు ఒక్క సంవత్సరమే పెద్ద."

"మీరేం చదువుతున్నారు?"

"నా చదువు ఆగి పోయిందండీ. ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యాను. ట్రైయినింగ్ పూర్తి చేశాను,"

"అదేం? మీరు కాలేజీలో ఎందుకు చేరలేదు? పై చదువుల మీద ఆసక్తి లేదా?"

"ఎందుకు లేదు? కాలేజీలో చదివి డిగ్రీ తీసుకోవాలని నాకెంతో కోరిక. ఎస్.ఎస్.ఎల్.సి. లో నేను మా స్కూలుకు ఫస్టు వచ్చాను. అయితేనేం? అందరికి అన్ని కోరికలూ తీరుతాయా?" చారుమతి బాధగా అన్నది.

"మీ కింత తెలివితేటలు ఉండీ చదువుకునే అవకాశం లేకపోవడం చాలా అన్యాయం. మీ నాన్నగారు ఎలాగో కష్టపడి మిమ్మల్ని చదివించ వలసింది."

"మా అన్నని చదివించడానికే మా నాన్నగారు ఎంతో కష్టపడుతున్నారు. మా రేవతక్క పెళ్ళికి చేసిన అప్పు తీరలేదింకా. ఇక ఆడపిల్లలని కూడా కాలేజీలో ఎక్కడ చదివించ గలరు?"

రాధాకృష్ణ ఏదో ఆలోచిస్తూ అన్నాడు. "నాకు ఇన్నాళ్ళూ మీ సంగతులు ఏమీ తెలియవు. సూర్యారావుగారు రోజంతా మా నాన్నగారి దగ్గిర పని చేసినా ఇంటి సంగతులు ఏమీ చెప్పరు."

"తెలిసి మాత్రం మీరు చెయ్యగలిగింది ఏముంది?" ఎవరి బాధలు వాళ్ళు పడాలి అన్న ధ్వనితో అంది చారుమతి

ఇంతలో వడ, కాఫీ వచ్చాయి. ఎవరి ఆలోచనలో వాళ్ళు ఉండిపోయి, అవి ముగించి బయటికి వచ్చారు ఇద్దరూ.

ఆడవాళ్ళ వెయిటింగ్ రూములో చారుమతిని కూర్చోబెట్టి అలా తిరిగి రావడానికి వెళ్ళాడు రాధాకృష్ణ.

వెయిటింగ్ రూము బయటే పిల్లని చంకనెత్తుకుని ఒకావిడ నిలబడి ఉంది. చూడడానికి కోనసీమ స్త్రీలా ఉంది. బందారు లంక ఎర్ర జరీ చీర, జరీ అంచున్న తెల్ల రవిక, మెడలో బరువు... చంద్ర హారం, జడనిండా పూలు, కాళ్ళకి పసుపూ. ఆవిడ చారుమతిని చూస్తూనే అడిగింది.

"అత్తగారింటికా, పుట్టింటికా వెళ్ళడం?"

ప్రశ్న విని తెల్ల బోయింది చారుమతి. "మా అక్కా వాళ్ళ ఇంటికి."

"మీ ఆయనా?"

"కాదు." అక్కడ నుంచోకుండా రూము లోపలికి వెళ్లి పోయింది చారుమతి.

"పైవాళ్ళ విషయాలలో ఇంత కుతూహలం ఎందుకో?" అని విసుక్కుంది. కాని ఆమె ప్రశ్నలో పరాయి మగవాడితో చనువుగా తిరగకూడదనే ఆలోచన ఉదయించింది చారుమతిలో.

రాధాకృష్ణ ఇచ్చిన పత్రిక చదువుతూ కూర్చున్న చారుమతి ప్రయాణికులు సామానులు తీసుకుని పరిగెత్తడం, రైలు ప్లాట్ ఫారం మీదికి రావడం ఒక్కసారిగా గమనించి, కంగారు పడుతూ తను లేచింది. రాధాకృష్ణ కూలీని వెంటబెట్టుకుని వచ్చాడు. పెళ్ళిళ్ళ రోజులవడంవల్ల రైల్లో ఖాళీ లేదు. ప్రతి మూడవ తరగతి పెట్టె దగ్గిరా ఎక్కే వాళ్లకి, దిగే వాళ్లకి మధ్య హోరాహోరి యుద్ధం జరుగుతూంది. "దిగనియ్యవయ్యా, ఖాళీ అవుతుంది" అంటాడు దిగేవాడు. "ఎక్కనియ్యవయ్యా, రైలు కదిలి పోతూంది. టైమై పోతూంది" అంటాడు ఎక్కేవాడు. ఇద్దరూ ద్వారబంధం దగ్గిరి నుంచి అంగుళమైనా కదలకుండా, పైవాళ్ళకి జాగా ఇవ్వరు. ఈ కొస నుంచి ఆ కొస దాకా రైలు చూసిన తరువాత చారుమతి, "ఈ రోజు ఈ రైల్లో ఎక్కలేం. తిరిగి కాకినాడ వెళ్లిపోదాం" అంది.

రాధాకృష్ణ ఒక మొదటి తరగతి పెట్టె దగ్గిర ఆగి కూలీతో "సామాను ఇందులో పెట్టు. అమ్మాయిగారిని ఎక్కించు. నేను టికెట్లు మార్చుకు వస్తాను" అని చెప్పి, చారుమతి టికెట్ కూడా తీసుకుని పరిగెత్తాడు.

చారుమతి అయోమయంగా నుంచుంది. అది చాలా చిన్న పెట్టె. రెండు బెర్తులు మాత్రం ఉంది ఇద్దరు మనుషులకి నిర్ణయించబడింది. కానీ ఈ రోజు అందులో నలుగురు పెద్ద మనుషులు కూర్చుని ఉన్నారు.

రైలు కదులుతూ ఉంటే రాధాకృష్ణ వచ్చి ఎక్కాడు. అయోమయంగా తలుపు దగ్గిరే నిలబడి ఉన్న చారుమతిని చూసి, "అదేం? కూర్చోలేదేం?" అంటూ సీటు కోసం చూశాడు. అది గమనించి, పెద్ద మనుషులు కిటికీ దగ్గిర వీళ్ళకి కొంచెం జాగా చేసి తాము సర్దుకున్నారు.

చారుమతి పక్కనే కూర్చున్న రాధాకృష్ణ తగిలినప్పుడల్లా తేళ్ళూ, జెర్రులూ ఒంటి మీద పాకినట్లు భయపడుతూ కిటికీకి అంటుకు పోయి కూర్చుంది.

తండ్రి తన చేతికి పదిహేను రూపాయలు ఇచ్చాడు. ఇప్పుడు ఈ మొదటి తరగతి టికెట్ కు ఎంత డబ్బు ఇవ్వాలో? మళ్ళీ తిరుగు ప్రయాణం ఎలాగో? ఈ అవస్థలు లేకుండా కాకినాడ తిరిగి వెళ్లి పోవలిసింది. ప్రయాణం తలచుకున్న కొద్దీ రాధాకృష్ణ మీద చికాకు కలిగింది. తనను అడగకుండా పెట్టకుండా మొదటి తరగతికి టికెట్ మార్చడం, తన పక్కన కూర్చోవడం ఏమిటీ?

తుని స్టేషన్ వచ్చింది. నలుగురు పెద్ద మనుషులు దిగిపోయారు. రాధాకృష్ణ వెంటనే లోపలి నుంచి తలుపు వేసి గడియ బిగించి, "అమ్మయ్య! కొంచం ఊపిరి పీల్చుకోవచ్చు. ఇంకా ఎవ్వరూ ఎక్కకుండా ఉంటే బాగుండును" అన్నాడు ఒళ్ళు విరుచుకుంటూ.

తామిద్దరమే ఒంటరిగా ప్రయాణం చెయ్యాలని తెలిసి చారుమతి, 'భగవంతుడా! ఎవ్వరైనా ఎక్కితే బాగుండును' అనుకుంది.

భగవంతుడు చారుమతి మొర ఆలకించలేదు. ఎవరు ఎక్కకుండానే రైలు కదిలింది.

"కాస్సేపు రెస్టు తీసుకున్నట్టు ఉంటుంది. పడుకుంటారా?" రాధాకృష్ణ చారుమతిని చూస్తూ అడిగాడు.

"ఊహూ" అంది కిటికీలోంచి చెట్లను, బయళ్ళను చూస్తూ.

"మీరు ఏమీ అనుకోను అంటే నేను ఒకటి చెబుతా."

"ఏమిటి?"

"మీకు చదువుకోవాలని చాలా కుతూహలం కదూ. మీరు ఈ ఏడే కాలేజీలో చేరండి. మీరెంతవరకు చదివితే అంతవరకు నేను డబ్బు ఇస్తాను."

తను చదువుకోవడమేమిటి? దానికతను డబ్బివ్వడమేమిటి? అర్థం కానట్టు ఆశ్చర్యంగా చూసింది అతని వేపు.

"మీరు మరోలా అనుకోకండి. మా నాన్న మంచి పేరున్న ప్లీడరని తెలుసు కదా! ఆయన బోల్డు సంపాదిస్తున్నారు. ప్రతి నెల కొంత డబ్బు నా పేరా, మా తమ్ముడి పేరా బాంకులో వెయ్యడం ఆయనికి చాలా ఏళ్లుగా అలవాటు. నా పేర ఇప్పుడు పాతిక వేలదాకా ఉంటుంది. అందులోనించి నేను మీకు సహాయం చెయ్యగలను."

ముక్కు, మొహం తెలియని ఆడపిల్లకి డబ్బు ఇస్తాననడంలో ఈయన ఉద్దేశమేమిటి? మౌనంగా కూర్చున్న చారుమతిని చూస్తూ మళ్ళీ రాధాకృష్ణే అన్నాడు నవ్వుతూ.

"మీరీ విషయం, అంటే నేను మీకు డబ్బు ఇస్తున్నట్లు ఎవరికీ చెప్పకండి. పైవాళ్ళకి ఇలాంటివి తెలిస్తే బాగుండదు. మనిద్దరి గురించి ఏమైనా ఊహించుకోవచ్చును."

అతని నవ్వు చూస్తే విపరీతమైన అసహ్యం వేసింది చారుమతికి. ఇంతసేపు అతని సంభాషణలో అర్థం కానిదేమిటో అర్థం అయిపోయినట్టు అనిపించింది.

"ఏమంటారు?" అన్నాడు అతను కుతూహలంగా.

"ఏమీ లేదు" అంటూ పెట్టె లోంచి బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' పుస్తకం తీసుకుని మధ్యలోంచి చదవడం మొదలు పెట్టింది.

రాధాకృష్ణ తన పర్సులోంచి చారుమతి టికెట్ తీసి సీటు మీద పడి ఉన్న ఆమె హాండ్ బాగ్ లో పెట్టాడు.

చాలా దగ్గిరయిన స్నేహితులతో కూడా చెప్పుకోలేని స్వవిషయాలు ఒక్కొక్కప్పుడు అపరిచితులతో చెప్పేసుకుంటాం. ఇలాటివి సాధారణంగా ప్రయాణాలలో జరుగుతూ ఉంటాయి. ఎదటి వ్యక్తి సానుభూతి చూపిస్తున్నట్లు, శ్రద్ధ చూపిస్తున్నట్టు తోస్తే, మన మనసుల్లో భారాలు దించేసుకోవడం జరుగుతుంది. ఇవి ఆకస్మికాలు. ముందు ఆలోచించి, 'ఇలా చెప్పాలి, వీళ్ళతో చెప్పాలి' అని అనుకున్నవి కావు. 'ఆ అపరిచితుడు ఇక మళ్ళీ మన జీవితంలో కనిపించడు. అతనితో చెప్పుకోవడం వల్ల ఒరిగే నష్టమేమి లేదు!' అన్న నిశ్చింత మనని పురిగొల్పుతుందేమో! అంతే కాని, మన కష్టాలు విని, ఎదటి వ్యక్తి ఏదో సహాయం చెయ్యాలని ఆశించము. సహాయం చెయ్యడానికి పూనుకుంటే అహం దెబ్బ తింటుంది.

ఇదే ఇక్కడ జరిగింది. తను చెప్పినవి శ్రద్ధగా వింటునట్టు కనిపించిన అపరిచితుడైన రాధాకృష్ణతో చారుమతి తన సంసార విషయాలు, కష్ట సుఖాలు చెప్పేసుకుంది. అతను సహాయం చెయ్యబూనుకోవడం, దాని వెనక అసహ్యమైన భావం ఉండడం చూసి ఇప్పుడు సహించలేక పోయింది.

'ఛ! ఎంత పొరపాటు చేశాను!' అనుకుంది బాధగా. పుస్తకం చేతిలో ఉన్నా, ఒక్క అక్షరం కూడా చదవడం లేదు.

రాధాకృష్ణ చారుమతినే చూస్తున్నాడు. కనుముక్కు అంత తీరుగా లేకపోయినా, తెల్లని ఒంటి రంగుతో మెరిసిపోతూ ఆకర్షణీయంగా ఉంది చారుమతి. బారెడు నల్లని జడ. జూన్ నెలైనా ఇంకా విపరీతమైన ఎండగా ఉంది. కిటికీ లోంచి కొడుతున్న ఎండ గాలికి తెల్లటి బుగ్గలు ఎర్రగా కంది, ముఖం చాలా అందంగా ఉంది.

'జామ పండులా ఉంది మనిషి' అనుకున్నాడు రాధాకృష్ణ.

"ఏమండీ! మన కంపార్టు మెంటు ఏర్ కండిషన్ చేసుకుందామా?" అంటూ చారుమతి సమాధానం కోసం చూడకుండానే కిటికీ తలుపులన్నీ వేసేశాడు.

"ఇప్పుడు చల్లగా ఉంటుంది చూడండి. పాపం! మీరు ఇంత సేపు కిటికీ దగ్గిర ఎండలో కూర్చున్నారు" అన్నాడు.

చారుమతికి భయం వేసింది.

"తరువాత స్టేషను ఏమిటి?" అంది.

"అనకాపల్లి."

"ఎంత సేపు ఆగుతుంది?"

"అయిదు నిమిషాలు కూడా ఆగదేమో." రాధాకృష్ణ వాచీ చూసుకున్నాడు.

మూసేసిన కిటికీ తలుపులు తీసింది చారుమతి.

"మళ్ళీ ఎందుకండీ తలుపులు తీస్తారు? అనకాపల్లిలో ఎవరైనా ఎక్కెయ్యగలరు." కంగారుగా అన్నాడు రాధాకృష్ణ.

"అనకాపల్లి స్టేషను చూడాలండీ. తొందరగానే మూసేస్తాను."

రాధాకృష్ణ తన హోల్డాలు పై బెర్తు మీద పరిచాడు. ఒక దుప్పటీ, తలగడా తీసి కింది సీటు మీద పెట్టాడు. సావకాశంగా దుప్పటీ సీటు మీద పరిచి, తలగడా వెనక్కి వేసి జారబడి కూర్చున్నాడు. అతనిలో ఏదో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. సన్నగా ఈల వేస్తున్నాడు.

"చిగురాకులలో చిలకమ్మా. చిన్న మాట సెలవీవమ్మా." ఆ ఈల పాట వింటున్న కొద్దీ భయంతో వణికింది చారుమతి. మనస్సులో భగవంతుణ్ణి ప్రార్థించుకుంది. గోముఖ వ్యాఘ్రంలా ఉన్న ఇతనిని సాయంగా పంపిన తండ్రిని మనసులోనే నిందించుకుంది.

అనకాపల్లి స్టేషను వస్తూంది అనగా తువాలు, సబ్బుపెట్టె తీసుకుని బాత్ రూములోకి వెళ్ళాడు రాధాకృష్ణ.

భగవన్నామ స్మరణ చేసుకుంటూ కంగారుగా తలుపు దగ్గిరే నిలబడింది చారుమతి. అనకాపల్లి స్టేషను వచ్చింది. రాధాకృష్ణ బాత్ రూములో నుంచి బయటికి రాలేదు. తలుపు తీసుకుని తన పెట్టె, బుట్ట తీసుకుని, గబగబా దిగి పక్క మూడవ తరగతి పెట్టెకు పరిగెత్తింది. జనంతో క్రిక్కిరిసి కాలు పెట్టడానికి వీల్లెక్కుండా ఉన్న ఆ పెట్టె దగ్గిర దిక్కు తోచక నుంచుంది చారుమతి. గార్డు విజిల్ వేశాడు. రైలు కదిలింది.

"ఓలమ్మో! ఆడ కూతురు నిలబడి పోనాది" అంటూ జబార్దస్తీగా, వస్తాదులా ఉన్న ఓ గవర మనిషి చారుమతిని పెట్టెలోకి పైకి లాగేసింది.

'నా మొర ఆలకించి దేవుడు ఈమెను పంపాడు' అని మనసులో ఆమెకి వెయ్యి నమస్కారాలు చేసింది చారుమతి. విశాఖపట్నం వచ్చేవరకు, గంటన్నర నిలుచునే ప్రయాణం చేసినా, మొదటి తరగతి ప్రయాణం కంటె లక్ష రెట్లు హాయిగా ఉన్నట్టు అనిపించింది.

'మగవాడిని ఎప్పుడూ నమ్మకూడదు.' తెలిసి వచ్చింది చారుమతికి. అనకాపల్లిలో దిగి రాకపోతే ఏం జరిగేది? తలుచుకున్నప్పుడల్లా ఆ రాత్రే కాక, చాలా రోజుల వరకు ఎన్నో రాత్రులు నిద్ర పట్టక వణికి పోయేది. ఈ సంఘటన చారుమతి హృదయానికి ఒక పెద్ద దెబ్బలా నిలిచి పోయింది.

4

పెళ్లి వారంతా మద్రాసు రైల్లో ఎక్కారు. పద్మ తల్లి పక్కనే కూర్చుని కిటికీలో నించి బయటికి చూస్తూంది. పెళ్లి ముందు శ్రీదేవి, చారుమతి తన్ను ఏడిపించడం గుర్తుకు వచ్చింది. దాంతో ముగ్గురు ఇన్నేళ్ళు గడిపిన మధురమైన జీవితం జ్ఞప్తికి వచ్చింది. రోజూ సాయంత్రం ముగ్గురు శ్రీదేవి వాళ్ళ ఇంట్లో కలుసుకునే వాళ్ళు. శ్రీదేవి కాలేజీ లైబ్రరీలో నించి పుస్తకాలు తెచ్చేది. మొదట్లో నవలలు తెచ్చేది. ముగ్గురు చదివాక, పెరట్లో మామిడి చెట్టు కింద గడ్డిలో కూర్చుని కథ, పాత్రల గురించి చర్చించుకునే వాళ్ళు. క్రమేపి నవలలో నించి నేటి తెలుగు కవిత్వం మీదికి మళ్ళింది వాళ్ళ దృష్టి. గురజాడ అప్పారావు, వేంకట పార్వతీశ కవులు, అడవి బాపిరాజు, పింగళి, కాటూరి, నండూరి, శ్రీ శ్రీ, కృష్ణ శాస్త్రి, కరుణశ్రీ, నారాయణరెడ్డి, దాశరథి,ఆరుద్ర... వరసగా అందరి కవుల రచనలు చదివారు. చదువుతున్న కొద్ది రోజు రోజూ ఎంతో ఉత్సాహం పొంగేది. ఒక రోజు శ్రీదేవి ముద్దుకృష్ణ సంకలనం 'వైతాళికులు' తెచ్చింది. "అన్ని పుస్తకాలు కొనుక్కోలేని వాళ్లకు ఇది ఒక్కటి చాలు" అంది చారుమతి.

పుస్తకాలు చదవడం కూడా ఒక వ్యసనమే. 'వైతాళికులు' లోని రచనలు, శ్రీదేవి, పద్మ ఎన్నుకున్నవి చారుమతి భావయుక్తంగా తియ్యగా పాడేది. పద్మకి పెళ్లి నిశ్చయం అయ్యాక ఏడిపించడానికి ప్రేమ పాటలు, ప్రేమ కవిత్వం వినిపించేవారు స్నేహితురాళ్లిద్దరు.

"ఇంకేం ఉంది! పెళ్లి అవగానే పద్మ మనల్ని మరిచి పోతుంది. ఆయన దగ్గిరికి ఎప్పుడు వెళ్ళిపోదామా అని ఇప్పటి నించే ప్రతి క్షణం ఎదురు చూస్తూ ఉంటే!" అంది శ్రీదేవి ఒక రోజు.

"కృష్ణశాస్త్రి రచనలోలా ఆయన 'పల్లకీ' పంపుతారేమో" అంది చారుమతి నవ్వుతూ.

"ఏదీ 'పల్లకీ' పాడు చారూ!" బలవంతం చేసింది శ్రీదేవి.

ముగ్గురికీ ఇష్టం ఆ రచన. పద్మకు ఇప్పుడు అందులో కొత్త అర్థాలు స్ఫురించాయి.

చారుమతి తీయటి గొంతుకతో పాడింది.

"ప్రాణ సఖుడె నాకోసమై పంపినాడు
పల్లకీ అన హృదయమ్ము జల్లు మనియె
వీడని వియోగమున వేగు మ్రోడు మేను
తలిరు తోరణమై సుమధామ మాయె!
చెదరు చేతుల నెటో కలిసేసుకొంటి
మెయిలు వసనమ్ములో, ప్రొద్దు పొడుపు నగలొ,
ఏదో కాలుచు హాయియో, ఏదో తేల్చు
భారమే ఏమో... సైరింప నేరనైతి!

కొసరు నడల దూగాడుచు కూరుచుంటి

పూల పల్లకిలో పూలమాల నేను!"

"పద్మా!" అన్న తల్లి పిలుపుతో మళ్ళీ ఈ లోకంలో పడింది పద్మ.

"ఎంత సేపు అలా కూచుంటావు? కిటికీ లోంచి అలా బయటికి చూడకమ్మా. నిప్పురవ్వలు కళ్ళలో పడగలవు! కాస్సేపు పడుకోకూడదూ?' అంది వరలక్ష్మి .

"నిద్ర రావడం లేదమ్మా" అని పద్మ మళ్ళీ ఆలోచనల్లో పడింది.

స్నేహితురాళ్ళ ఊహలకి, పద్మ అనుభావాలకి సాపత్యమే లేదిప్పుడు. పద్మ ఒక పెట్టెలోను, మాధవరావు వేరొక పెట్టెలోను కూర్చున్నారు. దారిలో మాధవరావు ఒక్కసారి కూడా పద్మని చూసి వెళ్ళ లేదు. "సిగ్గేమో? మొహమాటమేమో!" అనుకుంది.

మద్రాసులో కాంతమ్మగారి ఇంట్లో గృహప్రవేశం పెద్ద ఎత్తున జరిగింది. పేరంటాలు, భోజనాలు హడావిడి అంతా అయ్యాక సాయంత్రం కాంతమ్మగారు సావకాశంగా కూర్చున్నప్పుడు వరలక్ష్మి మళ్ళీ శోభనం గురించి ఎత్తింది.

"వదినగారూ! ఆ శోభనం వేడుక కూడా ఈ రాత్రి అయిపోతే, మూడు నిద్రలు అయ్యాక మేము శనివారం వెళ్ళి పోవచ్చును. ఇవ్వాళ అదీ అయిందనిపించెయ్యండి."

"ఇప్పటి పిల్లలకు మనం చెప్పలేమండీ. అమ్మాయి ఇంకా చదువుకోవాలని అంటున్నాడు అబ్బాయి. శోభనానికి తొందర ఏముంది? ఇద్దరూ ఇంకా చిన్నవాళ్ళే కదా! అమ్మాయిని రెండేళ్ళు ఉంచుకుని చదివించండి." కాంతమ్మగారు అసలు విషయం మెల్లిగా తేల్చారు.

వరలక్ష్మి కి అయోమయంగా ఉంది. శోభనం చేసుకోకుండా చదివించమనడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇప్పుడు మరి కాపరానికి తెచ్చుకోరా?"

"అమ్మాయి చదువు అవనీయండి ముందు. కాపరం మాట తరువాత చూద్దాం. ఆ.. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మేము మద్రాసులో ఉంటున్నామా! ఎవరి మధ్య ఉంటే వాళ్ళ ఆచారాలు పాటించక తప్పదు. చూడండి, కోడలు రవ్వల దుద్దులతో, తగినంత సారెతో రాకపోతే మాకు తల కొట్టేసినట్టు ఉంటుంది. ఏమి ఇచ్చినా, ఇవ్వకపోయినా స్టీలు గిన్నెల సెట్టు, రవ్వల దుద్దులు పెట్టాలి అమ్మాయికి మీరు. మా గౌరవం కాపాడాలి." చావు కబురు చల్లగా చెప్పినట్టు చెప్పింది కాంతమ్మ.

వరలక్ష్మి కి గుండెలో రాయి పడింది. బోలెడు కట్నం, లాంఛనాలు, అతి వైభవంగా పెళ్ళి జరపడానికే ఉన్నదంతా ఖర్చు అయిపోయింది. రవ్వల దుద్దులంటే మాటలా? మళ్ళీ ఎక్కడినించి తెస్తారు?

పద్మ ఏ తీపి అనుభవము, ఏ మధురభావము లేకుండానే పుట్టింటికి వచ్చేసింది. 'కూతురుకి పెళ్ళి చేశాం. పెళ్ళి బాగా జరిగింది' అన్న సంతోషం పోయి, వరలక్ష్మి మనస్సులో దిగులు ఆవరించింది.

## 5

రేవతి భర్త గోపాలరావుకి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీసులో పని. దాబా గార్డెన్స్ లో ఇల్లు తీసుకున్నాడు. పెద్ద జీతపరుడు కాక పోయినా, అప్పులు చేయకుండా భార్యాబిడ్డలను పోషించుకు రాగలుగుతున్నాడు. చారుమతికి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. టీచరు ఉద్యోగం దొరక్క పోయినా, ఏదో ఒకటి దొరికితే చాలని నలుగురు పెద్దల దగ్గిరికి ఆఫీసులకి తిరిగాడు. పది రోజులు గడిచినా ఏ ప్రయత్నమూ అనుకూలించ లేదు. ఇంతలో కాకినాడ నుంచి భానుమతి చెల్లెలు చారుమతికి ఉత్తరం వ్రాసింది. అందులో సూర్యారావుకి హార్టు అటాక్ వచ్చిందనీ, ఆసుపత్రిలో చేర్చారనీ, వెంటనే రేవతినీ, పిల్లలనీ వెంటబెట్టుకుని వచ్చేయ్యమనీ వ్రాసింది.

ఉత్తరం చూసుకుని చారుమతి, రేవతి, పిల్లలు కాకినాడ బయలు దేరారు. దారిలో అక్క చెల్లెళ్ళు ఇంటి విషయాలే మాట్లాడుకున్నారు.

రేవతి అడిగింది. "నాన్నకి ఒంట్లో బాగులేదా? నువ్వు చెప్పనేలేదేం?"

"నాన్నకి ఎప్పుడూ ఉన్న అనారోగ్యమే. ఉబ్బసంతో రాత్రి నిద్ర పట్టకుండా బాధ పడతారు. మందులు వేసుకుంటూంటే మధ్య తగ్గుతుంది. హార్ట్ అటాక్ ఎలా వచ్చిందో తెలీదు." దిగులుగా అన్నది చారుమతి.

రేవతికి ఎదిగిన చెల్లెళ్ళ పెళ్ళి సమస్య మనస్సులో వేధించింది.

"భానుకు ఏమైనా సంబంధాలు చూస్తున్నారా?"

"ఏం చూస్తారక్కా? ఇంటి విషయం నీకు తెలియంది ఏముంది? నాన్న జీతమంతా తిండికి, చదువులకి సరిపోతుంది. కట్నాలకి డబ్బు ఎక్కడినించి తేగలరు?"

"నిజమేననుకో? కాని భానును ఎన్నాళ్ళు ఉంచుకుంటారు. మీరైతే అంతా ఏదో చదువుకుంటున్నారు. భాను చదువు వానా కాలం చదువై పోయింది. థర్డు ఫారం కూడా గట్టెక్కని దాని బ్రతుకేం గాను?"

చారుమతి మాట్లాడలేదు. ఆలోచిస్తూ కూర్చుంది. భానక్క కూడా చదువుకుని ఉంటే బాగుండును. కాని ఇరవై మూడేళ్ళ భానుకి ఇప్పుడు చదువు బుర్రకేం ఎక్కుతుంది?

ఇద్దరు ఇంటికి చేరేసరికి సూర్యారావును ఆసుపత్రి నించి ఇంటికి తీసుకు వచ్చేశారు. మధ్య గదిలో కిటికీ పక్క వేశారు అతని మంచం. కూతుళ్ళిద్ధరినీ చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు ఆయన. "వచ్చారా, అమ్మా" అని ఇద్దరినీ చెరో చేత్తోనూ దగ్గిరికి తీసుకుని కళ్ళ నీళ్ళు నిపుకున్నారు. ఆయన కళ్ళలో ఏదో దిగులు, భయం. తండ్రి పరిస్థితి చూసిన కూతుళ్ళిద్దరూ నీరుగారి పోయారు. రేవతి దిగులు మింగుకుని అనునయంగా తండ్రిని అడిగింది. "ఎలా ఉంది నాన్నా ఒంట్లో?"

కంట నీరు పెట్టుకొంటున్న చారుమతిని భాను పక్క గదిలోకి లాక్కు వెళ్ళింది. "నాన్నతో ఎక్కువ మాట్లాడించ వద్దనీ, పూర్తి విశ్రాంతి ఇవాలనీ డాక్టరు గారు చెప్పారు. ఆయనకి బాధ కలిగించే పనులేవీ చెయ్యకూడదు మనం" అని చెప్పింది. అక్క ఒళ్లోనే తల పెట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది చారుమతి.

సూర్యారావు అనారోగ్యం గురించి విని తెలిసిన వాళ్ళంతా చూడడానికి వచ్చారు. సాయంత్రం శ్రీదేవి వచ్చింది. తను బి.ఏ. లో చేరింది. చారుమతి, శ్రీదేవి డాబా మీదికి వెళ్లి కూర్చున్నారు. చారుమతి తన ప్రయాణ విశేషాలు, రాధాకృష్ణతో పరిచయం, అతనితో జరిగిన భయంకరమైన అనుభవం, అన్నీ చెప్పింది. అంతా విని నొచ్చుకుంది శ్రీదేవి.

"విశాఖపట్నం వెళ్ళినందుకు ఈ అనుభవమే మిగిలింది. పనేమీ కాలేదు" అంది చారుమతి.

"మగవాళ్ళు మంచిగా ఎందుకుండలేరో తెలీదు. పెళ్లయినవాడు కదా. అతను ఎందుకు అలా ప్రవర్తించాడో?" అంది శ్రీదేవి.

"అతనికి పెళ్లి అయిందా?' ఆశ్చర్యంగా ప్రశ్నించింది చారుమతి.

"బాగుందే, పదిహేనువేలు కట్నం తీసుకుని అమలాపురం అమ్మాయిని చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. అతని భార్య ఎంతో బాగుంటుంది. రంభలా ఉంటుంది. ఇతనే దెయ్యంలా ఉంటాడు."

"నీకు ఇతను తెలుసా?"

"తెలియకేం? మా మామయ్య కూడా లాయరు కదా! రాధాకృష్ణ నాన్నగారు, మామయ్యా స్నేహితులు. ఇతను ప్రాక్టీసు విషయం పట్టించుకోడనీ, డబ్బు అల్లరిచిల్లరిగా తగలేస్తాడనీ వాళ్ళ నాన్న మామయ్య దగ్గిర ఎప్పుడూ గోల పెడతాడట."

చారుమతి వింటూ తెల్లబోయింది. 'శ్రీదేవి మామయ్యకు ఇన్ని విషయాలు తెల్సినప్పుడు, వాళ్ళ ఇంట్లోనే పనిచేస్తున్న నాన్నకి రాధాకృష్ణ విషయాలేవీ తెలియవా? తెలిసీ పట్టించుకోడా? ఇంత అమాయకుడేమిటి నాన్న?" అనుకుంది చారుమతి.

మౌనంగా కూర్చున్న చారుమతిని చూస్తూ శ్రీదేవి అంది.

"పద్మ కాలేజీలో చేరింది, తెలుసా? ఇంటర్ లో చేరింది. నిన్నటి నుంచి కాలేజీకి వస్తూంది."

"పద్మ మద్రాసు నించి ఎప్పుడు వచ్చింది? మళ్ళీ చదువుతుందా?" ఆశ్చర్యంగా అడిగింది చారుమతి.

"మద్రాసు నించి వచ్చి వారం రోజులయింది. వాళ్ళ అత్తగారూ వాళ్ళు పద్మని చదివించమన్నారట."

"ఎంత అదృష్టం పద్మది! చదువు యోగం ఉంటే ఎలాగో అలాగా చదువుకునే అవకాశం వస్తుంది" అంది చారుమతి తనకు కాలేజీలో చదివే భాగ్యం లేనందుకు చింతిస్తూ.

చదువులోంచి మళ్ళీ ఇంటి పరిస్థితుల మీదికి మళ్ళింది ప్రసక్తి. తండ్రి మాట తలపోస్తూ, "శ్రీదేవి! నాకేదైనా ఉద్యోగం దొరికితే బాగుండునే. నాన్నకి కొంచెం ఆసరాగా ఉండవచ్చు ఆయన పని తగ్గించుకుని కొంచం విశ్రాంతి తీసుకోవచ్చు." బాధ పడుతూ అంది చారుమతి.

"మనం గరల్స్ హైస్కూలుకు వెళదాం. ఒకసారి. హెడ్ మిస్ట్రెస్ ఏమైనా సహాయం చెయ్యవచ్చు" అంది శ్రీదేవి.

ఆ సూచన చారుమతికి కూడా నచ్చింది.

"సరే. ఎల్లుండి మధ్యాహ్నం మనం ఆమె దగ్గిరికి వెళదాం. మీ ఇంటికి వస్తా. ఇద్దరం కలిసి వెళదాం" అంది.

శ్రీదేవి ఇంట్లో అందరి దగ్గిరా సెలవు తీసుకుని, సూర్యారావుగారికి నమస్కరించి వెళ్ళి పోయింది.

మరునాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక, అందరూ తలో మూల వాలారు ఇంట్లో. చారుమతి వీధి వైపు ఉన్న గదిలో కూర్చుని, కిటికీలోంచి అలా వీధిలోకి చూస్తూంది. శంకరం, మాలతి, భగవతి స్కూళ్ళకి వెళ్ళి పోయారు. అమ్మా, నాన్నమ్మా వెనక వరండాలో మేను వాల్చారు. భానక్క వరండాలో కూర్చుని జాకెట్టు కుడుతోంది.

"అమ్మా చారూ! ఇలా రా!" నాన్న గొంతు సన్నగా వినిపించింది.

"ఏం కావాలి నాన్నా?" అంటూ లోపలి పరిగెత్తింది చారుమతి.

"చూడమ్మా. నా కోటు జేబులో పాతిక రూపాయలు, మనియార్డరు ఫారం ఉన్నాయి. ఇలా తీసుకురా."

చారుమతి కోటు జేబులో నించి డబ్బు, మనియార్డరు ఫారం తీసింది. ఫారం తండ్రి వ్రాతలోనే పూర్తి చేసి ఉంది. "బి. శారదమ్మ, కోట వీధి, విజయనగరం" అన్న అడ్రసు. కొత్తగా ఉన్న ఆ పేరు చూసి చారుమతి ఆశ్చర్య పోయింది.

సూర్యారావు ఫారం తీసుకుని సరిగ్గా ఉందో లేదో చూశాడు.

"పోస్టాఫీసుకి వెళ్ళి మనియార్డరు చేసి వస్తావా తల్లీ?" అన్నాడు మనిఆర్డరు ఫారం, డబ్బు చారుమతి చేతిలో ఉంచుతూ.

చారుమతి కుతూహలం నిగ్రహించుకోలేక పోయింది.

"ఎవరు నాన్నా ఈమె? ఎప్పుడూ ఈ పేరు వినలేదు. ఎందుకు డబ్బు పంపుతున్నావు?"

"ఈమె నీకు మేనత్త వరస అవుతుంది. నాకు పినతల్లి కూతురు. భర్త లేదు. బొత్తిగా బీదరికంలో ఉంది. అందుకే ఈ డబ్బు పంపుతున్నాను. ఎంతలే తల్లీ! ఈ డబ్బు ఏం సరిపోతుంది ఆమెకు? నా చేతనైనది పంపుతున్నానన్నసంతృప్తి కోసం పంపడం." సగం పైకి, సగం స్వగతంగా మాట్లాడాడు సూర్యారావు.

'ఎన్నాళ్ళ నుంచి పంపుతున్నావు? అమ్మకి తెలుసా?' ఎన్నో ప్రశ్నలు చారుమతి లోపలే అణిచి వేసుకుంది. ఎక్కువగా మాట్లాడితే తండ్రికి ఆయాసం రావచ్చు.

చారుమతి మాట్లాడకుండా పోస్టాఫీసుకు వెళ్లి డబ్బు పంపించింది. మనసులో మాత్రం మధన పడుతూనే ఉంది. ఇంట్లో అంతా డబ్బుకు ఇబ్బంది పడుతూంటే, ఈయన పాతిక రూపాయలు ఎవరికో ఎత్తి పంపడమేమిటీ?

**ఆగస్టు నెల ఏడవ** తారీఖున చారుమతి గరల్సు హైస్కూల్లో ఉద్యోగంలో చేరింది. ఫస్టు ఫారం, సెకండ్ ఫారం వాళ్లకి ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు చెప్పాలి. ఆ రోజు చాలా సంతోషంగా ఉంది చారుమతికి. తండ్రికి కొంచెం ఆరోగ్యం కోలుకుంది.

సాయంత్రం శ్రీదేవి, పద్మ చారుమతి ఇంటికి వచ్చి అభినందనలు చెప్పారు. పద్మను చూసి కొంచెం ఆశ్చర్య పోయింది చారుమతి. ఎందుకో బాధ పడుతున్నట్లుంది పద్మ. కొత్త పెళ్లి కూతురులో తొంగి చూసే ఉత్సాహం, కొత్త కళ లేవు.

"పద్మ అలా ఉందేం?" అంది చారుమతి శ్రీదేవిని చూస్తూ.

"ఇవాళ తన శ్రీవారి దగ్గిరినుంచి ఉత్తరం రాలేదు. అందుకే చిన్నబోయింది అమ్మాయిగారి ముఖం" అంది శ్రీదేవి పద్మని హాస్యం చేస్తూ.

పద్మ నవ్వేసి ఊరుకుంది. కాని ఆ నవ్వు వెనకాల ఏదో దిగులు ఉన్నట్లు గ్రహించింది చారుమతి. కాని ఏమీ గమనించనట్లు ఊరుకుంది. పద్మని ఉత్సాహపరచాలని, "పింగళి– కాటూరి" రాసిన 'ప్రణయ లేఖలు' గుర్తుందా?" అని అడిగింది పద్మ వైపు చూస్తూ.

"ఏది?"

"మనకి చాలా నచ్చిన భాగం. అప్పుడే మరిచి పోయావా?"

"నిన్ను నెద నిల్పి నేను ధ్యానించునట్లు
నీవు నన్నెద నిల్పి ధ్యానింతువేని
అవ్యయామృత బిందు నిష్యంద మధుర
భావ సంయోగ రససిద్ధి బడయనగును!"

రాగ వరసలో చదివింది చారుమతి.

"విరహంలో ప్రణయం ఎక్కువవుతుందట. విరహం కూడా సుఖమే అంటారు అనుభవించిన వాళ్ళు" అంది శ్రీదేవి.

"మన అమ్మాయి తీరు చూస్తే విరహం సుఖంగా ఉన్నట్టు లేదు. ఎప్పుడెప్పుడు ఆయన ఒళ్లో వాలుదామా అన్నట్టుంది."

చారుమతి మాటలకు శ్రీదేవి గట్టిగా నవ్వింది. పద్మ నవ్వలేదు. పూర్వమైతే, "ఛీ ఛీ, వెధవ మాటలు!" అని అలక నటించేది.

"ఇంకో టాపిక్ ఏదైనా మాట్లాడ కూడదూ?" విసుగా మొహం పెడుతూ అంది పద్మ. అల్లరి చేస్తున్న స్నేహితురాళ్ళ నోళ్ళు కట్టుబడ్డాయి.

చారుమతే సంభాషణ మార్చి కాలేజీ విశేషాలలోకి దింపింది. కాలేజీలో మగపిల్లల అల్లరి గురించి, అమ్మాయిల అలంకరణ గురించి సంభాషణ గంట సేపు సాగింది. చీకటి పడగానే శ్రీదేవి, పద్మ లేచి వాళ్ళ ఇళ్ళకు వెళ్లి పోయారు.

రెండు నెలలు గడిచే సరికి చారుమతికి ఉద్యోగం అలవాటై పోయింది. పిల్లలకు పాఠాలు చెప్పడంలో కూడా ఎంతో ఆనందం ఉందనుకుంది. ముఖ్యంగా చెప్పిన పాఠం సరదాగా ఉంటే, అర్థం అవుతూ ఉంటే, పిల్లలు చూపే శ్రద్ధ, వాళ్ళ కళ్ళల్లో వెలిగే ఉత్సాహం చూస్తూ చారుమతికి తృప్తి కలిగేది. ఓపికగా, సరదాగా పాఠాలు చెప్పే చారుమతి అన్నా, ఆమె క్లాసు అన్నా పిల్లలు ఇష్టపడేవారు.

పిల్లల మధ్య స్కూలులో ఉన్నప్పుడంతా కాలం ఇట్టే నిశ్చింతగా గడిచి పోయేది. ఇంటికి వస్తే ఏదో శూన్యంగా ఉండేది చారుమతికి. రాత్రి పడుకుంటే లెక్కలేనన్ని కోరికలు, కలలు మనసులో ముసురు కునేవి. కాలేజీలో చదవాలి. డిగ్రీ తీసుకోవాలి. మంచి భర్త రావాలి. తనకి దొరకనివి తన స్నేహితురాల్లిద్దరికీ అందుబాటులో ఉన్నాయని తోచగానే ఒక్కసారి ఈర్ష్య లాంటి భావం ఎక్కడో మెదిలేది. తిరిగి తనని తనే తిట్టుకునేది. శ్రీదేవి, పద్మల మీద ఈర్ష్య ఏమిటి? వాళ్ళు కలకాలం సుఖంగా ఉండాలి. తనకు ఏమీ లభ్యం కాక పోయినా వాళ్ళయినా సంతోషంగా ఉండాలి. తన మనసులో నీచమైన భావాలు రాకుండా చూడమని భగవంతుణ్ణి ప్రార్థించేది.

ఆ ఏడాదే నవంబరు మొదటి తారీఖున ఆంధ్రప్రదేశ్ అవతరించింది. హైదరాబాద్ రాజధాని అయింది. ఆంధ్రుల కలలు పండాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీలో ఆంధ్ర వార్షికోత్సవాలు పెద్ద ఎత్తున మొదలు పెట్టారు. తనకు స్కూలు ఉండడం వల్ల ఉదయం జరిగే ఉపన్యాసాలకి వెళ్ళలేక పోయినా, రాత్రి నాటకాలకు వెళ్ళేది చారుమతి. రోజూ సాయంత్రం శంకరం ఆనాటి విశేషాలు చెప్పేవాడు.

"మిస్. పి. ఆర్. కాలేజీ ఎవరో తెలుసా?"

"ఎవరు?" అంది చారుమతి అతను అడిగేది ఏమిటో తెలియక.

"మీ ఫ్రెండ్ పద్మ. ఆమె ఇప్పుడు కాలేజీ బ్యూటీ. చాలా అందంగా ఉంటుంది. చారూ! అబ్బాయిలు పిచ్చివాళ్ళయిపోతున్నారనుకో."

నవ్వు వచ్చింది చారుమతికి. 'అమ్మాయిల అందం గురించి ఆలోచించేంత పెద్దవాడయి పోయాడా శంకరం' అనుకుంది మనస్సులో. వెంటనే ముందు రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. రాత్రి నాటకాలకి శ్రీదేవి, చారుమతి, పద్మ కలిసి వెళ్ళారు. ఆడిటోరియంలోకి అడుగుపెట్టగానే అరుపులు వినిపించాయి. "మిస్ కాలేజ్" "బ్యూటీ క్వీన్" అంటూ. కాని అది పద్మని గూర్చే అని తోచలేదు. పద్మలో ఏ భావం లేదు. తల వంచుకుని వచ్చి తమతో కూర్చుంది.

'లోకమంతా తన అందాన్ని మెచ్చుకున్నా, చేసుకున్న వాడు ఆ సౌందర్యాన్ని గుర్తించ లేకపోతే, ఆ అందానికి ఉన్న విలువేమిటి?' అనుకుంది పద్మ. ఈ బిరుదులు సంతోషం కంటె విచారమే ఎక్కువ చేసేవి పద్మలో.

మాధవరావు దగ్గిరినించి ఒక్క ఉత్తరం కూడా తను అందుకోలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆ రోజు మనస్సంతా చీకాకయి పోతుంది. రాత్రి నిద్ర పట్టదు.

## 7

"అబ్బబ్బ! ఏం చలి, ఏం చలి! ఈ ఘటం వెళ్ళిపోతే బాగుండును. ఈ చలి భరించలేనురా బాబూ" అంటూంది డెబ్బైఏళ్ల ముసలామె, సూర్యారావు తల్లి, నీళ్ళ కాగు కింద మంట దగ్గిర కూర్చుంటూ. ఆమెకి, చలికాలానికి అసలు పడదు. డిసెంబరు నెల మొదటి నుంచి సంక్రాంతి వెళ్ళే వరకూ రోజూ ఆవిడ చలి మీద విసుక్కుంటూ, "శ్రీమన్నారాయణుడు తొందరగా పిలిస్తే బాగుండును. ఈ చలి ఎన్నాళ్ళు భరించనూ?" అని గొణుక్కుంటూ ఉంటుంది. ముక్కోటి ఏకాదశినాడు పోవాలనీ, తిన్నగా వైకుంఠం చేరుకోవాలనీ ఆవిడ కోరిక. ఏకాదశి రోజంతా మరణం గురించే తలుచుకుంటుంది.

"మామ్మా! ఇవాళ వైకుంఠ ఏకాదశి. ఇవాళ ప్రయాణం అయితే మంచిది" అన్నాడు శంకరం మంట దగ్గిర చేరుతూ.

"ఎక్కడికిరా ప్రయాణం?" అంది ముసలమ్మ.

"ఎక్కడికేమిటీ? స్వర్గానికి... తిన్నగా శ్రీమన్నారాయణుని సన్నిధికి" అన్నాడు శంకరం.

పనిమీద అటే వచ్చిన శాంతమ్మ ఆ మాటలు విని నొచ్చుకుని, "ఏమిటిరా? పొద్దున్నే లేచి ఆ మాటలు? మామ్మతో హాస్యాలా? పెద్దతరం చిన్నతరం లేదురా?" అంటూ శంకరాన్ని చీవాట్లు వేసింది. ఆ మాటలు విన్న ఆడపిల్లలు సన్నగా నవ్వుకున్నారు.

ఇంతలో సూర్యారావు గట్టిగా దగ్గుతూ ఉండడం వినిపించి శాంతమ్మ, పిల్లలూ ముందరి గదిలోకి వచ్చారు. సూర్యారావు మంచం మీదినించి ముందుకు వంగి కూచుని దగ్గుతున్నాడు. భానుమతి వెంటనే మందుతెచ్చి ఇచ్చింది.

"ఇవాళ ఇంట్లోనే పడుకో నాన్నా! కోర్టుకి, ప్లీడరు గారి ఇంటికి వెళ్ళకు. విశ్రాంతి తీసుకో" అంది చారుమతి.

"తగ్గి పోతుందమ్మా" అన్నాడు సూర్యారావు.

"ఒక్కరోజు కోర్టుకు వెళ్ళకపోతే కొంపలంటుకు పోవు. మీ ఆరోగ్యం కంటె ఎక్కువా పని? ఇవాళ మానేయండి" అంది శాంతమ్మ.

సూర్యారావు అలాగే అన్నట్లు బుర్ర ఊపి ఊరుకున్నాడు. తొమ్మిదింటికి భోజనాలు కానిచ్చి చారుమతి, మాలతి, భగవతి స్కూళ్ళకి, శంకరం కాలేజికి వెళ్ళి పోయారు. పది గంటలకు సూర్యారావు కూడా కొద్దిగా ఎంగిలిపడి కోర్టుకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం అయిదు గంటలకు చారుమతి ఇంటికి వచ్చేసరికి సూర్యారావు పొద్దున్నలాగే దగ్గుతూ కనిపించాడు. కొద్దిగా ఆయాసం కూడా వస్తూంది. భానుమతీ, శాంతమ్మ చెరోపక్కా కూర్చున్నారు దిగులుగా.

"ఏమిటమ్మా ఇలా కూర్చున్నారు? నాన్నకి మళ్ళీ దగ్గు వచ్చిందా?" అడిగింది చారుమతి వస్తూనే.

"మళ్ళీ వచ్చిందమ్మా. మీ నాన్నగారు ఎవరి మాటేనా వింటారా ఏమైనానా? ఈ రోజు విశ్రాంతిగా ఇంట్లో పడుకోండి అంటే వినక పదిగంటలకంతా పరిగెత్తారు బయటికి. మూడింటికి 'దగ్గు వస్తూంది' అంటూ వచ్చేశారు. ఏం మాయదారి ఉబ్బసమో. మనిషిని పీల్చేస్తుంది." శాంతమ్మ నిష్టూరంగా మాట్లాడినా, ఆ మాటల వెనక భర్త మీద ప్రేమా, ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళనా ఉన్నాయి.

చారుమతి అక్కడే నిలబడి తండ్రి పరిస్థితి చూసింది. దగ్గుతో పాటు ఆయాసం వస్తూంది. తెరిపి లేకుండా దగ్గుతున్నారు.

"శంకరం రాలేదా కాలేజీ నుంచి? సరే, నేను డాక్టరు శ్రీ రామారావుగారిని పిలుచుకు వస్తాను" అని చేతిలో ఉన్న పుస్తకాలు టేబిల్ మీద పడవేసి వెళ్ళింది బయటికి.

డాక్టరుతో ఇంటికి వచ్చేసరికి గంట పట్టింది. ఇంట్లో శంకరం, మాలతి, భగవతి అంతా వచ్చి ఉన్నారు.

డాక్టరు సూర్యారావుని పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చాడు. "తగ్గిపోతుంది. లేకపోతే నాకు కబురు చెయ్యండి" అని వెళ్ళిపోయాడు.

సూర్యారావు కొద్దిగా మగతగా కనిపించాడు. దగ్గు కూడా కొంచెం తగ్గింది.

చుట్టూరా ఉన్న పిల్లల వాడిన ముఖాలు చూశాక గుర్తుకు వచ్చింది శాంతమ్మకు, ఉదయం తొమ్మిది గంటలకు తిన్న అన్నమే. మళ్ళీ సాయంత్రం కాఫీ నీళ్ళయినా తాగలేదని.

"భానూ! కుంపటి వెలిగించు. కొద్దిగా బియ్యం పడేస్తాను" అంది.

"నువ్వెందుకమ్మా. నేను చేసేస్తాను వంట" అని భానుమతి లోపలికి వెళ్ళి వంట ప్రయత్నం మొదలు పెట్టింది.

ముసలమ్మ సణుక్కుంటూ కంబళీ కప్పుకుని మూల కూచుని కొడుకు వైపే చూస్తూంది ఆందోళనగా. "మాయదారి రోగాలు!" గొణుక్కుంటూంది.

భానుమతి అన్నం, ఊరగాయ, మజ్జిగ వేసి చెల్లెళ్ళకీ, తమ్ముడికీ భోజనం పెట్టింది. వాళ్ళు తింటూండగానే మళ్ళీ సూర్యారావు దగ్గు వినిపించింది. దగ్గుతో బాటు విపరీతమైన ఆయాసం, ఊపిరి అందనట్లు కష్టం మీద శ్వాస తీసుకుంటున్నాడు. గబగబా చేతులు కడుక్కుని వచ్చిన శంకరాన్ని, చారుమతిని చూసి, "బాబూ! డాక్టరును పిలుచుకు రారా. ఈ బాధ భరించలేను" అన్నాడు.

శంకరం చొక్కా మార్చుకుని, తొందరగా బయటికి వెళ్ళాడు. ఇంట్లో అంతా డాక్టరు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు.

ఎదటి మనిషి బాధపడుతూంటే, నిస్సహాయంగా చేతులు ముడుచుకుని చూస్తూ కూర్చోవడమంత కష్టం, వ్యధ మరొకటి ఉండదు. ఆ వ్యక్తికి ఎలాగోలా సహాయం చేసి బాధ నివారించాలని ఉంటుంది. కానీ ఏమీ చెయ్యలేము. బాధపడుతున్న వ్యక్తి దగ్గిర వాడయితే చూస్తున్నవాళ్ళకి మరీ యమయాతనగా ఉంటుంది. సూర్యారావు చుట్టూ మూగిన ఆత్మీయులకు ఇప్పుడు అలాగే ఉంది. అతను అతిగా ఆయాసపడుతూ విపరీతంగా దగ్గుతూ ఉంటే, నిస్సహాయులై నుంచున్నారు. వాళ్ళ గుండెలను ఎవరో పిండుతున్నట్లు ఉంది.

శంకరం డాక్టరును తీసుకురావడానికి ముప్పావు గంట పట్టింది. ఆయన మళ్ళీ పరీక్షించాడు. ఈ సారి ఓ ఇంట్రావీనస్ ఇంజెక్షన్ ఇచ్చాడు. సూర్యారావుకు ఎదురుగా కూర్చున్నాడు.

"ఎలా ఉందండీ సూర్యారావుగారూ? ఏమైనా తగ్గినట్టు అనిపిస్తోందా? మత్తుగా ఉందా?" అని ప్రశ్నించాడు.

"చాలా ఆయాసంగా ఉంది డాక్టరుగారూ. ఏమీ తగ్గలేదు" అన్నాడు సూర్యారావు.

"తగ్గి పోతుందండీ. మీరు కొంచెం ఓపిక పట్టాలి. ఇంజెక్షన్ ఇచ్చానుగా తగ్గుతుంది." అతని మాటలలో ఓదార్పు, ధైర్యం కనిపించాయి అందరికీ.

డాక్టరు తిరిగి స్టెతస్కోపుతో సూర్యారావు గుండెలు పరీక్షించాడు. నాడి చూశాడు.

"శంకరం! అలా రావోయ్" అని బయటికి వెళుతూ పిలిచాడు.

శంకరం తిరిగి లోపలి వస్తూనే చారుమతిని ప్రక్క గదిలోకి పిలిచి, "నాన్నను పెద్దాసుపత్రిలో చేరిపిస్తే మంచిదన్నారు డాక్టరుగారు. నేను వెంటనే వెళ్ళి బండి తీసుకు వస్తాను. నువ్వు సిద్ధంగా ఉండు" అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

చారుమతి అయోమయంలో పడింది. 'ఇప్పుడు ఆసుపత్రిలో చేర్చడం ఎందుకు? ఇంట్లో అమ్మతో, మామ్మతో ఏమని చెప్పడం?' అనుకుంది. ఏమీ తోచలేదు. నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళి రెండు దుప్పట్లూ, ఒక రగ్గూ, దిండూ తీసుకుని తను చీర మార్చుకుంటూంటే, భానుమతి లోపలికి వచ్చి అడిగింది. "ఏం చెప్పారు డాక్టరు?"

"పెద్దాసుపత్రిలో చేర్చమన్నారట. నేను, శంకరం బండిలో నాన్నని తీసుకు వెళతాం. మామ్మకి సాయంగా మాలతిని, భగవతిని ఇంట్లో ఉంచి, ఇంట్లో పని చూసుకుని నువ్వూ, అమ్మా రండి" అంది.

సూర్యారావు పరిస్థితిలో మార్పు ఏమీ లేదు. భానుమతీ, చారుమతీ లోపలే నిశ్శబ్దంగా నుంచుండి పోయారు. ఇద్దరి మనసులలోఒకటే భయం.

శంకరం బండి తెచ్చిన శబ్దం విని ఇద్దరూ ముందరి గదిలోకి వచ్చారు. శాంతమ్మ కంగారుగా అడిగింది. "బండి ఎందుకు బాబూ?"

"నాన్నని ఆస్పత్రికి తీసుకు వెళ్ళాలమ్మా. డాక్టరు గారు చెప్పారు. అక్కడ పెద్ద డాక్టర్లు ఉంటారు కదా!"

శంకరం మాట్లాడుతూనే తండ్రిని లేవదీశాడు. ఇంతలో చారుమతి, భానుమతి బండిలో పక్క పరిచి, దిండ్లు పెట్టారు.

సూర్యారావు పైకి ఏమీ అనకపోయినా, తనని ఎక్కడికి తీసుకు వెళుతున్నదీ గ్రహించాడు.

"శాంతా! ఈ మారు నేను వెనక్కి రానేమో అనిపిస్తోంది" అన్నాడు భార్యవైపు తిరిగి.

"ఏమిటండీ ఆ మాటలు! క్షేమంగా మీరు ఇంటికి వస్తారు" అంది శాంతమ్మ, భర్త చెయ్యి పట్టుకుంటూ. కాని ఆమె కళ్ళ నిండా నీళ్ళు.

"అమ్మా! వెళ్ళుతున్నానమ్మా!" అన్నాడు సూర్యారావు తల్లి వైపు తిరిగి.

ముసలమ్మా గబుక్కున లేచి ముందరికి వచ్చింది.

"ఎక్కడికి తీసుకు వెళుతున్నారే మీ నాన్నని? బాబూ! నన్ను అన్యాయం చెయ్యకురా! నా తల కొరివి పెట్టాలిరా!" అంటూ ఏడుపు మొదలు పెట్టింది.

భానుమతి మామ్మని పట్టుకుని, "అలా ఏడవకు మామ్మా! నాన్నని రేపు తీసుకు వచ్చేస్తారు" అని ఊరుకోబెట్టడానికి ప్రయత్నించింది.

"అమ్మా భానూ! వెళుతున్నాను. మాలతి, భగవతి దగ్గిరికి రండమ్మా" అంటూ పేరుపేరునా వరసగా పిలిచాడు సూర్యారావు, అంత దగ్గులోనూ, ఆయాసంలోనూ. చారుమతి గుండె తరుక్కు పోయింది తండ్రిని చూస్తుంటే.

బండి వెళ్లి పోతుంటే తల్లీ, భార్య, ముగ్గురు ఆడపిల్లలూ బయటే నిలబడి పోయారు, కనిపించినంత వరకూ బండిని చూస్తూ.

శంకరం పై వైపు, చారుమతి కింది వైపు కూర్చున్నారు. తండ్రిని బండిలో పడుకో బెడదామని ఎంత ప్రయత్నించినా వీలులేక పోయింది.

"నేను పడుకోలేనమ్మా" అంటూ లేచి కూర్చున్నాడు సూర్యారావు. అతనికి పడుకుంటే ఎగశ్వాస వచ్చేది. ఊపిరి తీసుకోలేక పోయేవాడు. పిల్లలిద్దరూ చెరో పక్క పట్టుకుంటే మధ్యన కూర్చుని ఆయాసపడుతున్నాడు సూర్యారావు. "నా పని అయిపోయింది తల్లీ.. నాపని అయిపోయింది బాబూ" అంటున్నాడు దీనంగా.

రాత్రి పది గంటలు దాటింది. చలికాలం. వీధిలో ఎవరూ నడవడం లేదు. రోడ్డు మీద నిశబ్దం, బండి చక్రాల చప్పుడు ఏదో భయాన్ని కలిగిస్తున్నాయి. తండ్రి ఒంటి మీద రగ్గు సమంగా కప్పుతూ, దైవ ప్రార్థన చేస్తూ కూర్చుంది చారుమతి.

కాజువాలిటీ వార్డుకి తీసుకు వెళ్ళారు సూర్యారావుని. అక్కడ డాక్టర్లు ఎవరూ లేరు. ఒక హౌస్ సర్జన్ మాత్రం ఉన్నాడు. సూర్యారావు పేరూ అదీ రాసుకుని, అతను పరీక్షించడానికి దగ్గిరికి వచ్చేసరికి సూర్యారావుకి పెద్దగా దగ్గుతెర వచ్చింది. దగ్గు తగ్గగానే నోట్లోనించి నురగ రావటం కనిపించింది. నర్సు వచ్చి దూదిపెట్టి నురగ తుడిచి పారేసింది. హౌస్ సర్జన్ వెంటనే నర్సుని పిలిచి, "డాక్టరుని పిలుచుకురా" అని పంపాడు.

శంకరం, చారుమతి తండ్రికి చెరొక వైపు భయంగా నుంచున్నారు. సూర్యారావు 'నా పని అయిపోయింది' అన్నట్టు చేతులు తిప్పుతున్నాడు. మధ్య మధ్య నోట్లోనుంచి నురగ వస్తూ ఉంటే చారుమతి దూదితో తుడుస్తూ నుంచుంది. శంకరం హఠాత్తుగా ఏమనుకున్నాడో, "చారూ! నువ్విక్కడ ఉండు. అమ్మని తీసుకు వస్తాను" అని బయటికి పరిగెత్తాడు.

శంకరం అలా బయటికి వెళ్ళగానే డాక్టరు లోపలికి వచ్చాడు. చిన్నవాడైన ఆ డాక్టరుని చూసి చారుమతి మనసులో విసుక్కుంది. 'పెద్దవాడైతే బాగుండును. అన్నీ తెలుస్తాయి' అనుకుంది. డాక్టరు రాగానే సూర్యారావును పరీక్షించి, ఇంజెక్షన్ ఇచ్చాడు. నర్సుని పిలిచి, "పేషంట్ ని మగవాళ్ళ వార్డుకి తీసుకు వెళ్లి ఆక్సిజన్ ఇవ్వాలి. వెంటనే ఏర్పాటు చెయ్యి" అన్నాడు. ఆ మాట వింటూనే కుప్పకూలిపోయింది చారుమతి.

చారుమతి పరిస్థితి గ్రహించిన డాక్టరు దగ్గిరికి వచ్చి అడిగాడు. "ఈయన ఏమౌతారు మీకు?"

"మా నాన్నగారు" అంది చారుమతి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

"ధైర్యంగా ఉండాలి మీరు" అన్నాడు డాక్టరు అనునయంగా.

సూర్యారావుని మగవాళ్ళ వార్డుకి మారుస్తూ ఉంటే చారుమతి పక్కనే మౌనంగా నడిచాడు డాక్టరు. సూర్యారావు దగ్గు తగ్గు ముఖం పట్టింది. ఆయాసం తగ్గింది. మగతగా పడుకున్నాడు. 'ఇంజెక్షన్ పని చేసినట్టుగా ఉంది' అనుకుంది చారుమతి మనసులో. కొంచెం ధైర్యం వచ్చింది. డాక్టరు కూడా మంచివాడిలా ఉన్నాడు.

వార్డులో ఎక్కడా ఖాళీ లేదు. ఒక పేషెంట్ ని బెడ్ ఖాళీ చెయ్యమంది నర్స్. ఆయన చెయ్యనన్నాడు.

"ఇది ఎమర్జన్సీ కేసయ్యా. నువ్వు బెడ్ మీది నించి లేవాలి" అంది నర్సు విసుక్కుంటూ.

"నాదీ ఎమర్జన్సీ కేసే! ఒకటే కడుపునొప్పి. మూడురోజులనించీ కింద పడుకుంటే, ఇవాళే ఇచ్చారు బెడ్" అన్నాడు పేషెంట్ కదలకుండా. మొండివాడిలా ఉన్నాడు.

డాక్టరు ముందుకు వచ్చి, "బెడ్ మీదినించి దిగు" అన్నాడు శాసిస్తూన్నట్టు. పేషెంట్ సణుగుకుంటూ దిగిపోయాడు.

సూర్యారావును బెడ్ మీద పడుకోబెట్టారు. చారుమతి ఒళ్లంతా కళ్ళు చేసుకుని చూస్తూంది తండ్రిని. ఆయన ముఖంలో ఉదాసీనత. ఏదో మగత. ఆక్సిజన్ ఎక్కడం లేదు. డాక్టరు, నర్సు కంగారు పడుతున్నారు. డాక్టర్ సూర్యారావుకి ఇంజెక్షన్ ఇచ్చాడు. ఎక్కలేదు. డాక్టరు సూర్యారవుని పైకి ఎత్తి కుదిపాడు. మనిషిలో చలనం లేదు. నాడి చూసి పెదవి విరిచాడు.

"ఇట్ ఈస్ ఓవర్" అంది ఆందోళనగా నర్సు. డాక్టరు వెనక్కి తిరిగాడు. నర్సు సూర్యారావు ముఖం మీద పూర్తిగా గుడ్డ కప్పేసి, వెనకి తిరిగి బెడ్ దిగనని మొరాయించిన పేషెంట్ ని అడిగింది. "నీది ఇంత ఎమర్జన్సీ కేసేనా?"

చారుమతి కొయ్యబొమ్మలా నిలుచుంది. ఏమీ అర్థం కానట్టు అయోమయంగా నుంచున్న చారుమతిని చూసి డాక్టరు, "మీరు ఇలా రండి" అని భుజం మీద చెయ్యి వేసి కుదిపి, తన వెంట తన రూములోకి తీసుకు వెళ్ళాడు.

దయగల డాక్టర్ కళ్ళు చూడగానే చారుమతికి దుఃఖం ముంచుకు వచ్చింది. తల వంచుకు టేబిల్ మీద పెట్టుకుని భోరుమని ఏడ్చింది. తెరలు తెరలుగా వస్తున్న ఏడుపు ఆగలేదు. ఆత్మీయుడైన వ్యక్తిలా డాక్టరు మౌనంగా కూర్చున్నాడు.

శంకరం, శాంతమ్మ, భానుమతి వచ్చారు. సూర్యారావు ఇంక లేడని తెలుసుకున్న వారి హృదయాలు బద్దలయ్యాయి.

డాక్టరు శంకరం దగ్గిరికి వచ్చి, భుజం మీద తట్టుతూ, "ఊరుకో శంకరం. అమ్మకి ధైర్యం చెప్పు" అన్నాడు. ఇరవై ఏళ్లయినా నిండని శంకరం ఎంతగా తల్లికి ధైర్యం చెప్పగలడో డాక్టరుకీ తెలుసు. శంకరం డాక్టరు భుజం మీద వాలిపోయి ఏడ్చాడు.

సూర్యారావు శవాన్ని అంత రాత్రివేళ ఇంటికి పంపడానికి వీల్లేదన్నారు. డాక్టరే అందరికీ ఓదార్పు మాటలు చెప్పి ఇంటికి పంపాడు. ముసలి తల్లి కొడుకు మరణవార్త విని గగ్గోలుగా ఏడ్చింది. డెబ్బై ఏళ్ల ముసలమ్మకి, కాటికి కాళ్ళు చాచుకుని మరణం కోసం ఎదురు చూస్తున్నావిడకి.... చెట్టంత కొడుకు మరణం పెద్ద ఆఘాతమయింది.

టెలిగ్రాములు అంది రేవతి, గోపాలరావు, తక్కిన బంధువులు వచ్చారు. ఇల్లంతా శోకాలతో నిండి పోయింది.

శంకరం జుత్తు తీయించేసుకుని, కొత్త కుండలో అగ్ని పట్టుకుని, తండ్రి శవం ముందర బయలు దేరడం చూసిన శాంతమ్మ ముఖం తిరిగి పడిపోయింది.

## 8

అంతా అయిపోయింది. ఎర్రటి కుంకుమ బొట్టు లేని వెలవెలబోతున్న తల్లి ముఖం చూసినప్పుడల్లా చారుమతి కళ్ళనీళ్ళు ఆపుకోలేక పోయేది. తండ్రి మరణం గుర్తుకు వచ్చేది. కాని అన్ని ఆలోచనల మధ్య చారుమతికి ఎన్నో ప్రశ్నలు ఉదయించేవి. తండ్రికి తెలుసు తను చచ్చి పోతానని. అందుకే పేరుపేరు వరసనా అందరినీ పిలిచి, "వెళుతున్నాను" అని చెప్పారు. "నా పని అయిపోయింది" అన్నారు. కాని చనిపోయే ముందర, "ఇంతమంది పిల్లలు ఉన్నారు. ఎలా నడుపుకు వస్తావు సంసారం?" అని ఒక్కసారి కూడా తల్లితో అనలేదు. ఎదిగిన ఆడపిల్లలికి పెళ్ళిళ్ళు కావాలి. శంకరం చదువు పూర్తి కావాలి. ఇలాంటి వ్యథలేమీ తండ్రికి ఉండేవి కావా? ఒక్క మాటకూడా అనలేదేం? తండ్రి తత్వం

అర్థం కాలేదు చారుమతికి. ఉన్నన్ని రోజులూ రాత్రీ పగలూ శ్రమించి డబ్బు సంపాదించే వారు సంసారం కోసం. పిల్లలిని ఎంతో ప్రేమగా, ఆదరంగా దగ్గిరికి తీసేవారు. ఇబ్బంది పడి వాళ్ళని చదివించే వారు. చనిపోయే ముందు ఏ దిగులూ లేకుండా నిశ్చింతగా ఎలా పోయారు? ముప్పై ఏళ్ళు కాపరం చేసిన భార్యకాని, చిన్నతనం నించి పెంచిన తల్లి కాని, ముద్దుల చిన్న కూతురు భగవతి కాని జ్ఞాపకం రాలేదు. వాళ్ళని తలుచుకోను కూడా లేదు! 'ఏమిటో విచిత్రం!' అనుకుంది చారుమతి.

చారుమతికి ఇంట్లో ఏమీ తోచటం లేదు. ఏ పని చేస్తున్నా, ఎక్కడ కూచున్నా తండ్రి మరణం, తండ్రిని గురించిన ఆలోచనలే తలపుకి వస్తున్నాయి. 'అనవసరంగా సెలవు పొడిగించాను' అని విసుక్కుంది. తండ్రి చనిపోయి పదిహేను రోజులైంది. దిన వారాలు అయిపోయాయి. దినవారాలకి వచ్చిన బంధువులు వెళ్ళిపోయారు. ఇంట్లోనే అన్నాళ్ళూ ఉండిపోయిన శంకరం ఆరోజు తిరిగి కాలేజీకి వెళ్ళాడు. మాలతిని, భగవతిని కూడా స్కూలుకి పంపింది భానుమతి. చారుమతి మాత్రం, "నేనిప్పుడు స్కూలుకి వెళ్లి పాఠాలు చెప్పలేను" అంటూ ఇంకో వారం సెలవు పొడిగించింది.

ఇంట్లో కూర్చుంటే వెయ్యి సమస్యలు తల ఎత్తుతున్నాయి. ముఖ్యంగా ఆర్థికమైన ఇబ్బందులు తలచుకుంటే  భయం వేస్తూంది. ఇప్పుడే కొంచెం ఆర్థికంగా ఒక గాడిన పడ్డ తమ సంసార పరిస్థితి మళ్ళీ తలకిందులయింది. తన జీతం తప్ప వేరు ఆధారం లేదు. నూరు రూపాయలేనా లేని ఆ జీతంతో ఏడుగురు బ్రతకాలి. ఎలా గడుస్తాయి రోజులు? నాలుగు నెలలలో శంకరం పరీక్షలు అయిపోతాయి. శంకరానికి ఉద్యోగం దొరికే దాకా తనే సంసారాన్ని నడపాలి. తండ్రి దినవారాలకి, బంధు సత్కారాలకి బోలెడు ఖర్చు అయింది. రేవతి పెళ్లి అప్పు అయిదు వందల బాకీ ఇంకా అలాగే ఉంది పోయింది. చారుమతికి తల బద్దలవుతూంది. ఊరికే నులక మంచం మీద అటూ ఇటూ పొర్లుతూ, నిద్ర కోసం ప్రయత్నించింది. మధ్యాహ్నం  మూడుగంటలవుతూంటే మగతగా నిద్ర పడుతున్న చారుమతికి బయటి నించి ఎవరో, "అమ్మా!" అని పిలుస్తున్నట్లు వినిపించింది. లేచి, "ఎవరూ?" అంటూ బయటికి వచ్చింది. ప్లీడరు గారి నౌకరు నూకరాజు నిలబడి ఉన్నాడు. తండ్రి కోసం అప్పుడప్పుడు వచ్చేవాడు నూకరాజు.

"ఏం నూకరాజూ?"

"అయ్యగారు శంకరం బాబుగార్ని కాని, మిమ్మల్ని కాని ఎంట బెట్టుకు రమ్మన్నారండీ."

"ఎందుకూ?" ఆశ్చర్యపోతూ అడిగింది చారుమతి,

"నాకు తెల్దండీ."

"ఇప్పుడే రావాలా? శంకరం ఇంట్లో లేడు."

"మీరు రండి అమ్మాయిగారూ" అన్నాడు నూకరాజు అక్కడే నిలబడి.

బయట మాటలు వినబడి, "ఎవరు వచ్చారూ?" అంటూ భానుమతి బయటికి వచ్చింది.

చారుమతి సంగతి వివరించి, "శంకరం వచ్చాక పంపిద్దాం" అంది లోపలి వస్తూ.

"పోనీ, నూకరాజుతో వెళ్ళ కూడదా? ఆయన ఎందుకు రమ్మనారో ఏమో?" అంది బానుమతి.

చారుమతి విసుక్కుంటూ, చీర మార్చుకుని బయలు దేరింది.

"నూకరాజూ! ప్లీడరు గారివ్వాళ కోర్టుకు వెళ్ళ లేదా?" దారిలో అడిగింది చారుమతి.

"లేదమ్మా. ఆరి కియ్యాల ఒంట్లో నలతగా ఉంది, ఇంట్లోనే ఉండి పోనారు."

దారిలో అంతా ప్లీడరుగారి సుపుత్రుడు రాధాకృష్ణతో బాటు అతనితో తన విశాఖ ప్రయాణం జ్ఞాపకం వచ్చింది చారుమతికి. భయం వేసింది. కాని ప్లీడరుగారి మంచితనం గుర్తుకు వచ్చి, తిరిగి ధైర్యం తెచ్చుకుంది. తండ్రి పోయిన రోజు ప్లీడరుగారు కొద్ది సేపు ఇంట్లో కూచుని, నాలుగు ముక్కలు పిల్లలతో మాట్లాడి వెళ్ళారు. ఆయన పరోక్షంగా ఆ రోజెంతో సహాయం చేసారు తమకు,

చారుమతి ప్లీడరు గారింట్లో మొదటి సారిగా అడుగు పెట్టింది. ఇల్లు చాలా పెద్దది. ఇంటి చుట్టూ మొక్కలు, ప్రహరీ గోడ. ఇంట్లోకి అడుగు పెట్టగానే వరండాని ఆనుకుని ప్లీడరు లక్ష్మీపతిగారి కచేరీ గది ఉంది. నూకరాజు కూడా తిన్నగా కచేరీ గదిలోకి తీసుకువెళ్ళాడు. ప్లీడరుగారు చారుమతిని చూడగానే, "రామ్మా! కూర్చో" అంటూ ఆదరంగా పిలిచి కుర్చీ చూపించారు. చారుమతి నమస్కారం చేసి కూర్చుంది.

"ఎలా ఉన్నారమ్మా అంతా? అమ్మ ఎలా ఉన్నారు?" కుశల ప్రశ్నలు వేశారు ప్లీడరుగారు.

"అమ్మ ఇంకా కోలుకోలేదండీ. మామ్మ మరీ డీలా అయిపోయింది. మంచంలోనించి లేవటం లేదు" అంటూ పరిస్థితులు చెప్పింది చారుమతి.

"అమ్మకీ, మామ్మకీ మీరే ధైర్యం చెప్పాలి. చదువుకున్నదానివీ, ఉద్యోగం చేస్తున్న దానివీ ముఖ్యంగా నువ్వు ధైర్యంగా ఉంది ఇల్లు చూసుకోవాలి."

చారుమతి తలవంచుకుని వింటూ కూర్చుంది.

"మీ నాన్నంత నిజాయితీ పరుడిని, నెమ్మదస్తుడిని ఇంకొకరిని  చూడలేదు నేను. ఆయన ఇలా అకస్మాత్తుగా పోవడం చాలా విచారకరం. ముఖ్యంగా ఆయన లేకపోవడం నాకెంతో కొరత."

తండ్రిని గురించిన ప్రశంసా వాక్యాలు వింటూ కంట నీరు నింపు కుంది చారుమతి.

ప్లీడరుగారు డ్రాయరు తెరిచి, ఒక కవరు తీసి చారుమతి ముందు పెడుతూ అన్నార్. "ఇది తీసుకో అమ్మా. ఇందులో వెయ్యి రూపాయలు ఉన్నాయి. ఇది ఇచ్చి మీ నాన్న ఋణం తీర్చుకుంటున్నానని అనుకోకు. ఏదో నా చేతనైన కొద్ది సాయం మీ కుటుంబానికి చెయ్యాలని ఇస్తున్నాను."

చారుమతి డబ్బు చూసి తడబడింది. ఆశించని డబ్బు. అనుకోకుండా లభ్యమైన ఆ సొమ్మును తీసుకోవాలంటే సంకోచం కలిగింది. చలనం లేకుండా కూర్చున చారుమతిని ప్లీడరుగారు హెచ్చరించారు. "తీసుకో అమ్మా. గవర్నమెంటు ఉద్యోగమైతే ఏదో పింఛను ఉంటుంది. మా ప్లీడరూ, గుమాస్తా ఉద్యోగాలకి ఆ పింఛను ఆశ లేదు. ఇంతకంటె ఎక్కువ ఇవ్వలేకపోతున్నందుకు, వేరే ఏమీ సహాయం చెయ్యలేక పోతున్నందుకు విచారంగా ఉంది నాకు" అన్నారు.

ఆయనే తిరిగి, "నూకరాజూ! అమ్మాయి గారికి రిక్షా తీసుకురా" అంటూ బయటికి కేక వేశారు.

రిక్షా వచ్చిందని చెప్పాక, చారుమతి ప్లీడరుగారి దగ్గర సెలవు తీసుకొని, సిగ్గుపడుతూ సొమ్ము ఉన్న కవరు చేతిలో పట్టుకు బయటికి వచ్చింది.

గేటు బయటికి వస్తూంటే, ఇంకో రిక్షా వచ్చి ఆగింది. అందులో నించి తెల్లకోటు వేసుకున్న డాక్టరు ఒకరు దిగారు. చారుమతి ఒక్కసారి అదిరిపడింది. తండ్రి పోయినప్పుడు తన పక్కనే నుంచున్న డాక్టరు! తనకి తోడునీడగా ఉన్న వ్యక్తి!

"నమస్కారమండీ" అన్నాడు డాక్టర్.

ప్రతినమస్కారం చేసింది చారుమతి.

"ఎలా ఉన్నారు? బాగున్నారా? అమ్మ బాగున్నారా? శంకరం కాలేజీకి వెడుతున్నాడా?" ప్రశ్నలు గుప్పించాడతను.

"ఏదో, అదే బాగండీ. శంకరం ఇవాళే కాలేజీకి వెళ్ళాడు."

డాక్టరు ఒక్క క్షణం నిశ్శబ్ధంగా నుంచున్నాడు.

"ప్లీడరుగారికి ఒంట్లో బాగులేదట కదా? చూడడానికి వెళుతున్నారా?" చారుమతి అడిగింది.

"ప్లీడరు గారిని చూడడమేమిటి? ఇది మా ఇల్లు. ప్లీడరుగారు మా నాన్నగారు."

చారుమతి ఆశ్చర్యపోయింది. ఏదో అనాలనుకుంది. కాని పెదవి కదిలి ఒక్కమాట రాలేదు.

"సరే, వస్తానండీ" అంటూ లోపలి దారి తీశాడతను.

చారుమతి ఒక్క క్షణం అతన్నే చూస్తూ నిలబడి రిక్షా ఎక్కి కూర్చుంది. ఎంత ఆశ్చర్యం! ఇతను ప్లీడరుగారి రెండో అబ్బాయా? రాధాకృష్ణకీ, ఇతనికీ ఎంత వ్యత్యాసం? ఒక కొమ్మకి రెండు రకాల పువ్వులు ఉంటాయా? అన్నదమ్ముల స్వభావంలో ఇంత తేడా ఉంటుందా? ఈయనకి ప్లీడరుగారి పోలిక వచ్చిందేమో! తండ్రి మంచితనమే కొడుకులోనూ కనిపిస్తూంది.

చారుమతి మనసులో డాక్టరు స్థిరంగా నిలిచి పోయాడు. దయ ఉట్టిపడుతున్న కళ్ళు, ఎంతో ఆప్యాయమైన మాటతీరు, మాట్లాడటంలో ఆత్మీయత. డాక్టరు రూపురేఖలలో అందం లేకపోయినా, అతని కళ్ళలో, మాటల్లో, మంచితనంలో, ఆప్యాయతలో ఎంతో అందం ఉంది.

రాధాకృష్ణతో డాక్టరుని పోల్చిన కొద్దీ డాక్టరు మీది గౌరవం పెరిగింది. అతని స్వభావాన్ని నిర్ణయించడానికి అతనితో తనకు గల పరిచయం కొద్దిపాటిదేనని చారుమతి మరిచిపోయింది.

'ఈయన పేరు ఏమిటి? శంకరానికి తెలిసే ఉండాలి. నాన్న చనిపోయినప్పుడు,"శంకరం" అని పేరుపెట్టి పిలిచినట్టు గుర్తు' అనుకుంది చారుమతి.

ఉదారుడైన ప్లీడరునీ, మంచితనం ఉట్టిపడే డాక్టరునీ తలచుకొని 'లోకంలో మంచివాళ్ళు లేక పోలేదు' అనుకుంది. వాళ్ళిద్దరి ఎడల కృతజ్ఞతతో హృదయం నిండింది.

ఇంటి తలుపు చేరవేసి ఉంది. ఇంట్లో ఎక్కడా మనుష్యులు ఉన్న జాడ లేదు. నిశ్శబ్దంగా ఉంది. చారుమతి తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించగానే కింద ఒక కార్డు పడి ఉంది కనిపించింది. 'పోస్ట్ మేన్ పడవేసి ఉంటాడు. ఇంట్లో ఎవరూ గమనించినట్టు లేదు' అనుకుంటూ కార్డు చేతిలోకి తీసుకుని చూసింది. అది తండ్రి పేర విజయనగరం నించి ఎవరో రాసిన ఉత్తరం.

"మ.రా.శ్రీ. మామయ్యకు,

నమస్కారములు. అక్కడ మేరు క్షేమంగా ఉన్నారని తలుస్తాను. ఈ నెల మీ దగ్గిరినించి సొమ్ము రాలేదు. అమ్మా, నేనూ డబ్బుకి చాలా ఇబ్బంది పడుతున్నాము. ఈ ఏడాది ఎస్.ఎస్.ఎల్. సి. పరీక్ష పాసైతే నాకు ఏదైనా ఉద్యోగం దొరుకుతుంది. పై ఏడాది నించి మీకు కష్టం కలిగించము. ఇన్నాళ్ళూ మీరు సొమ్ము పంపించి నాకు, అమ్మకు సహాయం చేసినందుకు ఎంతో కృతజ్ఞతలు. వీలు చూసుకు డబ్బు పంప ప్రార్థన. కష్టం కలిగిస్తున్నందుకు క్షమించండి. అమ్మ మీకు, అత్తకు, అమ్మమ్మకు నమస్కారాలు రాయమన్నది.

ఇట్లు,

గోపాల్ (బాబు)

చారుమతి 'ఎవరీ గోపాల్" అని ఆలోచించింది. కాసేపటికి గుర్తు వచ్చింది. నాలుగైదు నెలల కిందట తండ్రి, "బి.శారదమ్మ, విజయనగరం" పేర డబ్బు పంపడం. తనే మనియార్డరు కట్టింది. తరువాత ఆ సంగతే మరిచిపోయింది. వీళ్ళకి ఇంకా తండ్రి పోయిన వార్త తెలియదు.

సొమ్ముకి ఇబ్బంది పడుతున్నామని రాశాడు. అయితే మాత్రం తను ఈపరిస్థితులలో డబ్బు పంప గలదా?

"ప్లీడరుగారు ఎందుకు పిలిచారు? ఏమన్నారు?" అప్పుడే అటువైపు వచ్చిన భానుమతి చారుమతిని చూసి అడిగింది.

చారుమతి ప్లీడరు గారింట్లో జరిగిన సంభాషణా, డబ్బు ఇవ్వడం చెప్పి, భానుమతి చేతిలో డబ్బు ఉన్న కవరు ఉంచింది.

డబ్బు చూడగానే భానుమతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మన చుట్టాల్లో శారదమ్మ అనే ఆవిణ్ణి నీకు తెలుసా?' చారుమతి అక్కని అడిగింది.

"నాకు తెలియదు. ఎవరావిడ?"

"మనకి అత్త వరస అవుతారు. విజయనగరంలో ఉన్నారు. ఆవిడికి ఒక కొడుకు ఉన్నాడు. ప్రతి నెల నాన్న ఆవిడికి కొంత డబ్బు పంపేవారు. నాన్న చనిపోయారని తెలియక ఆ అబ్బాయి డబ్బుకోసం ఉత్తరం రాశాడు" అంటూ కార్డు భానుమతి చేతికి ఇచ్చింది.

భాను కార్డు చదివి, "ఇప్పుడేం చేస్తావు?" అంది.

"ఏం చేస్తాం? మనం డబ్బు ఎలా పంపగలం? ప్లీడరు గారిచ్చిన వెయ్యి రూపాయలూ అప్పు తీర్చడానికి సరిపోతాయి. ఇంకా మిగిలినది నా జీతమే కదా. ఆ డబ్బుతో మన తిండి ఖర్చు కూడా ఎలా వెళుతుందా? అని భయపడుతున్నాను నేను. వీళ్ళకి ఉత్తరం రాసేస్తాను, నాన్న పోయారనీ, డబ్బు పంపలేమని."

భానుమతికి చెల్లెలు ఆలోచన నచ్చలేదు.

"చూడు చారూ! మనం డబ్బుకి ఇబ్బంది పడుతున్నా నాన్న వాళ్లకి డబ్బు పంపేరంటే, వాళ్ళు మనకంటె ఎన్నో కష్టాలలో, దరిద్రంలో ఉండి ఉంటారు. మనం ఏదో మనకి చేతనైన సహాయం చేద్దాం. ఇంకా ఆరునెలలు ఓపిక పడితే, గోపాల్ ఉద్యోగం సంపాదించు కుంటాడు. అతనే తల్లిని పోషించుకుంటాడు."

చారుమతి మాట్లాడక ఊరుకుంది. తరువాత మెల్లిగా," ఎలా పంపుతాం భానక్కా? మనకే లేకపోతే!" అంది.

"ఉన్నదానిలోనే పంపుదాం. ప్లీడరుగారు ఎంతో సహాయం చేశారని మన హృదయాలు కృతజ్ఞతతో నిండిపోలేదూ. కష్టాలలో సహాయం చెయ్యడమే గొప్ప సాయం! నెలకి ఒక్క పది రూపాయలు పంపు! దానితో బియ్యమైనా కొనుక్కుంటారు."

ప్లీడరు గారి మాట ఎత్తగానే డాక్టరు మంచితనం కూడా గుర్తుకి వచ్చింది. చారుమతి ఇంకా మాట్లాడలేదు. మౌనంగా భానుమతికి అంగీకారం సూచించింది.

రాత్రి శంకరం చదువు కుంటూంటే చారుమతి దగ్గిరికి వెళ్లి అడిగింది.

"ఆ డాక్టర్ నీకు తెలుసా?"

"ఏ డాక్టరు?"

"ప్లీడరుగారి అబ్బాయి."

"ఓ ఆయనా! డాక్టరు గిరిధారి. నాకు అంత బాగా తెలియక పోయినా, కొద్ది పరిచయం ఉంది" అన్నాడు శంకరం.

చారుమతి మనస్సులోనే అనుకుంది. 'గిరిధారి"

"ఎందుకు అడుగుతున్నావ్?" శంకరం అడిగాడు.

"ఏం లేదు?" అంటూ చారుమతి వెళ్లి పడుకుంది.

## 9

కొత్త పంటలతో, గంగిరెద్దులతో, రంగు రంగు బట్టలతో, పిండి వంటలతో, పచ్చని చేమంతులతో సందడిగా సంక్రాంతి వచ్చి వెళ్ళింది. ఇంటి పెద్ద పోయిన దుఃఖంలో మునిగిన  చారుమతి ఇంటివారికి ఆ ఏడు క్రాంతి కనిపించ లేదు. లోకమంతా చీకటైనట్టు అనిపించింది.

కొత్త పెళ్లి కూతురైన పద్మకీ చీకటిగానే కనిపించింది పండుగ.  అల్లుడు పండగకి తమ ఇంటికి వస్తాడనీ, ఇంట్లో సందడిగా అల్లుడూ, కూతురూ తిరుగుతూ ఉంటే కన్నుల పండుగగా చూసుకుని ఆనందించ వచ్చునని ఎన్నో కలలు కంది వరలక్ష్మి . వియ్యపురాలు రాసిన చిన్న కార్డు ఆవిడ కలలన్నిటినీ కల్లలు చేసింది. ఆవిడలో ఏదో దిగులు ఆవరించింది.

శ్రావణ మాసంలో పద్మని మద్రాసు తీసుకెళ్ళి లక్ష్మీ పూజ చేయించ లేదు. వారింట లక్ష్మీ పూజ అచ్చి రాదన్నారు. పోనీ దీపావళికి అల్లుణ్ణి పంపమంటే ఆఫీసులో పని, సెలవు దొరకదని జవాబు. సంక్రాంతికి మాధవరావుని తప్పక రమ్మని పద్మ తండ్రి నారాయణ రావుగారు

రాశారు. దానికి వియ్యపురాలు కాంతమ్మే జవాబు రాసింది. పండగకి మూడు రోజుల ముందర వచ్చింది, అబ్బాయి ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళుతున్నాడు, కాకినాడకి రావడానికి వీలు పడదు అని.

కూతురు లేకుండా చూసి వరలక్ష్మి భర్త దగ్గిర కళ్ళ నీళ్ళు పెట్టుకునేది. అమ్మాయి కాపరం ఎలా ఉంటుందో? ఒక్కగానొక్క కూతురికి మంచి సంబంధం చూసి పెళ్లి చేశాం అనుకుంటే, ఈ విపరీతమేమిటి? అబ్బాయి ఒక ఉత్తరం రాయడేం? అమ్మాయి అంటే ఇష్టం లేదా? ఎన్నో భయాలు ఆవిడకి. పద్మ తండ్రి నారాయణరావు లోపల భయపడ్డా, పైకి గంభీరంగా ఉండే వారు. భార్య కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే కసురుకునే వారు. "ఇప్పుడేం కొంప మునిగిందని ఏడుస్తావు? అది చదువుకుంటూంది కదా! చదువు అవగానే కాపరానికి తీసుకు వెళతారు. అన్నీ చక్క బడతాయి. పద్మ దగ్గిర మాత్రం పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. లేనిపోని భయాలు పెట్టుకుని మనసు పాడుచేసుకుంటుంది."

తల్లీ తండ్రీ తన ఎదురుగా ఏమీ మాట్లాడక పోయినా, పద్మ అన్నీ ఊహించుకోగలదు. మాధవరావు మౌనానికి మనస్సు చివుక్కు మనేది. పైగా, చుట్టూ పక్కల అమ్మాయిలు, స్నేహితులు భర్త పేరుతో అల్లరి పెడుతూ ఉంటే బాధ పడేది పద్మ. ఏ ప్రేమ కథ చదివినా, సినిమాలో ఏ ప్రణయ ఘట్టం చూసినా మాధవరావు జ్ఞాపకం వచ్చే వాడు. అతని ఉనికి మరిచి పోయి చదువులో పడదామని ప్రయత్నించేది. కాని మెళ్ళో కొత్త తళుకు మాయని మంగళ సూత్రాలు, నల్లపూసలు, కాళ్ళ మట్టెలు ప్రతి క్షణం, "నీకో భర్త ఉన్నాడు" అని ఎత్తి చెప్పేవి. అతని కోసం ఆత్రత తనకేనా? అతనికేం బాధ లేదా? ఒక్క ఉత్తరం కూడా రాయని అతన్ని తలచుకుంటే ఎంతో కోపం వచ్చేది. తనే ఉత్తరం రాస్తే? అనిపించేది ఒకసారి. భర్తకి భార్య రాయడంలో తప్పేముంది? కాని మళ్ళీ ఏదో పంతం వచ్చేది. అతనికి తను అక్కర లేకపోతే, తను ఉండగలదు అతని దూరంగా!

## 10

శంకరం పరీక్షలు అయిపోయాయి. మే నెల వచ్చేసింది. ఎండలు మండి పోతున్నాయి. 'ఊరినిండా రకరకాల మామిడిపళ్ళు ఉన్నా, ఒక్క పండు తినే అదృష్టం లేదు' అనుకుంది చారుమతి. సూర్యారావు చనిపోయాక ఈ ఆరు నెలలలో ఎన్నో మార్పులు వచ్చాయి ఇంట్లో. ప్లీడరు గారిచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేసారు. దానితో అప్పూ లేదు, ఆస్తీ లేదు అన్నట్టు అయింది. మిగిలింది ప్రతి నెలా వచ్చే చారుమతి జీతం. రాబడి తగ్గడంతో ఇంట్లో వాళ్ళ సుఖాలూ తగ్గాయి. ఒక్క సారే కాఫీ తాగుతున్నారు. నీళ్ళ మజ్జిగతో తృప్తి పడుతున్నారు. పొద్దుటి పూటే కూర చేస్తుంది భానుమతి. రాత్రి పచ్చడితో సరిపెడుతుంది.

'శంకరం పరీక్ష పాసై ఏదైనా ఉద్యోగం దొరికితే, కష్టాలు గట్టెక్కుతాయి. చెయ్యి ఆసరాగా ఉంటాడు. వచ్చే ఏడు మాలతి స్కూలు ఫైనల్ క్లాసులోకి వస్తుంది. అది ఆ పరీక్ష గట్టెక్కితే సగం కష్టాలు తీరినట్టే." చారుమతి రోజూ రాత్రి నెమరు వేసుకునేది ఈ సంగతులే.

శాంతమ్మ భర్త వియోగం నించి ఇంకా కోలుకోలేదు. వంటింట్లో గడప మీద తల పెట్టుకు పడుకొని పాత రోజులు తలచుకుని కుములుతూ ఉంటుంది.

ముసలమ్మ పూర్తిగా మంచం ఎక్కింది. ఆవిడికి ఒక రకంగా మతిస్థిమితం తప్పింది. "నాయనా సూర్యం! ఇలా రా రా!" అంటూ చనిపోయిన కొడుకుని మధ్య రాత్రి పిలుస్తూ ఉంటుంది. ఆవిడికి మామిడిపళ్ళంటే ప్రీతి. "వీళ్ళంతా నన్ను మరిచి పోయారురా! ఒక్క మామిడి పండేనా ఇచ్చారేమో చూడు! నువ్వైనా తెచ్చి పెట్టారా సూర్యం" అని మామిడిపళ్ళ కోసం కొడుకుని వెతుక్కుంటూ ఉంటుంది.

ఇంట్లో పిల్లలంతా స్తబ్దులుగా తయారయ్యారు. ఎవరి పనులు వాళ్ళు చేసుకోవడం, లేదా ఏదైనా పుస్తకం పట్టుకు కూర్చోవడం. నలుగురూ కూర్చుని మాట్లాడుకోవడం, నవ్వుకోవడం మరిచిపోయారు వాళ్ళు. శంకరం మాత్రం ఉదయం భోజనం చేసి బయటికి వెళ్ళి రాత్రి చీకటి పడ్డాక ఇల్లు చేరతాడు. ఎక్కడ తిరుగుతాడో ఎవరికీ తెలియదు.

జూన్ మొదటి తారీఖు. ఉదయమనగా బయటికి వెళ్ళిన శంకరం రాత్రి పదకొండు గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. శాంతమ్మ కంగారు పడింది. భానుమతి వెళ్ళి నిద్ర పోతున్న చారుమతిని లేపి, "శంకరం ఇంటికి రాలేదే!" అంది.

చారుమతి విసుక్కుంది. "అబ్బాయిగారు ఎక్కడ తిరుగుతున్నట్టు? ఆడవాళ్ళు ఒంటరిగా ఇంట్లో ఉన్నారనే ధ్యాసేనా లేదు" అంటూ బయటికి వచ్చింది. వీధులలో మంచాలు వేసుకుని చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళంతా నిద్ర పోతున్నారు.

'ఎవరి, ఏమని అడగను?' అనుకుని కాస్సేపు బయట నుంచుని లోపలికి వచ్చింది.

తల్లి పిలిచింది. "చారూ! శంకరం ఎక్కడికి వెళ్ళాడమ్మా? ఇంటికి ఇంకా రాలేదేం?"

"ఎక్కడికి వెళతాడో నాకు చెప్పి వెళతాడా రోజూ? నేను మాత్రం ఎక్కడికి వెళ్ళి వెతకను?"

"ఎలాగే మరి?"

"ఎలాగేమిటి? అమ్మాయి కాదు, చిన్నవాడు కాదు. మగవాడు. ఎక్కడికి వెళ్ళినా తిరిగి రాగలడు. నువ్వు పడుకో అమ్మా. ఎవరో స్నేహితులింట్లో ఉండి పోయి ఉంటాడు. పొద్దున్నే వచ్చేస్తాడు" అంటూ చారుమతి వెళ్ళి పడుకుంది.

పడుకుందన్న మాటే కాని నిద్ర పట్టలేదు. రాత్రి శాంతమ్మ, భానుమతి, చారుమతి జాగారం చేశారు.

తెల్లవారుతూ ఉండగానే భగవతిని రెండిళ్ళవతల ఉన్న ఇంటికి పంపింది శాంతమ్మ. వారి అబ్బాయి కూడా కాలేజీలో చదువుతున్నాడు.

"అతనికి అన్న గురించి తెలియదటమ్మా. నిన్న అసలు అన్నని చూడలేదట. నిన్న మధ్యాహ్నం పేపర్లో బి.ఏ. పరీక్షా ఫలితాలు వచ్చాయిట. అన్న నెంబరు ఇస్తే అతన పేపర్లో చూస్తాడట" అంటూ భగవతి వచ్చి కబురు చెప్పింది.

చారుమతి శంకరం నంబరు ఇచ్చి, భగవతి కోసం చూస్తూ ఆత్రుతగా వీధిలోనే నుంచుంది.

"తెలుగు ఒక్కటే పాసయ్యడట. ఇంగ్లీషు, గ్రూపు తప్పాడుట" అంది భగవతి వచ్చి,

చారుమతి అక్కడే కుప్ప కూలి పోయింది. ఏదో శంకరం పాసవుతాడు, సంపాదిస్తాడు. తమ దైన్యావస్థ తప్పుతుంది అనుకుంది. ఇప్పుడు అన్నీ తారుమారయ్యాయి. మళ్ళీ పరీక్ష, పరీక్ష ఫీజు, ఆరు నెలలు ఎదురు చూడడం!

నీరసంగా ఇంట్లోకి వచ్చింది. ఇంట్లో అందరి ముఖాలలోనూ నిరాశ తొంగి చూస్తుంది.

"వెధవ పరీక్ష పోతే పోయింది. పిల్లాడు ఏమై పోయాడో? ముందు బాబు ఇంటికి వస్తే చాలు." కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ కూర్చుంది శాంతమ్మ.

పది గంటలు అవుతూ ఉంటే, ముఖం నేల వేసుకు వచ్చాడు శంకరం. రాత్రి అంతా నిద్ర లేదేమో, ముఖం అంతా పీక్కు పోయింది.

"ఎక్కడ తిరుగుతున్నావ్? అసలే నాన్న పోయిన బెంగతో మేం కుళ్ళుతూ ఉంటే, నువ్వు ఇంటికి రాకుండా మమ్మల్ని ఇంకొంచం చంపు. రాత్రి ఎవ్వరికీ నిద్ర లేదు నీ వల్ల. బెంగ పెట్టుకు పోయాం ఏమై పోయావో అని." చారుమతి శంకరాన్ని చూస్తూనే గట్టిగా మాట్లాడింది. పరీక్ష తప్పిన కోపం కూడా ఉంది ఆ కంఠంలో.

శంకరం ఏమీ మాట్లాడకుండా పెరట్లోకి వెళ్లి పోయాడు. భానుమతి చెల్లెలికి దగ్గిరగా వచ్చి, "చారూ! నువ్వు శంకరాన్ని ఇంకా ఏమీ అనకు. వాడు అసలే పరీక్ష పోయి సిగ్గు పడుతున్నాడు. నువ్వింకా ఏదేనా అంటే బాధ పడతాడు. నాన్న పోయిన బెంగతో పరీక్షకి చదవలేక పోయాడు. ఈ మారు పాసై పోతాడులే" అంది.

చారుమతి ఇంకేం మాట్లాడలేదు.

"బాబూ! ఎక్కడికి వెళ్లావురా? రాత్రంతా ఎక్కడున్నావ్? పరీక్ష పోతే పోయింది. మళ్ళీ కట్టుకోవచ్చు. నువ్వు బాధ పడకు బాబూ" అంటూ గద్గద స్వరంతో తల్లి శంకరాన్ని అనునయించడం వినిపించింది లోపలినించి.

ఇల్లంతా బావురుమంటూంది. ముసలమ్మ లేని వెలితి ఇంట్లో బాగా కనిపిస్తూంది. ఆవిడ పనేం చెయ్యక పోయినా, చివరి రోజుల్లో మంచం మీద నించి లేవలేక పోయినా, ఇంట్లో ఆవిడ ఉండటం ఒక నిండుగా ఉండేది. అందరికి పెద్ద దిక్కు అనిపించేది. ఆవిడికి మనమడు అన్నా, మనమరాళ్ళు అన్నా ఎంతో అభిమానం. అందరిని ఆప్యాయంగా చేరదీసేది.

కోడల్ని కూతురులా చూసుకునేది.

మధ్యాహ్నం నాలుగైంది. ఇంట్లో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బయటి నించి ఎవరిదో గొంతుక వినిపించింది.

"సూర్యారావుగారి ఇల్లు ఇదేనాండీ?"

భగవతి బయటికి వచ్చి చూస్దింది. ఎవరో ఇరవై సంవత్సరాల యువకుడు నిలబడి ఉన్నాడు. చురుకైన కళ్ళు, ఉంగరాల జుత్తు, మంచి తెలివైన ముఖం.

"ఇదేనండీ. ఎవరు కావాలి?" అంది భగవతి.

"చారుమతి ఉన్నారా?" అన్నాడు అతను.

"ఆ... ఉంది" అంటూ లోపలి వెళ్ళింది భగవతి. చారుమతి కోసం ఎవరో యువకుడు వచ్చాడంటే ఇంట్లో అందరికీ ఆశ్చర్యంగా ఉంది. చారుమతి కూడా కుతూహలంగా బయటికి వచ్చి చూసింది. అతని ముఖం ఎప్పుడూ చూసిన గుర్తు లేదు. అపరిచితుడు.

"నేనే చారుమతిని. ఏం కావాలి మీకు?"

"నా పేరు గోపాల్. విజయనగరం నుంచి వచ్చాను" అన్నాడతను.

చారుమతి ఒక్క నిమిషం 'ఎవరా ఇతను?' అని ఆలోచించింది. వెంటనే డబ్బు పంపడం గుర్తు వచ్చింది.

"ఓహో! నువ్వా! రారా!" అంది చారుమతి దరహాసం చేస్తూ.

"ఎవరే అతను?" అంది రేవతి.

"ఇతను మనకి బాగా కావలసిన వాడు. శారదత్తయ్య కొడుకు" అంది చారుమతి.

"ఓహో! గోపాలా?" అంది భానుమతి.

'ఎవరీ శారదత్తయ్య?' అని ఆశ్చర్యపోయారు రేవతి, మాలతి, భగవతి.

అందరికి నమస్కారాలు చేశాడు గోపాల్.

"నీకు మమ్మల్ని ఎవరినీ తెలీదు కదూ?" అంటూ చారుమతి అందరిని పరిచయం చేసింది.

"మా పెద్దక్క రేవతి. విశాఖలో ఉంటుంది. ఈవిడ మా రెండో అక్క భానుమతి. మా ఇంట్లోనే ఉంటుంది. బావగారికి ఇక్కడే పని. ఏది మా చెల్లెలు మాలతి. ఎస్.ఎస్.ఎల్.సి. పాసైంది. హిందీ పరీక్షలకి, టైపు పరీక్షలకి కడుతూంది. ఇది భగవతి. అందరిలోకీ చిన్నది. ఎస్.ఎస్.ఎల్.సి. దాకా చదివింది" అంది అందరిని చేత్తో చూపిస్తూ.

గోపాల్ నవ్వుతూ, కుతూహలంగా చూస్తూ నిలుచున్నాడు.

"మరి నువ్వేం చేస్తున్నావో చెప్పావు కాదు" అంది రేవతి చనువుగా.

"నేను స్కూలు ఫైనల్ పరీక్ష పాసై కొన్నాళ్ళు విజయనగరం మిల్స్ లో పనిచేశాను. ఈ ఏడాది రైల్వే సర్వీస్ కమిషన్ పరీక్షలకి కట్టాను. ప్రస్తుతం రైల్వే ఉద్యోగంలో కాకినాడలో ఉన్నాను" అన్నాడు అతను.

"మా అమ్మని చూద్దువుగాని, రా" అంటూ చారుమతి వరండాలోకి తీసుకెళ్ళింది గోపాల్ ని. వరండాలో చాప వేసుకుని పడుకుంది శాంతమ్మ.

"అమ్మా! ఎవరు వచ్చారో చూడు" అంది చారుమతి.

ఆవిడ ఇటు తిరిగి, నూతన వ్యక్తిని చూసి, లేచి కూర్చుంది.

"విజయనగరంలో శారదమ్మ అని నాన్నగారి చెల్లెలు ఉండేవారు, జ్ఞాపకం ఉందా? ఆవిడ కొడుకు గోపాల్." చారుమతి చెప్పింది.

"అలాగా, శారదమ్మకి కొడుకు ఉన్నాడని వినడమే కాని, ఎప్పుడూ చూడలేదు. ఎంతవాడి వయ్యావు! అమ్మ బాగుందా?" అంది శాంతమ్మ.

"ఆ ....బాగుందండీ" అన్నాడు గోపాల్.

"నిలుచునే ఉన్నావు. కూర్చో బాబూ. అమ్మా, చారు! బల్ల ఏదైనా తెచ్చి పడెయ్. కూర్చుంటాడు" అంది శాంతమ్మ.

"బల్ల ఏమీ వద్దండీ" అంటూ శాంతమ్మ పక్కనే కూర్చున్నాడు అతను.

"అమ్మ ఎక్కడ ఉంది?" అంది శాంతమ్మ తిరిగి.

"ఇక్కడే ఉంది. నాకు రైల్వే పార్సెల్ ఆఫీసులో పని. స్టేషన్ దగ్గిరే ఇల్లు తీసుకున్నాను. అమ్మ, నేను అక్కడే ఉంటున్నాము."

"బాగుంది నాయనా! అమ్మని కూడా తీసుకు రాక పోయావా? ఎన్నాళ్ళయిందో చూసి."

"ముందర ఇల్లు కనుక్కుందామని నేను ఒంటరిగా వచ్చాను. ఈ మారు అమ్మని తీసుకు వస్తాను. అమ్మ అస్తమానం మిమ్మల్ని, అమ్మమ్మని తలుచుకుంటూ ఉంటుంది. అన్నట్టు, అమ్మమ్మ ఎక్కడ?" అన్నాడు అతడు.

"హయ్యో! ఇంకెక్కడి అమ్మమ్మ? ఈ పాటికి బుగ్గె పోయి ఉంటుంది" అంది శాంతమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

తెల్లబోయాడతను. ఏమీ అర్థం కానట్టున్న అతనిని చూసి చారుమతి చెప్పింది.

"రెండు రోజుల నించీ మైకంలో ఉంది ఈ రోజే మామ్మ చనిపోయింది. బావలిద్దరూ ఆవిణ్ణి తీసుకుని స్మశానానికి వెళ్ళారు ఇప్పుడే."

గోపాల్ ఎంతో బాధ పడ్డాడు.

"అయ్యో! అమ్మమ్మని చూడాలని ఎంతో ఆశతో వచ్చాను. ఆవిడ కోసమని బత్తాయి పళ్ళు కూడా తెచ్చాను" అంటూ సంచీ చూపించాడు.

"దేనికైనా ప్రాప్తం ఉండాలి" అంది శాంతమ్మ.

గోపాల్ కాసేపు మౌనంగా కూర్చుని, లేచి నిలబడ్డాడు.

"ఇంక వెళతానండీ. నా మనస్సేం బాగులేదు. నిన్ననైనా వచ్చాను కాదు. అమ్మమ్మని చూసేవాణ్ణి" అన్నాడు.

"మన చేతిలో ఏం లేదు నాయనా. బాధపడకు. ఈ మారు అమ్మను తీసుకురా" అంది శాంతమ్మ.

చారుమతి వీధిదాకా వచ్చి దిగబెట్టింది అతన్ని. వాళ్ళు వీధి లోకి వచ్చేసరికి గోపాలరావు, రామారావు ఇంటి గుమం ఎక్కుతూ కనిపించారు. అపరిచితుడైన ఈ వ్యక్తిని ఒక్కసారి చూసి, ఇంట్లోకి వెళ్ళిపోయారిద్దరూ.

"మా బావగార్లు" అంది చారుమతి.

"వస్తాను వదినా" అన్నాడు గోపాల్.

"తరుచు వస్తూ ఉంటావుగా!" అంది చారుమతి.

గోపాల్ ని చూడగానే ఇష్టం ఏర్పడించి చారుమతికి. తెలివైన మెరిసే కళ్ళూ, మనిషిలో వినయం ఇట్టే ఆకర్షించాయి ఆమెని.

రాత్రి అందరు పడుకున్నప్పుడు, పక్కన పడుకున్న చారుమతిని అడిగింది శాంతమ్మ.

"ఈ అబ్బాయి నీకెలా తెలుసునే?"

"నాకు నాన్నగారు చనిపోక ముందే తెలుసమ్మా. నాన్నగారు ప్రతినెల గోపాల్ చదువుకోసం పాతిక రూపాయలు పంపేవారు. నాన్నగారు పోయాక నేను డబ్బు లేక పదిరూపాయలే పంపేదాన్ని. అదికూడా ఆరు నెలలే పంపాను" అంది చారుమతి.

"అబ్బాయి చూడు, మీ నాన్న పంపిన డబ్బుతో చక్కగా పైకి వచ్చాడు. రైల్వేలో ఉద్యోగం సంపాదించాడు. మనకే ఏ దిక్కూ కనిపించదు. శంకరానికి ఉద్యోగం దొరికిందో లేదో?"

"ఎందుకమ్మా అలా మాట్లాడతావు? అతనికి మంచి ఉద్యోగం వచ్చింది, బాగుపడ్డాడు అని మనం బాధపడితే ఒరిగేది ఏమిటి? దానితో శంకరానికి ఉద్యోగం వచ్చేస్తుందా? అతను కష్టపడి పైకి వచ్చాడని సంతోషించు" అంది చారుమతి.

చారుమతికి తల్లి అంటే ఎంత ఇష్టమున్నా, ఆవిడలో అప్పుడప్పుడూ కనిపించే ఈర్ష్య చూస్తే నచ్చదు.

మాధవరావు స్నానం చేసి అప్పుడే గదిలోకి వచ్చి అద్దం ముందు కూర్చుని తల దువ్వుకుంటున్నాడు. కాంతమ్మ వంటింట్లో పూజ చేసుకుంటూంది. పద్మ చేతిలో ఉత్తరంతో గబుక్కున అతని గదిలో ప్రవేశించి మాధవరావు వెనకాలే నిలబడింది. అతనిది పచ్చని దేహఛ్ఛాయ. తువ్వాలు కట్టుకుని అద్దం ముందు కూర్చున్న అతను ఎంతో అందంగా ఉన్నాడు. అనాఛ్ఛాదితమైన తెల్లటి వీపు అక్కడక్కడ నీటి బిందువులతో మెరిసిపోతూంది. పాలరాయిలా నున్నగా ఉన్న అతని వీపు మీద ఒక్కసారి చెయ్యి వేసి రాస్తే ఎలా ఉంటుందో అనుకుంది పద్మ. అతన్ని చూసినప్పుడల్లా ఉద్రేకంతో తన శరీరం, మనస్సు పొంగుతాయ్! తనని చూస్తే అతనిలో అలాంటి ఉద్రిక్తత ఉండదా? పద్మ ఆశ్చర్యపోయింది. అతని పురుషత్వంలో అపనమ్మకం కలిగింది.

బొమ్మలా వెనకనే నుంచున్న పద్మని చూసి మాధవరావు తెల్ల బోయాడు. వెనక్కి తిరగకుండానే చేతిలో పౌడర్ వేసి రాసుకుంటూ, "ఏం కావాలి?" అన్నాడు.

పద్మ ఆలోచనా ప్రపంచంలోంచి నిజలోకంలోకి దిగింది.

"నా ఫ్రెండ్ ఉత్తరం రాసింది. చదువుతారా?"

"నీ ఫ్రెండ్ ఉత్తరం రాస్తే నేనెందుకు చదవాలి?" మాధవరావు వెనక్కి తిరిగి పద్మను చూస్తూ అడిగాడు. అతని కళ్ళల్లో కనిపించిన అయిష్టత చూసి జంకింది పద్మ.

"నా స్నేహితులను గురించి మీకు తెలుసుకోవాలని లేదా?"

"లేదు" అన్నాడు అతను.

"మా అమ్మ చూస్తుంది. నువ్విక్కడ నించి వెళ్ళి పో" అన్నాడు తిరిగి అతనే.

"నేను మీతో మాట్లాడంలో తప్పేమి ఉంది? ఇకనించి నేను మీతో ఇంట్లో మాట్లాడదలచుకున్నాను." పద్మ తన నిశ్చయం చెప్పింది.

"నువ్వు మాట్లాడినా నేను మాట్లాడను."

"ఎందుకు మాట్లాడరు?"

"మా అమ్మకి ఇష్టం ఉండదని చెప్పాను కదా?"

"మీరు అమ్మతో అన్ని విపులంగా ఎందుకు మాట్లాడరు? మనిద్దరం మాట్లాడుకోడం ఇష్టం లేక పోతే, అమ్మ పెళ్ళి ఎందుకు చేసారు?"

అతనేం మాట్లాడలేదు.

"ఆమె పెద్దావిడ! పరిస్థితులు అర్థం చేసుకోలేకపోవచ్చు. మీరు చదువుకున్నవారు కదా! ఆవిడకి పరస్థితి సర్ది చెప్పకూడదూ?"

"నేనేం ఆవిడకి చెప్పను." ముభావంగా అన్నాడు అతను.

"ఎందుకు చెప్పరు? నేను చెప్పనా?" పద్మ కోపంగా అంది.

"ఎందుకు చెప్పనో నీకు అనవసరం. నువ్వు ఆవిడతో ఈ సంగతులు మాట్లాడనవసరం లేదు."

"నేను మాత్రం ఇక్కడ జీవఛ్ఛవంలా అవసరమా? మీకది ఇష్టమా?" పద్మరోషంగా అడిగింది.

"నీకు ఇక్కడ ఉండటం ఇష్టం లేకపోతే వెళ్ళి పోవచ్చును." మాధవరావులో చలనం లేదు.

"ఎక్కడికి వెళ్ళను?" పద్మ రెట్టించింది.

"అది నీ ఇష్టం" అంటూ గది బయటికి నడిచాడతను.

పద్మకి కోపం, దుఃఖం, రోషం పెల్లుబుకుతున్నాయి. వెనక్కి తిరిగే సరికి గుమ్మానికి ఎదురుగా ఎఱ్ఱటి కళ్ళతో అత్తగారు! భయంతో వణికిపోతూ తన గదిలోకి పరిగెత్తి, తలుపు వేసుకుని ఏడ్చింది పద్మ. తనివితీరా ఏడవటం కంటె ఏమీ చెయ్యలేదు తను. తనొక పద్మవ్యూహంలో చిక్కుకుంది. ఆ వ్యూహంలో బ్రతకలేదు, బయటపడలేదు. ఎంత అందం ఉంటేనేం,! ఎన్ని సౌఖ్యాలు ఉంటేనేం! భర్త ప్రేమ లేని స్త్రీ జీవితం వ్యర్థం. ఏం తప్పు చేసిందని తనకీ శిక్ష విధించాడు భగవంతుడు!

ఎన్నో అనుకుంది! అత్తగారి ఎడల మంచిగా ఉండి, ఆవిణ్ణి మార్చాలనుకుంది. ఎప్పుడూ అనుమానంతో, తన అందాన్ని ఈర్ష్యతో చూసే అత్తగారు తనని దగ్గిరికి చేరనివ్వలేదు.

భర్తకి దగ్గిరగా వెళ్లి అతనిని తనవేపు తిప్పుకోవాలనుకుంది. ఒక్కసారి అతనిలోని పురుషత్వాన్ని రెచ్చగొడితే తనవాడౌతాడనుకుంది. సిగ్గువిడిచి భర్త దగ్గిరికి వెళ్ళింది. అతనిని రెచ్చగొట్ట ప్రయత్నించింది. అన్ని వృథా అయాయి. అతనికి లోకంలో కనిపించే వస్తువు ఒకటే... అమ్మ. అమ్మ కోసం తన జీవితాన్ని బలి చేసుకుంటాడు. భార్య జీవితాన్ని బలి చేస్తున్నాడు!

అత్తగారి కథ తెలుసుకున్న పద్మ ఆవిడ మీద ఎంతో జాలిపడింది. కాని ఈ ఆరునెలల్లో ఆ జాలి అంతా కోపంగా మారిపోయింది. ఆవిడికి తన సుఖం తప్ప ఎదటివారి సుఖం అక్కరలేదు. చిన్నప్పుడు అత్తగారి వల్ల తను కష్టాలు పడింది కనక, ఇప్పుడు తన కోడలి మీద ఆ కసి తీర్చుకోవాలి. భర్తతో తను సుఖించలేదు. తన కోడలు కొడుకుతో సుఖించకూడదు. కోడలు తన అందంతో కొడుకుని ఎక్కడ మార్చేస్తుందో అని ఆవిడ భయం! కోడలి ఎడల ఆవిడ నిత్య శంకితురాలు!

అష్టకష్టాలు పడి తన ప్రేమ, ప్రాణం ధారపోసి కొడుకుని పెంచింది. ఇప్పుడు కొడుకు ప్రేమంతా తన ఒకర్తికే చెందాలి. తాళిగట్టిన భార్యకి కొడుకు ప్రేమ కొంచెం ఇచ్చినా ఆవిడ సహించలేదు. కొడుక్కి కొన్ని ఇతర సుఖాలు కావాలని ఆవిడ మరిచిపోతూంది. కొడుకు కాపరానికే చిచ్చు పెట్టడానికి ఆవిడ వెనుదీయటం లేదు.

ఆవిడ కొడుక్కి పెళ్లి ఎందుకు చేసినట్టూ? ఇది ఎప్పుడూ విడని సమస్య పద్మకి.

భర్తకి తల్లిపై గల గుడ్డి ప్రేమ, భార్య ఎడల చూపే మూర్ఖత్వం తలచుకుంటే పద్మకి కోపం కట్టలు తెంచుకు వస్తుంది.

ఏడ్చి ఏడ్చి మనస్సులో బాధంతా కంటి నీరులో కలుపుకుని విశ్రాంతి పొందింది పద్మ. కళ్ళు తుడుచుకుని చూస్తే బల్లమీద ఎదురుగా శ్రీదేవి ఉత్తరం కనిపించింది. ఉండ చుట్టేసిన ఆ ఉత్తరాన్ని తిరిగి సాపు చేసి ఎదురుగా పెట్టుకుంది.

"పియమైన పద్మకు,

నేను హైదరాబాద్ వచ్చి నెల్లాళ్ళు అయింది.

నీకు చారు రాసే ఉంటుంది, మా ఇంట్లో ఒక చిన్న బాబు నాలుగు నెలల క్రిందట వెలిశాడని. పేరు 'అమర్'.

ఎలా ఉందీ పేరు? నువ్వు, చారు నా పెళ్లి అప్పుడు బావపేరు బాగాలేదని నవ్వారు. పోనీ, మా బాబు పేరు నచ్చిందా?

పురుడు చాలా కష్టమైంది. పాపని కన్నా ప్రతి స్త్రీ 'తన పురుడు చాలా కష్టమైంది' అని అనుకుంటుందేమో! ఒక రోజంతా నొప్పులతో బాధపడ్డాను. తీరా ఆసుపత్రికి తీసుకువెళితే నొప్పులు ఆగిపోయాయి. నొప్పులు రావాలని డాక్టర్లు పాట్లు పడ్డారు. మళ్ళీ ఇంజెక్షన్స్.. గొడవా! అన్నీ రాస్తే నువ్వు ముందే భయపడతావేమో! డాక్టర్లు నాచురల్ డెలివరీ కావాలని ఎంత కష్టపడ్డా చివరికి ఫోర్సెప్స్ ఉపయోగించడం, కొద్దిగా కుట్లు పడటం తప్పలేదు. తరువాత బావతో అంతా చెబితే, 'అయ్యో! ఇంత కష్టపడ్డావా!' అని చాలా బాధ పడ్డారు. 'నువ్వింత కష్టపడతావని తెలిస్తే పిల్లలే వద్దందును' అంటారు. బాగుందా?

ఎంత కష్ట పడితేనేం, పద్మా! పక్కన బాబును చూసుకోగానే పడ్డ కష్టమంతా మరిచిపోతాం. ఎంత ఆనందంగా, ఎంత హాయిగా ఉంటుందో తెలుసా? బాబుని దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టుకోవడం కంటె తీయని అనుభవం ఇంకొంకటి లేదనిపిస్తూంది. నీకూ ఈ అనుభవం అయ్యాక ఆ తీపి ఎలాంటిదో తెలుస్తుంది. ఈ అనుభవాన్ని మాటలలో చెప్పలేము.

మా బాబుకి, మా ఇద్దరి పోలికలు వచ్చాయి. 'నా మొద్దు బుర్రా, బావ అల్లరీ' వచ్చాయిట. బావ ఏడిపిస్తూ ఉంటారు. ప్రస్తుతానికి తెల్లగానే ఉన్నా బాబు పెద్దయ్యాక నల్లగా మారిపోవచ్చును. అయినా మగవాడికి ఏ రంగు అయితేనేం? మీ పాపని మాత్రం తెల్లగా, బొద్దుగా ఉండేటట్టు కను. మీవారి రంగు, నీ రూపం వస్తే పాప అంత అందమైనది ఈ సృష్టిలోనే ఉండదు. మా కోడల్ని గురించి అప్పుడే నేను మంచి కలలు కంటున్నాను.

ఆలస్యం చెయ్యకు. మా బాబు పెద్దవాడై పోతున్నాడు.

ప్రేమతో

శ్రీదేవి"

పద్మనిట్టూర్చింది. అందమైన కోడలు, మంచి కలలు, తీయని అనుభవం! అవన్నీ తనకెక్కడ? అన్నీ ఎండమావులు. పెళ్లి అయి నాలుగేళ్లయినా తను అనాఘ్రాత పుష్పంగానే మిగిలి పోయిందంటే శ్రీదేవి ఏమంటుందో? జీవితంలో ఏ అనుభవం లేకుండా అడివిని కాచిన వెన్నెలలో ఇలా ఈ జీవితం గడిచిపోతూంది.

పద్మకి తనమీద తనకే జాలి వేసింది. తిరిగి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

పద్మ ఆ రోజంతా భోజనం చెయ్యలేదు. అత్తగారూ బలవంతం చెయ్యలేదు. ఒక్కసారి మాత్రం విసురుగా, "తిండి మానేసి ఎవరిని సాధించాలని?" అంది. పద్మ మాట్లాడకుండా పుస్తకాలు ముందర వేసుకు కూర్చుంది. మర్నాటి నించి పరీక్షలు. బి.ఏ. అయిపోయేక ఏం చెయ్యాలి? ఇలాంటి ఇంటి పరిస్థితులలో పిచ్చి ఎక్కి పోకుండా తనని కాపాడేవి పుస్తకాలు, కాలేజీ! అంతే! ఆ చదువుకూడా ఆగిపోతే ఏది దిక్కు?

"తలనొప్పిగా ఉంది" అంటూ మాధవరావు మూడు గంటలకే ఆఫీసునించి ఇంటికి వచ్చేశాడు.

కాంతమ్మ గాభారాపడింది. మంచం వేసి, పక్క పరిచి, కొడుకుని పడుకోమని తను అమృతాంజనం తెచ్చింది. నుదుటి మీద రాయబోతూ చూసి, "బాబూ! జ్వరంగా ఉందేమిటి? ఇలా కాలిపోతూంది ఒళ్ళు" అంది. ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మాధవరావు, "నువ్వేం కంగారుపడకమ్మా" అంటూ కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

కొడుక్కి అమృతాంజనం రాసింది. వేడివేడి కాఫీతో తలనొప్పి మాత్ర ఇచ్చింది. అయినా ఆవిడ కంగారు తగ్గలేదు. అయిదు నిమిషాలకి ఒకసారి,"బాబూ! తలనొప్పి తగ్గిందా? ఇంకా జ్వరం తగ్గలేదేమిటి? డాక్టర్ని తీసుకురానా?' అని అడుగుతూనే ఉంది.

భర్తకి జ్వరం అని తెలిసి పద్మ కూడా ఆత్ర పడింది.

మంచం దగ్గిరికి వచ్చి, "ఎలా ఉంది తలనొప్పి? జ్వరం ఉందా?" అని అత్తగారిని అడిగింది.

పద్మని చూస్తూనే అత్తగారు కస్సుమని లేచింది.

"నా బాబు దగ్గిరికి రాకు. నీ వల్లే ఈ జ్వరం వచ్చింది. నువ్వే ప్రొద్దున్న ఏదో చేసి ఉంటావు" అంది.

పద్మ సిగ్గుతో వెనక్కి వెళ్ళిపోయింది. తన భర్తకి ఒంట్లో బాగుండకపోతే ఆ మాత్రం అడిగే హక్కు తనకి లేదా?

రాత్రి అంతా మగత నిద్రగానే గడిపారు పద్మా, అత్తగారూ. కాంతమ్మ అస్తమానం కొడుకుని ముట్టుకుని చూస్తూనే ఉంది.

తెల్లవారింది. మాధవరావు జ్వరం తగ్గలేదు. కొద్దిగా ఎక్కువ అయింది. కాంతమ్మ పనిమనిషి చేత పక్క ఇంట్లో ఉన్న డాక్టరుకి కబురు పంపింది. తొమ్మిదింటికి డాక్టరు వచ్చి మాధవరావుని పరీక్షించాడు.

"ఏమి జ్వరమండీ? ఎంత ఉంది జ్వరం? ఇవాళ తగ్గి పోతుందా?" అంటూ ఆత్రంగా అడిగింది కాంతమ్మ.

"మీరేం కంగారు పడకండి. ఫ్లూ జ్వరం. రెండు రోజుల్లో తగ్గి పోతుంది" అన్నాడు డాక్టరు.

పద్మ ముఖం నేలవేసుకుని దూరంగా తన గది ద్వారబంధానికి ఆనుకుని నిలుచుంది. డాక్టరు ఏమనుకున్నాడో పద్మ వేపు తిరిగి, "మీరు దిగులుపడవలిసింది ఏమీ లేదమ్మా. చదువుకున్నవారు మీరే అలా అయితే ఎలా? ఈ మాత్రలు మూడు పూటలా వేడి కాఫీతో కాని, పాలతో గాని ఇవ్వండి. అన్నం పెట్టకండి. తేలికగా జీర్ణం అయ్యే ఆహారం ఇవ్వండి" అని మందు ఇస్తూ ఇంగ్లీషులో చెప్పాడు.

కాంతమ్మ వెంటనే గబుక్కున మందు పొట్లాలు డాక్టరు చేతిలోనించి లాగేసుకుని, "ఆ అమ్మాయికి ఏమీ తెలియదండీ. నాకు మీరు అంతా తమిళంలో చెప్పండి" అంది.

డాక్టరు తెల్లబోయాడు. ఒక్కసారి పద్మ ముఖంవంక ఆశ్చర్యంగా చూసి, తరవాత కాంతమ్మ గారితో ఆహార విషయం, మందు విష్యం తమిళంలో చెప్పి వెళ్ళిపోయాడు.

పద్మ అవమానభారంతో తల వంచుకుని గదిలోకి వెళ్ళిపోయింది.

ఆరోజు మొదటి పరీ. కాలేజీకి వెళ్ళాలా? మానాలా? వెళ్ళితే అత్తగారు ఏమంటుందో? అయినా తను ఇంట్లో ఉండి చేసే పని ఏమిటి? ఎలాగా భర్త దగ్గిరికి వెళ్ళనీయదు అత్తగారు.

పద్మ పరీక్షకి వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

పద్మ సాయంత్రం కాలేజీనించి వచ్చే సరికి కాంతమ్మ కొడుకు మంచానికే ఆనుకుని కూర్చుని ఉంది. జ్వరం తగ్గిందో, లేదో తెలియదు. దగ్గిరికి వెళ్ళితే అత్తగారు కోపగిస్తుంది. పద్మవల్లే కొడుకుకి జ్వరం వచ్చిదని ఆవిడ దురభిప్రాయం.

ప్రొద్దున్న నించి భోజనం లేదు. పైగా, పరీక్ష రాసిన అలసట. పద్మ వంటింట్లోకి వెళ్ళింది. కాని ప్రొద్దున్న వంట చేసిన జాడ లేదు. అక్కడ కాంతమ్మ భోజనం లేకుండానే కొడుకుకి ఉపచారాలు చేస్తూ కూర్చుంది.

పద్మ వంట చేసి, భయపడుతూ అత్తగారి దగ్గిరికి వెళ్ళి, "భోజనం చేస్తారా? వంట చేశాను" అంది మెల్లగా.

"నా కొడుక్కి జ్వరం వచ్చి పస్తు పడుకుంటే నన్ను భోజనం చెయ్యమంటావా? ఏమైనా బుద్ధి ఉందా నీకు? అవును, తల్లి ప్రేమ నీకేం తెలుస్తుంది? వాడలా పడుకుని ఉంటే నువ్వు షోగ్గా కాలేజీకి వెళ్లి రాగలవు. సుష్టుగా భోజనం చెయ్యగలవు. నువ్వెళ్ళి మెక్కు. నాకు వద్దు" అంది కాతమ్మ కోపంగా.

పద్మ వంటింట్లో లైట్లు ఆర్పి, తలుపు వేసి వచ్చి తన గదిలో పక్క మీద వాలిపోయింది. కళ్ళలో నీళ్ళు వస్తూంటే, 'ఏమిటి ఇంకా నేను శిలగా మారి పోలేదా?' అనుకుంది.

రెండో రోజు మాధవరావు జ్వరం తగ్గింది. కాని ఆ రోజు పథ్యం పెట్టవద్దన్నాడు డాక్టరు. మాధవరావుతో పాటు తల్లికీ, భార్యకీ పస్తు ఆ రోజు.

'భోజనం, నిద్రా లేకుండా ఎలా ఉండగలదు ఈవిడ?' అని ఆశ్చర్యపోయింది పద్మ. కొడుకు పస్తుంటే లోకంలో ఇంక ఎవరూ భోజనం చెయ్యకూడదు. ఏమిటీ వెర్రి ప్రేమ?

కాంతమ్మ కొడుక్కి రాత్రింబవళ్ళు ఉపచారాలు చేస్తూనే ఉంది. కోడల్ని మాత్రం మంచం దగ్గిరికి కూడా రానివ్వలేదు.

పద్మ మనస్సు మొద్దు బారిపోయింది. 'వాళ్ళు తల్లీ కొడుకులూనూ! నేనెవరిని? నేను వీళ్ళకేమీ కాను' అనుకుంది. పరీక్ష పాసైతేనేం? లేకపోతేనేం? ఏదో వేదాంతం, నిరాశ ఆవరించాయి. నిన్న అత్తగారి మాటలతో తల బొప్పి కట్టింది. మళ్ళీ ఈ రోజు పరీక్షకి వెళితే ఏం మాటలు పడవలిసి వస్తుందో? ఆ రోజు పరీక్షకి వెళ్ళలేదు పద్మ.

మూడోరోజు మాధవరావుకి పథ్యంపెట్టారు. ఆ రోజు భోజనం చెయ్యడానికి అత్తగారు అనుమతి ఇచ్చినా, అన్నం తినలేకపోయింది పద్మ. సాయంత్రానికి విపరీతమైన తలనొప్పి, జ్వరం వచ్చాయి. 'ఎవరితో చెప్పుకోను?' అనుకుంటూ మౌనంగా పడుకుంది పద్మ.

మరునాటికి మాధవరావు ఆరోగ్యంగా లేచి తిరగటం ప్రారంభించాడు. పద్మ మాత్రం ఒళ్ళు నొప్పులు, తలనొప్పి, జ్వరంతో పక్క మీదనించి దిగలేక పోయింది.

ఎనిమిది గంటలకి అటువైపు వచ్చిన కాంతమ్మ కోడలు ఇంకా పడుకుని ఉండటం చూసి, "ఏం మహారాణి గారికి ఇంకా తెల్లవారలేదా?" అంది వ్యంగ్యంగా.

"జ్వరం వచ్చింది. తల పగిలిపోతూంది" అంది పద్మ మెల్లిగా.

"ఎవరికైనా ఉసురు పెడితే ఊరికే పోతూండా? అనుభవించాలి" అంటూ అత్తగారు వెళ్ళిపోయింది. గంట తరువాత డాక్టరు వచ్చాడు. పద్మని చూసి, "ఈవిడకీ ఫ్లూయే వచ్చింది. భయం లేదు, ఇంట్లో ఒకరికి వస్తే తక్కినవాళ్లకి కూడా రావడం మామూలే. అబ్బాయికి ఇచ్చిన మాత్రలే యిస్తాను" అన్నాడు.

డాక్టరు అటు వెళ్ళగానే, "విన్నావుగా ఆయన మాటలు. రోజుకి మూడుసార్లు వేసుకోవాలిట ఈ మాత్రలు. బల్ల మీదపెడుతున్నాను, వేసుకో" అని బయటికి వెళ్ళిపోయింది కాంతమ్మ.

'కొడుక్కి జ్వరం వస్తే అన్ని ఉపచారాలు చేసినావిడ, కోడలికి వస్తే అలా ఎలా విదిలించేయగలదు? ఒకరి మీద అంత దయ కురిపించి, రెండో మనిషి ఎడల అంత నిర్దయగా ఎలా ప్రవర్తిస్తారు?' అనుకుంది పద్మ.

జ్వర తీవ్రత, తలనొప్పి. ప్రతి మనిషికి కష్టాలలో, అనారోగ్యంగా ఉన్నప్పుడు తల్లి, తండ్రి జ్ఞాపకం రావడం సహజం. పద్మ తల్లిని, తండ్రిని జ్ఞాపకం చేసుకుని ఏడ్చింది. 'పువ్వుల్లో పెట్టి, ప్రేమంతా కుమ్మరించి, ఎంతో గారాబంగా పెంచి ఈ రాక్షసుల మధ్య ఎందుకు పారేశావమ్మా నన్ను? పెళ్లి పేరు చెప్పి మీ చల్లటి నీడనించి ఈ అగ్ని గుండంలోకి ఎందుకు తోశారమ్మా? దిక్కులేనిదానిలా జ్వరంతో అల్లాడి పోతున్నానని తెలిస్తే ఎంత బాధపడతారో?' అనుకుంటూ దుఖించింది.

పద్మ జ్వరం నాలుగు రోజుల దాకా తగ్గలేదు. రోజూ డాక్టరు వచ్చి చూసే వాడు. అత్తగారు కాఫీ కాచి పోసేది. మాధవరావు డాక్టరుతో పాటు రోజూ భార్య గదిలోకి వచ్చి, డాక్టరుతో మాట్లాడి వెళ్ళిపోయేవాడు. ఒక్క రోజూ భార్యని మాట వరసకైనా, "ఎలా ఉంది పద్మా ఒంట్లో?" అంది అడగలేదు,

పద్మ జ్వరంలోనే ఒక నిశ్చయానికి వచ్చింది. 'ఈ తల్లీ కొడుకులకి నేను అవసరం లేదు. ఎవరికీ అవసరం లేని చోట నేను ఉండటంలో అర్థం లేదు' అని.

పథ్యం తీసుకున్న మూడవరోజు పెట్టె, పరుపు సర్దుకుంది ఆఖరి ప్రయత్నంగా భర్త ఆఫీసుకు వెళ్ళిపోతూ ఉంటే చెప్పింది. "నేను కాకినాడ వెళ్లిపోతున్నాను" అని. మాధవరావు ఒక్క నిమిషం ఆగాడు. "నీ ఇష్టం" అని ముందుకు వెళ్ళిపోయాడు.

"వద్దు", "ఇప్పుడెందుకు?", "మళ్ళీ ఎప్పుడు వస్తావు?", "నీరసంగా ఉన్నావు, ఒక్కర్తివీ వెళ్ళగలవా?'.. ఏ మాటా అతని నోటినించి రాలేదు.

సాయంత్రం పనిమనిషి చేత టాక్సీ తెప్పించుకుంది. డ్రైవరు వచ్చి పెట్టె, పరుపు తీసుకు వెళ్ళాడు. అత్తగారు హాల్లో నుంచుని చూస్తూ ఉంది. ఆవిడతో 'వెళుతున్నాను' అని చెప్పనా అని ఆలోచించింది పద్మ. 'ఆవిడికి నేను అవసరం లేనప్పుడు నాకూ ఆవిడ వద్దు' అనుకుని మౌనంగా టాక్సీ ఎక్కి కూర్చుంది.

మద్రాసు– హౌరా మెయిలు మద్రాసునించి రాత్రి ఎనిమిది గంటలకి బయుదేరుతుంది. అందులో ఎక్కి కూర్చుంది పద్మ.

రైలు బయలుదేరింది. ప్రయాణీకులకు వీడ్కోలు చెపుతూ మద్రాసు పౌరులు చేతులు ఊపుతున్నారు, పద్మకి మాత్రం అక్కడ ఎవరూ లేదు. 'మద్రాసుతో నీ ఋణం తీరిపోయింది' అంది పద్మ మనస్సు. అస్థిపంజరంలా నీరసంగా ఉన్న పద్మ శరీరమంతా వణికింది ఒక్కసారి. 'నేను చేసేది మంచి పనేనా?' అనుకుంది.

రైలు జనంతో కిటకిటలాడుతూంది. అయినా ప్రయాణీకులంతా అలాగే చోటు చేసుకుని సామానుల మీద వాలి, బెంచీల కింద దుప్పట్లు పరుచుకుని నిద్రలో మునిగారు. కూర్చున్నవాళ్ళు ఒకరి మీద ఒకరు వాలి తూగుతున్నారు. నిద్ర సుఖమెరగదు మరి! పద్మ ఒక్కర్తే కిటికీ దగ్గిర కూర్చుని 'నేను ఒంటరిగా మిగిలిపోయాను' అనుకుంటూ రాత్రి అంతా జాగారం చేసింది. మనస్సు ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకుకోమని ప్రోత్సహించింది. రైలు కృష్ణా బ్రిడ్జి మీదనించి వెళుతున్నప్పుడు, గోదావరి నది దాటుతున్నప్పుడు రైల్లోంచి గెంతి నీటిలో పడి చచ్చి పోదామనుకుంది. కాని తల్లీ, తండ్రి మమ్మల్ని అన్యాయం చెయ్యకమ్మా అంటునట్టు అనిపించి జీవచ్ఛవంలా అలాగే కూర్చుండి పోయింది.

మరునాడు మధ్యాహ్నం రెండు గంటలకు ఇల్లు చేరింది పద్మ. తెల్లగా పాలిపోయి, నీరసంగా, అస్థిపంజరంలా ఇల్లు చేరిన కూతురిని చాసి వరలక్ష్మి గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. ఉత్తరమైనా రాయకుండా ఒంటరిగా ఆ స్థితిలో వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్య పోయారు నారాయణరావు గారు.

**చారుమతి** ఇంట్లో అంతా సంతోషంగా ఉన్నారు. మే నెల మొదటి తారీఖున శంకరం దగ్గిర నుంచి ఉత్తరమూ, అయిదు వందల రూపాయలకి మనియార్డరూ వచ్చాయి. ఆ రోజు శాంతమ్మ సంతోషం చెప్పనలవి కానిది. ఇంట్లో అందరికీ కూడా మహానందమయ్యింది. శంకరం ఉత్తరంలో నాలుగు ముక్కలే రాశాడు.

**"అమ్మకు,**

**నమస్కారాలు.**

నేను క్షేమంగా ఉన్నాను. ప్రస్తుతం నేను మధ్యప్రదేశ్ లో, 'బిజోరి' అనే ప్రదేశంలో బొగ్గు గనులలో ఉద్యోగం చేస్తున్నాను. గనులలో పని చేస్తున్నానని భయపడకు. ప్రమాదమేమీ లేదు. ఈ ఉద్యోగం ఎలా వచ్చిందో నేను మన ఊరు వచ్చినప్పుడు వివరంగా అన్నీ చెబుతాను. నా కిప్పుడు నెలకి మూడు వందల రూపాయల పైన దొరుకుతూంది. ప్రతి నెలా నేను వంద రూపాయలు ఇంటికి పంపుతాను.

తొందరలోనే సెలవు తీసుకుని వస్తాను.

అక్కడ అందరూ బాగున్నారని తలుస్తాను. మామ్మ ఆరోగ్యం ఎలా ఉంది? రేవతక్క, బావగారూ, పిల్లలూ క్షేమంగా ఉన్నారా? చారుని, భగవతిని అడిగానని చెప్పు. అందరినీ చూడాలని ఉంది. మన ఇంట్లో ఉండే రామారావు మాస్టారు బాగున్నారా? ఆయనికి నా నమస్కారాలు అందజెయ్యి.

**ఉంటాను.**

**శంకరం**

ఉత్తరం చదువుకొని ఆనంద బాష్పాలు రాల్చింది శాంతమ్మ. తమ సంతోషం పంచుకోవడానికి అత్తగారూ, భర్తా లేరని విచారించింది అంతలోనే.

శంకరం పంపిన అయిదు వందలూ చూడగానే పెద్ద బరువు తీరినట్లు నిట్టూర్చింది చారుమతి. పూర్వం పరీక్షల కోసము, ముసలావిడ మందుల కోసము, భానుమతి పెళ్ళికి చేసిన అప్పులు ఇంకా కొన్ని మిగిలి పోయాయి. ఆ అప్పుల మీద వడ్డీ పెరుగుతూంది. 'ఎలా తీర్చడమా? ఇంట్లో ఏ వస్తువులు అమ్మడమా?' అని బెంగ పెట్టుకుంది చారుమతి.

తల్లితో చెప్పి శంకరం పంపిన డబ్బంతా తీసుకుని మూడిళ్ళ అవతల ఉన్న సూరమ్మ గారింటికి వెళ్ళింది. ఆవిడ వడ్డీకి డబ్బు ఇస్తుంది. బాకీ తీర్చగా చారుమతి చేతిలో మిగిలినవి ముప్పయి రూపాయలు. ఎంతో కష్టమనిపించింది. ఆ డబ్బు తీసుకువెళ్ళి తల్లి చేతిలో పోసి, "ఇదేనమ్మా మిగిలింది" అంది. డబ్బు చూసి నిట్టూర్చింది శాంతమ్మ,

శంకరం పంపిన డబ్బుతో ఎన్నో కొనవచ్చుననుకుంది శాంతమ్మ. అందరు కూతుళ్ళకూ తలో చీరా, రవికా అయినా అమరుతాయనుకుంది. ఇప్పుడు చూస్తే మూడే మూడు పదిరూపాయల నోట్లు మిగిలాయి. భగవతికి బట్టల పిచ్చి ఎక్కువ. తక్కిన వాళ్ళెవరూ బట్టల కోసం అంత వాచిపోరు.

శాంతమ్మ తిరిగి చారుమతి చేతికి డబ్బు ఇస్తూ, "భగవతికి బట్టలు కొను" అంది.

మాలతి కూడా చిన్నదే. ఇద్దరికీ కొంటే బాగుండుననుకుంది చారుమతి. భగవతి చీర కొనుక్కోగా మిగిలిన డబ్బుతో కొనవచ్చు ననుకుంది.

ఆ రోజు సాయంత్రమే భగవతినితీసుకుని బట్టల కొట్లకి వెళ్ళింది చారుమతి.

"నాకు నల్ల జార్జెట్ చీర కొనుక్కోవాలని ఎన్నాళ్ళ నించో ఉందక్కా. ఇవాళ కొనుక్కుంటాను" అంది భగవతి దారిలో. "సరే" నంది చారుమతి.

బజార్లో నాలుగైదు కొట్లు తిరిగాక నల్ల జార్జెట్ చీర దొరికింది. దాని మీదికి నల్ల లాన్ గుడ్డ జాకెట్టుకు తీసుకుంది భగవతి. రెండూ కలిపి ఇరవై ఎనిమిది రూపాయలు అయ్యాయి. 'ఇంక మాలతికి ఏం కొనను?' అనుకుంది చారుమతి. కాని చీర తీసుకుని తెగ ఆనంద పడిపోతున్న చిన్న చెల్లెలి ముఖం చూశాక మాలతికి చీర కొనలేదన్న విచారం తగ్గి పోయింది.

"ఆదివారం పిక్నిక్ ప్రోగ్రాం ఉంది కాదక్కా. ఆ రోజు కట్టుకుంటాను" అంది భగవతి హుషారుగా.

చారుమతికీ, రామారావుగారికీ వేసంగి సెలవులు ఇచ్చేశారు. ఆదివారం ఎక్కడికైనా పిక్నిక్ కి వెళ్దామని గోపాల్ సూచన చేశాడు. అతని సూచన అందరికీ నచ్చింది. ముఖ్యంగా రామారావుగారూ, భగవతీ చాలా మద్దతు ఇచ్చి ఉత్సాహం చూపించారు. ఎక్కడికి వెళదామని ఆలోచించారు.

"సర్పవరం వెళదాం. అక్కడ మల్లె తోటలు, మామిడితోటలు చాలా బాగుంటాయి" అంది చారుమతి.

"అవును. అక్కడ భావనారాయణ స్వామి దర్శనం కూడా చేసుకోవచ్చు" అంది శాంతమ్మ.

అందరూ ఆమోదించారు. ప్రొద్దున్నే తినడానికి యేమైనా తీసుకుని వెళ్లాలని నిశ్చయించుకున్నారు. తమతో పాటు శాంతమ్మ, గోపాల్ తల్లి శారదమ్మ కూడా రావాలని చిన్న వాళ్ళంతా పట్టు పట్టారు. "మీ అందరితో మేమెందుకు?" అని వెనక తీసినా, చిన్నవాళ్ళ బలవంతానికి లొంగక తప్పింది కాదు పెద్ద వాళ్లకి.

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకల్లా వచ్చేశారు శారదమ్మా, గోపాలూను. పెద్ద కారియర్ నిండా జంతికలు, చేగోడీలు చేసి తెచ్చింది శారదమ్మ. పులిహోర, దద్దోజనం చేసింది శాంతమ్మ.

"కోటయ్య కొట్లో రెండు రూపాయలు పెట్టి కాజాలు కొనుక్కు రావయ్యా" అన్నారు రామారావుగారు.

ఇంటి తాళం వేసుకుని కారియర్లతో బయలుదేరుతున్న ఈ కుటుంబాన్ని వింతగా చూసారు ఇరుగుపొరుగు. మసీదు దగ్గర సిటీ బస్సు కోసం  అందరూ నిలుచున్నారు. గోపాల్ దగ్గిరలోనే ఉన్న కోటయ్య మిఠాయి దుకాణానికి వెళ్ళి కాజాలు తెచ్చాడు. శంకరం పంపిన అయిదు వందలలో మిగిలిన రెండు రూపాయలు పెట్టి కొబ్బరికాయ, పళ్ళు, పువ్వులు, కర్పూరం, అగరువత్తులు కొంది చారుమతి.

సర్పవరం కాకినాడకి దగ్గిరలోనే ఉంది. కాకినాడ నించి సిటీ బస్సులు వెళతాయి. బస్సులో యెక్కి అరగంటలో సర్పవరంలో దిగారు అంతా. ఊరికి కొంత దూరంగా ఆగింది బస్సు.

మామిడి తోటలు చూడగానే ఆనందమయింది అందరికి. మామిడి చెట్లన్నిటికీ బరువుగా కాయలు వేళ్ళాడుతున్నాయి.

"ఈసారి మామిడి కాపు బాగుంది" అన్నారు రామారావుగారు, కనుచూపు మేరంతా పచ్చని తోటలతో నిండిన ఆ వూరు చూస్తూ. మామిడి తోటల మధ్య ఇసుక బాటలో నడిచారు అందరూ. గుడికి చేరువవుతున్న కొద్దీ పూలతోటలు యెక్కువ అయ్యాయి. ఎక్కడ చూసినా మల్లె తోటలు, గులాబీ తోటలు, పూలతోటల మధ్య కాయగూరల మడులూనూ.

"ఈ పూలు, కాయలూ చూస్తూ ఎన్ని రోజులైనా గడిపేయవచ్చు" అంది చారుమతి.

గుడి చేరారు. అది చాలా పురాతనమైనది. శిధిలావస్థలో ఉంది. గుడికి ఎదురుగా చెరువు వుంది. చెరువు నిండా తెల్లని, ఎర్రని తామర పువ్వులు.

"దీన్ని నారదగుండం అంటారు" అంది శాంతమ్మ.

"బావా! నాకా ఎర్ర తామర పువ్వులు తెచ్చి పెట్టవూ?" అంది భగవతి, గోపాల్ ని చూస్తూ. తనకి బావ వరస అవుతాడని తెలిశాక, 'బావా' అనే పిలుస్తూంది అతన్ని భగవతి. శారదమ్మ కొడుకుని బాబూ అని పిలవడం వల్ల తక్కిన అందరూ బాబూ అనే పిలుస్తున్నారు. మాలతి మాత్రం ఏమనీ పిలవదు. మాలతి కంటె గోపాల్ రెండేళ్ళు పెద్ద వాడు.

గోపాల్ పాంటు కాళ్ళ దగ్గిర పైకి మడిచి చెరువు వొడ్డుకు వెళ్ళి కొన్ని ఎర్ర, తెల్ల తామరలు తెచ్చి భగవతికి ఇచ్చాడు. తెల్లటి భగవతి నల్లటి జార్జెట్ చీరలో, చేతిలో తామర పువ్వులతో ఎంతో ముద్దుగా, అందంగా వుంది.

చెరువులో కాళ్ళు కడుక్కుని గుడి లోపలి వెళ్ళారు. గుడి అంతా నిర్మానుష్యంగా వుంది. అప్పుడే పూజారి వచ్చి దేవుడి విగ్రహాలకి దీపం వెలిగిస్తున్నాడు.

"పూజ చేయిస్తారేమిటి?" అన్నాడు అతను వీళ్ళను చూస్తూనే.

"అష్టోత్తరం చేయండి" అంది శాంతమ్మ పళ్ళూ, పూలూ ఆయనకి ఇస్తూ.

పూజారి మంత్రాలతో పూజ చేసి, హారతి వెలిగించి, "ఈ స్వామిని భావనారాయణ స్వామి అంటారు. శ్రీ మహా విష్ణువు అవతారమే" అన్నాడు.

అందరూ భక్తితో నమస్కరించి బయటికి వచ్చారు.

కాసేపు చెరువు పక్కనే ఉన్న గడ్డి వాము దగ్గర కూర్చుని, పన్నెండు గంటలకి తెచ్చుకున్న పులిహోరా, దధ్యోదనం తిని తోటలు చూడటానికి బయలుదేరారు.

మల్లె తోటలలో మల్లె మొగ్గలు లెక్క లేనన్ని నక్షత్రాలలా ఉన్నాయి. ఒక తోటలో మాలికి డబ్బులు ఇచ్చి పైట చెంగు నిండా మల్లెలు పోయించుకుంది భగవతి.

మామిడి తోటలలో మాత్రం కాయ ముట్టుకోనివ్వమన్నారు తోటమాలులు. రామారావుగారు ఒక తోట మాలిని అడిగారు. "ఇక్కడ నీడగా ఉంది. చెట్ల క్రింద కాసేపు కూర్చుని వెళ్లి పోతాం" అని. అతను ఒప్పుకున్నాడు.

అందరూ చెట్ల క్రింద కూర్చున్నారు. భానుమతీ, మాలతీ మల్లెమొగ్గలు కడుతూ కూర్చున్నారు. మల్లె మొగ్గల కోసమని ఇంటి దగ్గిర నించే దారం తెచ్చారు వాళ్ళు. శారదమ్మ తన కారియర్ తీసి జంతికలు, చేగోడీలు కాయితాలలో పెట్టి అందరికీ ఇచ్చింది.

"శారదమ్మా! ఒక చక్కటి కృతి పాడమ్మా. చిన్నప్పుడు నువ్వు ఎంతో బాగా పాడే దానివి. మళ్ళీ నీ పాట వినాలని వుంది" అంది శాంతమ్మ.

"నా గొంతుక యిప్పుడు బాగా లేదు వదినా. బొంగురు పోయింది. పాట కూడా మరిచి పోయాను" అంది శారదమ్మ.

"ఫరవాలేదు పాడండి. నాకూ సంగీతం అంటే చాలా ఇష్టం" అన్నారు రామారావుగారు.

శారదమ్మ కాసేపు ఆలోచించి, యదుకుల కాంభోజి రాగంలో త్యాగరాజ కృతి పాడింది.

"పాహి రామచంద్ర రాఘవా, హరే రామయ్యా"

చారుమతి ఆవిణ్ణే చూస్తూ కూర్చుంది. ఆవిడ గొంతుకలో శ్రావ్యత తగ్గిపోయి ఉండవచ్చు. కాని పాటలో భావం మేళవించి తన్మయురాలై పాడుతూంది. భగవంతుణ్ణి యెదట నిలిచి వేడుకుంటున్నట్టే వుంది.

శారదమ్మ సన్నగా ఉంటుంది. పేదరికం, కష్టాలు అనుభవించిన జాడలూ ఆవిడలో ముద్ర వేసుకున్నాయి. ఆవిడ కళ్ళు దీనంగా, అమాయికంగా ఉంటాయి. మంచితనం మనిషిలో, మాటలో నిండి ఉంటుంది. 'గోపాల్ కి తల్లి మంచితనమే వచ్చింది' అనుకుంది చారుమతి.

"ఎంత బాగా పాడారమ్మా! ఈ పాటకి ముసిరి సుబ్రహ్మణ్య అయ్యారు రికార్డు ఉంది. ఆయనే ఎంతో బాగా పాడారనుకున్నాను. కాని ఆయన పాటను మించి పోయింది మీ పాట" అన్నారు రామారావుగారు.

"అమ్మ కింత బాగా సంగీతం వచ్చు కదా బాబూ! నీకూ వచ్చి ఉండాలి. నువ్వో పాట పాడు" అంది భానుమతి.

"నాకు సంగీతం రాదు. భావగీతాలు పాడుతాను" అన్నాడు గోపాల్.

"అవే పాడు" అంది చారుమతి.

గోపాల్ గొంతు సవరించుకున్నాడు. ఎంకి పాట యెత్తుకున్నాడు.

"ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా,

ఎన్నెలల సొగసంతా యేటి పాలే నటరా"

అతని గొంతుకలోని గంభీరత్వం బొంగురుతనం పాటకి నిండుతనం కూర్చాయి. ఆడపిల్లలందరికీ అతని పాట ఎంతో నచ్చింది.

"ఎన్నాళ్ళయింది భావగీతం విని" అంది భానుమతి.

"ఎవరు పాడేవారు పూర్వం?" అన్నాడు గోపాల్.

"ఎవరు పాడటం ఏమిటి? మా అక్క పాడుతుంది" అంది మాలతి చారుమతిని చూపిస్తూ.

"వదినా! నువ్వొక పాట పాడవా?" అన్నాడు గోపాల్.

"నువ్వు పాడతావని ఇన్నాళ్ళూ నాకు తెలియదమ్మా" అన్నారు రామారావుగారు ఆశ్చర్యంగా.

"మ్రోయింపకోయ్ మురళి మ్రోయింపకోయ్ కృష్ణ

తీయ తేనియ బరువు

మ్రోయ లేదీ బ్రతుకు"

అన్న కృష్ణ శాస్త్రి గారి పాట పాడింది చారుమతి. చారుమతి కంఠం చాలా తియ్యగా, మధురంగా ఉంది.

"నువ్వింత తీయగా పాడితే మా బ్రతుకూ మోయలేని బరువై పోతుంది" అన్నాడు గోపాల్ సంతోషంగా.

"బావగారూ! మీకు భావ గీతాలంటే అట్టే ఇష్టం ఉన్నట్టు లేదే!" అంది మాలతి.

"ఎందుకిష్టం లేదమ్మా! మా చిన్నప్పుడు మేం రాజేశ్వరరావూ, బాల సరస్వతీ, సూర్యకుమారీ పాడిన భావగీతాలు ఎక్కువగా వినే వాళ్ళం. అయితే మాత్రం వాళ్లకి ఇటు భావగీతాలూ, కర్ణాటక సంగీతం, అటు సైగల్, పంకజ్ మల్లిక్ పాడిన హిందీ పాటలూ అన్నీ ఇష్టమే. నాకు ప్రత్యేకంగా సైగల్ పాటలంటే చాలా ఇష్టం" అన్నారు రామారావుగారు.

"సైగల్ పాటలంటే చాలామంది పెద్దవాళ్ళు ఇష్టపడతారు. అతని పాటలలో ఉన్న గొప్పతనమేమిటో?' అన్నాడు గోపాల్.

"నువ్వు ఒక్కసారి సైగల్ పాడిన 'సోజా రాజకుమారీ', 'బాబుల్ మోరా', 'ప్రేం కా హై ఇస్ జగమే' వంటివి జాగ్రత్తగా వింటే అందులో ఉండే గొప్పతనం నీకే తెలుస్తుంది."

"ఈ మారు శ్రద్ధగా వింటాను. మీరు ఎంతో బాగుంటాయి అంటూన్నారుగా! ఇప్పటి దాకా నేను అతిగా ఇష్టపడినవి భావగీతాలే" అన్నాడు గోపాల్.

'నాకో స్నేహితుడు దొరికాడు, భావగీతాలంటే ఇష్టపడడానికి' అనుకుంది చారుమతి.

ఎండ తగ్గు ముఖం పట్టి, సాయంకాలం పడుతూ ఉండటం గమనించి అందరూ లేచారు.

"అయ్యో, అప్పుడే లేస్తున్నారేమిటి? ఒక్క సినిమా పాట పాడు బావా! " అంది భగవతి గోపాల్ ని చూస్తూ.

అందరూ నవ్వారు. "నీ సినిమా పాట బాకీ ఉండిపోయిందదా?" అంది శాంతమ్మ.

"నాకు రావు భగవతీ. నీ కోసం నేర్చుకుంటాలే" అన్నాడు గోపాల్.

జడల నిండా మల్లె దండలతో, ఖాళీ అయిన కారియర్ లతో తిరుగు ముఖం పట్టారు.

"పిక్నిక్ చాలా సరదాగా గడిచింది" అంది భానుమతి.

"అవును, చాలా బాగుంది" అన్నారు తక్కిన అందరూ.

"శంకరం కూడా ఉంటే బాగుండును" అంది శాంతమ్మ.

కొడుకు దగ్గిర లేక పోవడం ఆవిడకి ఎప్పుడూ లోటుగానే ఉంటుంది.

## 30

జూన్ నెల వచ్చింది. స్కూళ్ళు తెరిచారు. మాలతికి కూడా టైపిస్టు ఉద్యోగం దొరికింది. శంకరం వంద రూపాయలు పంపాడు. చారుమతి మనస్సుకి ఉల్లాసంగా ఉంది. ఇన్నాళ్ళూ మోసిన కుటుంబ భారం దించుకున్నట్టు అయింది.

స్కూలు తెరిచిన రోజు చారుమతి ఉదయం స్కూలుకి వెళ్లి రాత్రి ఆలస్యంగా ఎనిమిది గంటలకి ఇంటికే చేరింది. అందరి భోజనాలు అయిపోయినా, శాంతమ్మ వంటింట్లో కూతురి కోసం కాచుకుని ఉంది.

"నువ్వు భోజనం చేసెయ్యలేకపోయావా అమ్మా! నా కోసం ఎందుకు కూర్చున్నావు? " అంది చారుమతి వంటింట్లోకి వస్తూ.

"అంత తొందరగా భోజనం చేసి నేను పడే పాటు ఏముంది?... అవును, ఈ రోజు ఇంత ఆలస్యం అయిందేం?" అంది శాంతమ్మ.

"పద్మ వచ్చిందమ్మా. వాళ్ళ ఇంటికి వెళ్లాను."

"ఎప్పుడూ?"

"నెల్లాళ్ళ పైన అయిందిట. మనం సర్పవరం వెళ్ళిన రోజు పద్మా వాళ్ళ నాన్నగారు మన ఇంటికి వచ్చి, ఇల్లు తాళం వేసి ఉండటం చూసి వెళ్లి పోయారట. మళ్ళీ యీ రోజు స్కూలుకి వచ్చి చెప్పారు."

"ఎలా ఉంది పద్మ? నెల తప్పిందా?" శాంతమ్మ అడిగింది.

"పద్మ చాలా పాడై పోయిందమ్మా. సన్నగా డొక్కులా అయిపోయింది. మనిషి కూడా చాలా మారి పోయింది. ఏమిటో ముభావంగా తయారైంది. ఏం మాట్లాడదు. ఏం అడిగినా 'ఉ, ఊహుం' అంటూ సమాధానాలు చెబుతుంది. పద్మ నాన్నగారూ, అమ్మగారూ కూడా ఎందుకనో విచారంగా, దిగులుగా వున్నారు. నాకు పద్మని చూస్తే చాలా ఏడుపు వచ్చింది."

పద్మ అలా ఎందుకు ఉందో శాంతమ్మకీ అంతు పట్టలేదు.

"అత్తగారు మంచిది కాదేమో. కోడంత్రికం పెట్టిందేమో" అంది చివరికి.

భోజనాలు అయ్యాయి. ఒక కంచంలో కొంచెం కూర, పచ్చడి, అన్నం, చిన్న గిన్నెతో మజ్జిగ ఎత్తి పెట్టింది శాంతమ్మ.

"ఎవరికమ్మా భోజనం ఎత్తి పెట్టావు?" అంది చారుమతి.

"భగవతి సినిమాకి వెళ్ళింది. వచ్చి తింటుందని!"

చారుమతి ఆ మాట వినగానే కోపం వచ్చింది.

"ఎన్ని సార్లు చెప్పానమ్మా సీతతో సినిమాలకి పంపవద్దని! మూడు రోజులకి ఒక సినిమా చూడకపోతే ఈవిడ బ్రతక లేదా?" అంది.

"ఏం చెయ్యనే! ఇంట్లో కూర్చుంటే దానికి తోచదు. సినిమాకి పంపేదాకా నా ప్రాణాలు తోడేస్తుంది" అంది శాంతమ్మ.

"దీని వరస  నాకేం నచ్చలేదు" అంటూ చారుమతి ముందరి గదిలోకి వచ్చింది.

రోజంతా పని చేసి వచ్చిన మాలతి అలసటగా పడుకుని ఉంది. భాను ముందరి గదిలో భర్తతో మాట్లాడుతుంది. చల్లగాలి కోసం బయట వరండాలో చాప వేసుకుని మేను వాల్చింది చారుమతి.

భగవతి ఆలోచనలే తిరుగుతున్నాయి. భగవతికి, సీతకి సినిమాల పిచ్చి ఎక్కువ. వచ్చిన ప్రతి కొత్త సినిమాకీ వెళ్ళ వలసిందే. కొత్తవి లేకపోతే, చూసిన పాత సినిమాయే మళ్ళీ చూస్తారు. లేదా ఒక సినిమాను బాగుందనో, పాటలు నేర్చుకోవాలనో మూడు నాలుగు సారు చూస్తారు. "ఎందుకే అలా సినిమాలు చూస్తావు?" అని అడిగితే, "మనం డబ్బు పెట్టుకోనవసరం లేదుగా. సీత డబ్బు పెడుతుంది" అంటుంది. ఆ మాట విని చారుమతి ఒకసారి గట్టిగా అంది. "అలా ఇంకోళ్ళ డబ్బు మీద సినిమాలు చూడటానికి సిగ్గు లేదూ?" అని.

"నాకేం సిగ్గు లేదు. సినిమాలంటే నాకిష్టం" అంది భగవతి.

'ఛీ! ఏం మనిషి!' అని చారుమతి లోపలే ఛీత్కారం చేసుకుంది.

సినిమాల మీద నించి దృష్టి చదువు మీద మళ్ళిద్దామని ఇంట్లో  అంతా ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి.

"చదువంటే నాకు ఇష్టం లేదు. నేను పెళ్లి చేసుకుంటాను" అని జవాబు చెప్పింది భగవతి.

'దీన్ని బాగు చెయ్యడ మెలాగో?' అనుకుంది చారుమతి.

భగవతి మీది నించి ఆలోచనలు పద్మ మీదికి మళ్ళాయి. పద్మ అలా ఎందుకైందో? 'మద్రాసుకు ఎప్పుడు వెళతావు?' అంటే సరిగ్గా సమాధానం చెప్పలేదు. పరిస్థితి చూస్తే ఇప్పట్లో మద్రాసు వెళ్లేటట్టు లేదు. ఎందుకు వచ్చేసినట్టు? అక్కడ ఏమైనా గొడవలు జరిగాయా? పద్మ ఎంతో మంచిది. అమాయకురాలు. ఎదటి మనిషిని పల్లెత్తు మాట అనదు. అలాంటి పద్మతో విరోధం ఎవరు వహించ గలరు?

భానుమతి పద్మ దగ్గిరగా కూర్చుని ఎంత ఆప్యాయంగా అడిగినా పద్మ తన కాపరం గురించి ఒక్క మాటా చెప్పలేదు.

'శ్రీదేవికి పద్మ గురించి రాస్తాను. శ్రీదేవికి కూడా పెళ్లి అయింది కనక దాంతో ఏమైనా చెబుతుందేమో' అనుకుంది చారుమతి.

మరునాడు ఉదయమే కూర్చుని, పద్మ పరిస్థితి గురించి విపులమైన ఉత్తరం శ్రీదేవికి రాసి, హైదరాబాద్ కి పోస్టు చేసింది చారుమతి.

శ్రావణమాసం, నల్లటి మబ్బులు ముసురుకుని, ఉంది ఉంది వర్షం పడుతూంది. ఈ వర్షాలకి, బురదకి లెక్క చేయకుండా అలాగే, నీళ్ళలో తడుస్తూనే శ్రావణ మంగళ వారం వాయినాలకి వెళుతున్నారు ముత్తయిదువులు.

భానుమతి పెళ్లి అయిన మొదటి సంవత్సరం. అయినా అత్తగారు చనిపోయి ఇంకా ఏడాది కాలేదని శాంతమ్మ కూతురి చేత లక్ష్మీ పూజ చేయించ లేదు. ఆ రోజు ఉదయమే స్నానం చేసి సత్యనారాయణ స్వామి గుడికి వెళ్లి, కొబ్బరికాయ కొట్టి వచ్చింది భానుమతి.

నోములు నోచుకుంటున్న కొత్త పెళ్లి కూతుళ్ళను చూడగానే చారుమతి మనస్సు ఎక్కడికో తేలిపోతూంది. ఎప్పటికైనా తను కూడా భర్త సౌఖ్యం కోరుతూ అలా నోము నోచుకుంటుందా? చారుమతి మనసులో పెళ్ళితో ముడిపడే వ్యక్తి డాక్టర్ గిరిధారి. ఆమెకు నచ్చిన యువకుడు, పరిచయమైన వాడు అతను ఒక్కడే. ఆమె భవిష్యత్తును గురించిన కలలన్నీ అతని చుట్టూ తిరుగుతాయి. చారుమతి డాక్టర్ గిరిదారిని చూసి మూడేళ్ళు అవుతూంది. అతనితో తన పరిణయం అసాధ్యమని తెలుసు. కాని ప్రతి వ్యక్తి కలలకీ ఒక ఆలంబన కావాలి. గడ్డి పోచ అంత ఆశ వున్నా, ఆలంబన దొరికినా దానిమీద హర్మ్యాలు నిర్మిస్తాడు వ్యక్తి. గట్టి పునాదులు లేని ఆ హర్మ్యాలు ఒక రోజు కూలిపోతాయి. నిర్మించిన వ్యక్తి నిరాశతో కుంగి పోతాడు.

అదే జరిగింది చారుమతికి.

ఒక రోజు ఉదయమే ప్లీడరుగారి నౌకరు నూకరాజు పసుపు రాసిన శుభలేఖ తీసుకుని వచ్చాడు.

"చిన్నబ్బాయిగారికి పెళ్ళమ్మా. అయ్యగారు మీకీ శుభలేఖ ఇచ్చి రమ్మన్నారు" అన్నాడు.

భర్త చనిపోయిన నాలుగేళ్ల తరువాత కూడా ప్లీడరుగారు తమని జ్ఞాపకం పెట్టుకుని, కొడుకు శుభలేఖ పంపినందుకు శాంతమ్మ పొంగి పోయింది.

"అలాగా నూకరాజూ! అమ్మాయిది ఏ ఊరు?" అంది.

"రాజమండ్రి అమ్మా."

"బాగా కట్నాలు, కానుకలు ఉన్నాయా?"

"కలిగిన మారాజులు. నేకేమమ్మా! పన్నెండేలకి పై మాటే అని ఇనుకోడం."

"బాగుంది. ఉన్నవాళ్ళు ఇచ్చుకోకపోతే మాలాంటి వాళ్ళం ఇచ్చుకోగలమా? అబ్బాయి డాక్టరు పాసయ్యాడు. బుద్ధిమంతుడు. అమ్మాయి సుఖ పడుతుంది" అంది శాంతమ్మ.

"చిన్నబ్బాయి గారు రత్నం లాటి వారమ్మా. ఆరిది మా గొప్ప గుణం" అంటూ పొగిడాడు నూకరాజు. తరువాత శాంతమ్మ దగ్గిర సెలవు తీసుకుని వెళ్ళాడు.

చారుమతి తల్లి ఇచ్చిన శుభలేఖ అందుకుని చూసింది. 'అమ్మాయి పేరు రాధ. తండ్రి అడ్వకేటు. గిరిధారి-రాధ బాగుంది. పేర్లు కలిశాయి. వియ్యంకులిద్దరూ ప్లీడర్లే. సమ ఉజ్జీ. నేనెక్కడ, అతనెక్కడ? ఆకాశం మీద ఉండే చందమామ కోసం నేల మీది నించి చేతులు చాచాను' అనుకుంది చారుమతి.

మనసుకి ఎంత వేదాంతం చెప్పినా, ఒక పట్టాన స్థిమితం కుదరలేదు. స్కూలులో పాఠాలు చెప్పలేక పోయింది. శాంతంగా ఒక చోట కూర్చో లేకపోయింది.

సాయంత్రం ఇంటికి వస్తూనే చెల్లెలిని చూసి, "మాలతీ! సినిమాకి వెళదాం వస్తావా?" అంది.

స్కూలు ఉన్న రోజుల్లో సినిమాలకు వెళ్ళడం సాధారణంగా అలవాటు లేదు చారుమతికి. ఈ రోజు అక్క అలా అడిగేసరికి ఆశ్చర్యపోయింది మాలతి.

"వస్తాను, దేనికి వెళదాం?" అంది మాలతి.

"ఏదో ఒకటి" అంటూ ముఖం కడుక్కోవడానికి స్నానాల గది వైపు వెళ్ళి పోయింది చారుమతి.

అక్కచెల్లెళ్ళిద్దరూ సినిమాకి వెళతారని తెలిసి, గబగబా ఉప్మా చేసింది శాంతమ్మ. ఉప్మా తిని, కాఫీ తాగుతూ చారుమతి అడిగింది. "భగవతి ఏదమ్మా? మేం సినిమాకి వెళ్లామని తెలిస్తే అది మళ్ళీ అలిగి కూర్చుంటుంది."

"అది సీతా వాళ్ళింటికి *వెళ్ళింది*. మీరిద్దరూ వెళ్ళి రండి. భగవతికి ఊళ్ళో ఉన్న సినిమాలన్నీ చూసినవే" అంది శాంతమ్మ.

తల్లి మాట మీద భగవతిని వదిలి చారుమతీ, మాలతీ సినిమాకి బయలు దేరారు.

"అభిమానం సినిమాకి వెళదామా? సావిత్రి ఉంది" అంది మాలతి దారిలో.

సినిమా చూస్తూ చారుమతి తన నిరాశాలని కొంచెం మరిచి పోగలిగింది. ఇంటర్వెల్ లో లైట్లు వెలిగాయి చుట్టూ పక్కల చూస్తున్న మాలతి ఒక్కసారి అక్కని మోచేత్తో పొడిచి, "వెనక ఎవరున్నారో చూడు" అంది.

చారుమతి వెనక్కి తిరిగి చూసి తన కళ్ళని తనే నమ్మలేక పోయింది. పై అంతస్థు మెత్తని పరుపు కుర్చీలలో భగవతి ఒక అపరిచితుడి పక్కన కూర్చుని ఉంది. అతనితో ఏదో చెప్పి పగలబడి నవ్వుతూంది. అతను చిలిపితనంగా భగవతి భుజం మీద చిన్నగా తట్టి నవ్వుతున్నాడు.

చారుమతీ, మాలతీ సిగ్గుతో కుంగి పోయారు. తరువాత సినిమా ఎలా చూసారో వాళ్ళకే తెలియదు.

రిక్షా మీద ఇంటికి రాగానే, కూతుళ్ళ కోసం ఎదురు చూస్తున్న శాంతతో, "అమ్మా! నువ్వు పడుకో. మేం వడ్డించుకు తింటాం" అని చెప్పి తల్లిని బలవంతం మీద పడుకునేటట్టు చేసింది చారుమతి. తల్లి లోపలి వెళ్ళిపోయాక, "మాలతీ! నువ్వు వడ్డించుకు తిని. నేను భగవతి వచ్చాక తింటాను" అంది.

అరగంట గడిచాక భగవతి వచ్చింది. చీర మార్చుకుని వంటింట్లోకి అడుగు పెట్టబోతున్న చెల్లెలిని చూసి, "ఇలా రా భగవతి!" అంటూ డాబా మీదికి దారి తీసింది చారుమతి.

"ఎందుకూ?" అంటూ వెనకే వెళ్ళింది చెల్లెలు.

"ఎక్కడికి వెళ్లావు?" చారుమతి మెల్లిగా అడిగింది.

"సినిమాకి."

"ఎవరితో?"

"సీతా, నేనూ వెళ్ళాం."

"సీతతో వెళ్ళావా? ఇంకెవరైనా వచ్చారా?"

"ఇంకా ఎవరూ రాలేదు." భగవతి మాట పూర్తి చెయ్యకుండానే కోపంతో చారుమతి చెయ్యి చాచి రెండు చెంపల మీద కొట్టింది. ఆగకుండా కొడుతున్న అక్కని చూసి బిత్తరపోయి, రోషంగా ఏడుస్తూ, "ఎందుకు కొడతావు?" అంది భగవతి.

"ఎందుకా? వెధవ పనులు చేస్తున్నందుకు. అడ్డమైన వాళ్ళతోనూ సినిమాలకి వెళ్ళుతున్నందుకు . నీ మీద ప్రతి మగవాడినీ చెయ్యి వెయ్యనిస్తున్నందుకు. ఇంకా చెప్పాలా?" చారుమతి కళ్ళలో కూడా నెలలు తిరిగాయి.

"అడ్డమైన వాళ్లతోను నేను వెళ్ళలేదు. అతను సీతావాళ్ళ అన్నయ్య."

"సీతావాళ్ళ అన్నయ్యకు నీకు ఏం సంబంధం? అతనితో సినిమాకి వెళ్ళవలిసిన అవసరం ఏమిటి నీకు?"

"అతనితో వెళ్ళితే తప్పేమిటి? మీరు నన్ను సినిమాలకి తీసుకు వెళ్లరు. మీకే కోరికలు ఉండవు. మంచిబట్టలు కావాలని, సినిమాలు చూడాలని, దూర దూర దేశాలు వెళ్లాలని... ఏ ఒక్క కోరికా లేదు మీకు. మీరు మామూలు మనుషులు కారు, సన్యాసులు" అంది భగవతి.

"అవునే, మాకు కోరికలు లేవు. మేం మనుష్యులం కాదు. కోరికలు తీరనప్పుడు, తీర్చుకునే స్తోమత లేనప్పుడు కోరికలు పెంచుకునే అర్హత లేదు. నువ్వు అలాంటి కోరికలు పెంచుకోవడం అవివేకం. చివరికి జీవితంలో దెబ్బ తిని కుమిలిపోతావు!" అంది చారుమతి.

'చిన్నపిల్ల అయిన భగవతిని సరిదిద్దాలి! చెడ్డ ప్రభావానికి లోనైన చెల్లెలిని పెడతోవ పట్టకుండా చూడాలి. ప్రతి మగవాడినీ నమ్మకూడదని చెప్పాలి." చారుమతి తహతహలాడింది.

"భగవతీ! ఇక్కడ కూర్చో. నీతో నేను సావకాశంగా మాట్లాడాలి" అని చెల్లెలిని కూర్చోపెట్టింది. అందరు మగవాళ్ళని ఎందుకు నమ్మకూడదో, ఆడది దగ్గిరిగా వెళితే ఏ ప్రమాదం సంభవిస్తుందో, శీలం పోయిన ఆడదాని బ్రతుకు సంఘంలో ఎలా ఉంటుందో అన్ని చెప్పింది. అమాయికంగా నమ్మిన రాధాకృష్ణ తనని రైల్లో ఏం చేయ్యబోయాడో వివరించి చెప్పింది.

భగవతి అన్ని విని మౌనంగా కూర్చుంది. చెల్లెలికి తను చెప్పినవి ఎంతవరకు తలకెక్కాయో అని చూస్తూ కూర్చుంది చారుమతి.

"నాకీ జీవితం జీవితం నచ్చదక్కా! ఎన్నాళ్ళు ఈ బ్రతుకు? లోకంలో ఎన్నో అందమైన సుఖాలు ఉన్నాయి. కాని మనకి ఇష్టమైన బట్ట కొనుక్కోడానికి, పుష్టిగా తినడానికి కూడా కరువే. నేను ఈ జీవితంతో సరి పెట్టుకోలేకుండా ఉన్నాను. ముందేమైనా ఆశ ఉందా అంటే అదీలేదు. నాకు మీరు పెళ్లి చెయ్యగలరనే ఆశ లేదు. నీకు, మాలతక్కకి పెళ్ళిళ్ళు కావాలి. పోనీ, పెళ్లి చేసినా మన అంతస్తులో ఉన్న గుమాస్తాకో, మాస్టారికో ఇచ్చి చేస్తారు. చాలీచాలని జీతము, తీరని కోరికలు ప్రతిదానికీ కరువు! అందని వాటికోసం ఆశపడుతూ జీవించడం! ఇదేకదూ?"

ఇలాంటి మాటలు చెప్పగలిగే చెల్లెలు ఇంకా చిన్నపిల్ల అని అనుకోవడం తన తెలివితక్కువ అనుకుంది చారుమతి.

ప్రతి సుఖాన్ని డబ్బు దృష్టితో చూసే చెల్లెలికి జవాబు చెప్పలేకపోయింది చారుమతి. చెల్లెలి మాటలన్నీ నిజమే! తనకి, చెల్లెలికి ఒకటే తేడా. తను మనస్సులో అనుకుంటుంది. భగవతి పైకి అంటుంది. ఇద్దరి ఆశలు, కోరికలు ఒకేరకమైనవి. ఎటొచ్చీ తను ఎక్కడికక్కడ విధికి లొంగిపోతూ, జీవితంతో రాజీపడుతూ సమాధానానికి వస్తుంది. భగవతి జీవితానికి ఎదురు నిలిచి పోరాడాలని చూస్తుంది.

పైన మేఘాలు కమ్ముతున్నాయి. వర్షం వచ్చేటట్లు ఉంది.

"భగవతీ! నా మీద నీకు విశ్వాసంగాని, ప్రేమగాని ఉందా?" అంది చారుమతి.

"అలా ఎందుకు అడుగుతావు అక్కా? నువ్వంటే ఎంతో ఇష్టం నాకు" అంది భగవతి.

"నీకు మంచి సంబంధం తెచ్చి పెళ్లి చేస్తాం భగవతీ. నువ్వు మాత్రం డబ్బు తెచ్చే సుఖాల కోసం మన కుటుంబానికి అప్రతిష్ట తెచ్చే పనులు చెయ్యకు. చిన్న చెల్లెలివైన నీ సుఖమే మాకు కావలిసింది. మా శాయశక్తులా ప్రయత్నిస్తాం. నువ్వీ రోజు నించీ సీత ఇంటికి వెళ్లనని మాట ఇవ్వు" అంది చారుమతి, చెల్లెలి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"నేనేం చెడ్డ పనులు చెయ్యనక్కా. చెయ్యలేదు ఇప్పటిదాకా. సీత నా స్నేహితురాలు. వాళ్ళ ఇంటికి వెళ్ళకపోతే నాకు తోచదు" అంది భగవతి.

భగవతి ఇంకా మూర్ఖంగా మాట్లాడటం చూసి విసుక్కుంది చారుమతి. పైన సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. వెంటనే దాబా దిగకపోతే ఇద్దరూ తడిసి పోతారు.

"నువ్వు నా మాట వినాలి భగవతీ. నువ్వు సీత ఇంటికి వెళ్ళడానికి వీల్లేదు" అంటూ చెల్లి చెయ్యి పట్టుకుని గబగబా దాబా దిగింది చారుమతి.

అందరూ ఉద్యోగస్తులయ్యారు. డబ్బు ఇబ్బందులు తగ్గాయి. కుటుంబ భారం తన తలమీదనించి దిగింది  అని మూడు నెలల క్రిందటే సంతోషించింది చారుమతి. ఇప్పుడు భగవతి పెళ్లి అనే పెద్ద బరువు, రెట్టింపుది తలమీద పడింది.

ఆ నెలనించి తన జీతం అంతా బాంకులో వేయసాగింది చారుమతి. శంకరానికి ఉత్తరం రాసింది, పెళ్లిళ్లకు కావాలి డబ్బు దాచమంటూ.

శాంతమ్మ మళ్ళీ వంటకి, కూరలకి తడుములాడుకుంది. "డబ్బు కటకట అయిపోయిందమ్మా" అంటూ వంటింట్లో సణుగుకుంటున్న తల్లిని చూసి చారుమతి విసురుగా అంది.

"కూతుళ్ళకి ఇంకా పెళ్లి చెయ్యవా అమ్మా? తెచ్చుకున్నదంతా ఖర్చు చేసుకుంటే పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి? అందరూ భానక్క అంత అదృష్ట వంతులు ఉంటారా? కానీ ఖర్చు లేకుండా బావగారు వచ్చారు."

దానితో శాంతమ్మ నోరు కట్టుబడిపోయింది

చారుమతి ఒక రోజు భానుమతి ఒంటరిగా ఉండడం చూసి భగవతి పెళ్లి విషయం కదిపింది.

"అమ్మతో చెబితే లాభం లేదక్కా. నీకు, మాలతికి పెళ్లి కానిదే చిన్నదానికి భగవతి పెళ్ళేమిటని అంటుంది. అందుకనే నీతో చెబుతున్నాను. భగవతికి మంచి సంబంధం చూసి తొందరలో మనం పెళ్లి చేసెయ్యాలి."

"నీ కష్టం, సంపాదనా అంతా మన కుటుంబానికే ధారపోసేస్తున్నావ్, చారూ" అంది భానుమతి చెల్లెలిని ప్రేమతోనూ, తపనతోనూ చూస్తూ.

"నేనేం చేశానక్కా! దానికేం గాని, ముందు పెళ్లి విషయం చెప్పు. సంబంధం ఎలా చూడడం?"

"శారదత్తయ్య కొడుకు గోపాల్ కి భగవతిని అడిగితే ఎలా ఉంటుంది? భగవతికి కూడా అతనంటే ఇష్టమే అనుకుంటాను. నువ్వు సీతా వాళ్ళ ఇంటికి వెళ్ళవద్దన్నదగ్గిరినించీ అది రోజూ శారదత్త ఇంట్లోనే గడుపుతూంది. గోపాల్ ని 'బావా.. బావా' అని పిలుస్తూకూడా కూడా తిరుగుతూంది."

"కాని భగవతికి గోపాల్ ని చేసుకోడం ఇష్టం ఉండదేమో! దానికన్నీ పెద్ద ఆశలు" అంది చారుమతి.

"గోపాల్ మంచివాడు. అతనితో భగవతి తప్పక సుఖ పడుతుంది అంది భానుమతి.

"నిజమే. గోపాల్ కి అయితే మనం కట్నం ఇవ్వాలన్న బాధ ఉండదు. నువ్వు వెళ్లి శారదత్తయ్యతో మాట్లాడి వస్తావా?' అంది చారుమతి.

భానుమతి సరే అంది.

మరునాడు ఉదయం శారదమ్మ ఇంటికి బయలు దేరబోతున్న భగవతిని ఇంటి దగ్గిర తల్లికి సాయంగా ఉండమని చెప్పి, భానుమతి బయలుదేరింది.

బియ్యం బాగు చేస్తున్న శారదమ్మ భానుమతిని చూస్తూనే, "రా రా భానూ" అంటూ ఆప్యాయంగా లోపలి తీసుకువెళ్ళి కూర్చోపెట్టింది. ఒక పెద్ద ఇంట్లో రెండు గదులు అద్దెకు తీసుకున్నాడు గోపాల్. ఇంటి ముందర చిన్న వరండా ఉంది. ముందు గదిలో ఒక టేబిల్, ఒక కుర్చీ, ఒక మంచం, రెండు ట్రంకు పెట్టెలు ఉన్నాయి. అల్మైరాలో పుస్తకాలు, బట్టలు చక్కగా సర్ది పెట్టి ఉన్నాయి.

రెండో గది వంటిల్లు. వంటగిన్నెలు, పప్పుల డబ్బాలు, సీసాలు అన్నీ శుభ్రంగా పెట్టుకుంది శారదమ్మ.

అత్త పక్కనే తనూ బియ్యం ఏరుతూ కూర్చుంది భానుమతి.

"నువ్విక్కడ ఎందుకమ్మా? ఆ మంచం మీద కూర్చో. నేను ఏరేస్తాను" అంది శారదమ్మ. అయినా భానుమతి అక్కడినించి లేవలేదు. ఆ మాట ఈ మాట చెప్పుకుంటూ ఇట్టే ఏరేశారు బియ్యం.

"కాఫీ పెట్టి ఇస్తానుండు" అంటూ శారదమ్మ వంటింట్లోకి వెళ్లి, కుంపట్లో బొగ్గులు వేసి నిప్పు రాజేసింది.

"అత్తా! నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చాను" అంది భానుమతి, పీట వాల్చుకుని శారదమ్మకి ఎదురుగా కూర్చుంటూ.

'ఏమిటీ?' అన్నట్లు తల ఎత్తి కుతూహలంగా చూసింది శారదమ్మ.

"మా చెల్లెళ్ళ పెళ్లి విషయం మాట్లాడదామని వచ్చాను. ముగ్గురు పెళ్ళికి ఎదిగి ఉన్నారు. చారు పెద్దదనుకో. కాని మాలతీ, భగవతీ గోపాల్ కి ఈడు అవుతారు. ఒకరిని నీ కోడలిగా చేసుకుంటే మాకు చాలా సంతోషం" అంది భానుమతి మెల్లిగా.

"ఈ మాట చెప్పడానికి ఇంత పస్తాయిస్తావేమిటే? మీ నాన్న సహాయం చేసి ఉండకపోతే బాబు చదువుకుని ఇంత పైకి వచ్చేవాడా? మేం ఈ మాత్రంగా ఉండటానికి కారణం మీ నాన్న చలవ, తరవాత చారుమతి చలవ. చిన్నపిల్లయినా చారుది గొప్పబుద్ది" అంది శారదమ్మపచ్చి మిరపకాయలు, అల్లం తరుగుతూ.

"అవన్నీ ఇప్పుడెందుకు అత్తా? ఏం చేస్తున్నావ్?" అంటూ భానుమతి అత్త చేతిలోంచి కత్తిపీట లాక్కోబోయింది. కాని శారదమ్మ నవ్వుతూ బలవంతంగా కత్తిపీట తీసుకుంది.

భానుమతి ఎదురుగానే రవ్వతో ఉప్మా చేసి, ప్లేటు నిండా ముందు పెట్టింది.

"నేను ఎలాగా ఒక పిల్లని మా బాబుకి చేసుకోవాలని ముందర నించి అనుకుంటున్నాను. తెలిసిన పిల్లని చేసుకుంటే, ఏ ఇబ్బందీ ఉండదు. ఒకటే ఆలోచిస్తున్నాను. బాబు ఇంకా చిన్నవాడు. వయస్సు తక్కువ" అంది శారదమ్మ కాఫీకి నీళ్ళు పెడుతూ.

"వయస్సుకేమి ఉంది అత్తా! పోనీ, ముందర నిశ్చయం చేసుకుంటే రెండేళ్ళు పోయాక పెళ్ళి చెయ్యవచ్చును" అంది భానుమతి, అత్త ఇంత తొందరగా అంగీకారం తెలిపినందుకు సంతోషిస్తూ.

"అలాగే నిర్ణయం చేసుకుందాం. నాకు మాలతిని చేసుకోవాలని ఉంది. బాబుకి కూడా మాలతి అంటే ఇష్టం అనుకుంటాను."

శారదమ్మ మాటలు వింటూనే తెల్లబోయింది భానుమతి. భగవతి కోసం రావటమేమిటి? మాలతికి సంబంధం కుదరడమేమిటి? భానుమతికి ఏం మాట్లాడాలో తెలియలేదు."

"నీ ఇష్టం అత్తా. ఏ పిల్ల నచ్చితే దాన్నే చేసుకోండి" అని చెప్పి, కాఫీ తాగి, కాస్సేపు కూర్చుని ఇంటి ముఖం పట్టంది.

సాయంత్రం చారుమతి రాగానే డాబా పైకి తీసుకు వెళ్లి అన్ని విషయాలు చెప్పింది భానుమతి. చారుమతి కూడా ఆశ్చర్య పోయింది.

"ఇప్పుడు ఏం చెయ్యడం?" అంది భానుమతి.

"నువ్వు భగవతిని చేసుకోమని అడిగి ఉండవలసింది" అంది చెల్లెలు.

ఇద్దరూ ఆ విషయమే ఆలోచిస్తూ కూర్చున్నారు. చివరికి చారుమతే అది. "ముందు నేను భగవతిని అడుగుతాను. 'గోపాల్ ని చేసుకోవడం ఇష్టమేనా?' అని. దానికి ఇష్టమైతే, మళ్ళీ నేను వెళ్లి అత్తను అడుగుతాను."

భానుమతి అంగీకారం తెలిపింది.

సంధ్య పడుతూ ఉండగా భగవతిని తీసుకొని వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్ళింది చారుమతి. ఆ ఆలయం కూడా వీళ్ళ ఇంటి నించి ఎక్కువ దూరంలో లేదు. నడిచి వెళ్లి పోవచ్చును.

"నీకు గోపాల్ ని పెళ్లి చేసుకోవడం ఇష్టమేనా?" చారుమతి సూటిగా సంభాషణ ప్రారంభించింది.

భగవతి ఆశ్చర్య పోయింది.

"ఇప్పుడు ఎందుకిలా అడుగుతున్నావ్?" అంది.

"ఏమీ లేదు. నీ అభిప్రాయం తెలుసుకుందామని" అంది చారుమతి.

"ఏం! బావ నన్ను చేసుకుంటానన్నాడా?" భగవతి తిరిగి అక్కని ప్రశ్నించింది.

"నేను అడిగేది నీ అభిప్రాయం."

"నా అభిప్రాయం ముందే చెప్పాను కాదక్కా! నాకు ఇష్టం లేదు."

"గోపాల్ అంటే ఇష్టం లేదా?"

"బావ అంటే ఇష్టమే. కాని మళ్ళీ చిన్న జీతగాన్ని చేసుకుని జీవితాంతం బాధపడటం ఇష్టం లేదు."

"కాని గోపాల్ మంచివాడు. నిన్ను బాగా చూసుకుంటాడు."

"డబ్బునంతలోఇంకో వ్యక్తి నన్ను బాగా చూసుకోదని ఎక్కడ ఉంది? డబ్బు లేని వాళ్ళంతా మంచి వాళ్ళు, ఉన్నవాళ్ళంతా చెడ్డవాళ్ళు కారు" అంది భగవతి.

చెల్లెలి వాదానికి జవాబు చెప్పలేకపోయింది చారుమతి. మంచో, చెడో తన అభిప్రాయాలని పైకి చెప్పడానికి వెనక తీయదు భగవతి.

తరువాత అక్కచెల్లెళ్లిద్దరూ ఏం మాట్లాడుకోలేదు. మౌనంగా వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరిగి వచ్చారు.

మరునాడు చారుమతి మాలతిని పిలిచి అడిగింది, పెళ్లిని గురించి ఆమె అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని.

"గోపాల్ నిన్ను పెళ్లి చేసుకోడానికి ఇష్టం చూపుతున్నాడు. శారదత్తయ్య నిన్ను కోడలిగా చేసుకుంటానంది. నీ అభిప్రాయం ఏమిటి?"

అక్క ఇలా సూటిగా, హఠాత్తుగా తన పెళ్లి విషయం చెప్పే సరికి మాలతి సిగ్గు పడింది. తికమకపడింది.

"నా ఇష్టానికేం అక్కా! భగవతికి అతనంటే చాలా ఇష్టం. కూడా కూడా తిరుగుతుంది. భగవతికి అతనితో పెళ్లి చేస్తే బాగుంటుందేమో!" అంది మాలతి.

"కాని భగవతి గోపాల్ ని చేసుకోడానికి ఇష్టపడదు."

"నువ్వు అడిగావా?" అంది మాలతి ఆశ్చర్యపోతూ.

"ఆ .. అడిగాను."

"అయితే అతన్ని చేసుకోడానికి నాకేం అభ్యంతరం లేదు. ఒక్కటే సవరణ. నీ పెళ్లి తరువాతే నా పెళ్లి" అంది మాలతి.

"నా పెళ్లి దాకా ఆగడమెందుకు? నాకోసం ఆగేవంటే పెళ్లి కాకుండానే ముసలిదానివై పోయే భయం ఉంది. ఎవరికి కుదిరితే వాళ్ళు పెళ్లి చేసేసుకోవడమే మంచిది" అంది చారుమతి, మాలతి భుజం మీద ప్రేమగా చెయ్యి వేసి.

"అయితే నేను పెళ్ళే చేసుకోను" అంది మాలతి బింకంగా.

"అలా అంటే ఎలా, మాలతీ?" అంది చారుమతి నవ్వుతూ.

"అది అంతే! ముందు అక్క పెళ్లి, తరవాత చెల్లెలు పెళ్లి" అంది మాలతి.

మాలతి నిశ్చయం తెలుసుకున్న భానుమతి చాలా సంతోషించింది.

తరువాత మాలతిని గోపాల్ పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడటం, శారదమ్మ అంగీకారం చూపడం అన్నీ చారుమతి తల్లితో చెప్పింది. కూతురికి ఇంత సులువుగా పెళ్లి సంబంధం కుదిరినందుకు, గోపాల్ వంటి సద్గుణవంతుడు అల్లుడవుతున్నందుకు సంతోషంతో పొంగి పోయింది శాంతమ్మ.

"పద్మా! అంటూ ఏడాది పిల్లవాణ్ణి చంకనెత్తుకుని ప్రవేశించిన శ్రీదేవిని చూసి ఆశ్చర్యపోయింది పద్మ.

"ఏమిటలా చూస్తున్నావు కొత్తదానిలా? నేనే, శ్రీదేవిని" అంటూ దగ్గిరికి వచ్చి, "ఇదిగోరా మీ అత్త" అంటూ పిల్లవాడిని పద్మ చేతికి అందించింది శ్రీదేవి. బొద్దుగా, ముద్దు వస్తూ ఉన్నాడు బాబు. వాడు పద్మని చూడగానే మధురంగా నవ్వాడు. పద్మ ప్రేమగా దగ్గిరికి తీసుకుని రెండు బుగ్గల మీద ముద్దులు పెట్టుకుంది.

అప్పుడే అక్కడికి వచ్చిన వరలక్ష్మి ఇన్నాళ్ళకి కూతురి పెదవుల మీద నవ్వు చూసి, ఒక్కసారి నిట్టూర్చింది.

"ఎప్పుడు వచ్చావమ్మా శ్రీదేవి? నిలుచునే ఉన్నావు, కూర్చో" అంటూ కుర్చీ చూపింది ఆవిడ.

"ఎక్కడండీ, పద్మ నన్ను మరిచి పోయినట్టుంది. లోపలి రమ్మనలేదు. కూర్చోమనలేదు" అంది సన్నగా నవ్వుతో, కుర్చీ మీద కూర్చుంటూ శ్రీదేవి.

"అదేమిటోనమ్మా, ఇలా స్తబ్దుగా తయారయింది. జడ వేసుకోడానికి, చీర మార్చుకోడానికి కూడా నేను పోరవలిసి వస్తూంది" అంది వరలక్ష్మి బాధ పడుతూ.

శ్రీదేవి కూడా ఆ మాటలు విని బాధపడింది.

"ఎప్పుడు వచ్చావు? మీ వారు వచ్చారా?" అంది వరలక్ష్మి ప్రసంగం మారుస్తూ.

"ఈ రోజు ఉదయమే వచ్చాను. సంక్రాంతి పండగ ఇంకా పదిరోజులు ఉంది కదా! మావారికి ఇన్నాళ్ళు సెలవు దొరకదు. పండగ ముందు రోజు వస్తారు."

పద్మ పిల్లవాణ్ణి ఆడిస్తూ, ఒకపక్క నుంచి వీళ్ళ మాటలు వింటూ కూర్చుంది.

"పిన్నిగారూ, రాత్రికి వంట చేసేసారా? అంది శ్రీదేవి.

"లేదమ్మా, ఇప్పుడే మొదలు పెడదాం అనుకుంటున్నాను."

"అయితే గుప్పెడు బియ్యం ఎక్కువ పొయ్యండి. నేను ఈ రాత్రి ఇక్కడే ఉండిపోతాను. బాబుకి పాలు సీసాలో తెచ్చాను. అవి వాడికి పట్టేస్తాను."

"బాబుకి పాలు నువ్వు ఇంటి దగ్గిరినించి తెచ్చుకోవాలిటమ్మా! ఆ మాత్రం మా ఇంట్లో తీసుకోకూడదా?" అంది నొచ్చుకుంటూ వరలక్ష్మి .

"మీ ఇంట్లో తీసుకోడానికి నాకేం అభ్యంతరం లేదు. తీరా రాత్రి ఇక్కడ పాలు దొరుకుతాయో లేదో అని తెచ్చాను. మీరు వేరే భావించకండి" అంది శ్రీదేవి సర్ది చెపుతూ.

వరలక్ష్మి  వంటింట్లోకి వెళుతూంటే, బయటనించి నారాయణరావుగారు వచ్చారు. శ్రీదేవి లేచి నమస్కరించింది. శ్రీదేవిని పలకరించి, పద్మ చేతిలో ఉన్న బాబుని తీసుకున్నారు నారాయణరావురారు. వాడు కొత్త మనిషిని చూస్తే నవ్వుతాడు. వాడి చిలిపినవ్వులు చూసి అందరూ తెగ సంబరపడతారు. బాబుని ఎత్తుకుని పైకి గాలిలోకి ఎగరేసి పట్టుకుంటూ, "మీ బాబు బాగున్నాడమ్మా. ఏం పేరు?" అన్నారు సంతోషంగా నారాయణరావుగారు.

"బాబు పేరు అమర్. మా వాడు బాగున్నాడని మీరొక్కరు మెచ్చుకున్నారండీ. అందరూ 'నల్లవాడు నల్లవాడు' అంటారు" అంది శ్రీదేవి.

"శరీరం రంగులో ఏముందమ్మా! మనసుకి ఉంది రంగు. ఎఱ్ఱగా ఉన్నాడు అబ్బాయని మోసపోయి మా పద్మని ఇస్తే మా అల్లుడు ఏం చేశాడు? బంగారం లాటి పిల్లను కర్కోటకుల చేతుల్లో పడేశాం. ఎలా అయిపోయిందో చూశావా?" ఆయన కళ్ళల్లో కోపం, వెంటనే దుఃఖం తొణికిసలాడుతున్నాయి.

తండ్రి, కూతురు పిల్లవాడితో ఆడుకుంటూ ఉంటే శ్రీదేవి వంటింట్లోకి వెళ్ళింది. "పిన్నిగారూ, కూర ఇవ్వండి నేను తరుగుతానూ" అంటూ.

"ఇంతోటి వంటకి నువ్వు సాయం కూడా ఎందుకమ్మా! వాకిట్లో పద్మ, నువ్వు కబుర్లు చెప్పుకోండి" అంది వరలక్ష్మి , బియ్యం గిన్నెలో పోసి కడుగుతూ.

"పద్మ బాబుతో ఆడుకుంటూంది. నేను మీ దగ్గిర కూర్చుందామని వచ్చాను" అంది శ్రీదేవి.

శ్రీదేవి తనతో మాట్లాడాలని వచ్చిందని గ్రహించింది వరలక్ష్మి . గిన్నెలో నీళ్ళు పోసి, బంగాళదుంపలు, కత్తిపీట ఇచ్చింది శ్రీదేవికి. బంగాళ దుంపలు చెక్కు తీసి, నీళ్ళలో కడిగి చిన్నచిన్న ముక్కలు తరుగుతూ కూర్చుంది శ్రీదేవి.

"పద్మ సంగతి ఏమిటి, పిన్నిగారూ? అంత ఆరోగ్యమైన మనిషి అలా పుల్లలా ఎలా అయిపోయింది? దేనికి బెంగ?" అంది శ్రీదేవి.

"బెంగ కాక ఏముందమ్మా, కాపరం అలా అయ్యాక? దాన్ని తల్చుకుని వాళ్ళ నాన్నగారు, నేను కూడా కుంగి పోతున్నాం" అంటూ వరలక్ష్మి  ఒకటొకటిగా కూతురి కాపరాన్ని గురించిన సంగతులన్ని చెప్పింది.

"బలవంతపెట్టి, బ్రతిమాలగా ఈ సంగతులన్నీ చెప్పిందమ్మా. ఈ రెండేళ్ళూ ఒక్క ముక్క రాయలేదు మాకు. అన్నీ తానే కడుపులో పెట్టుకుని కుమిలి పోయింది. ఎంత బాధపడిందో ఏమో. అది మద్రాసు పేరు చెపితే వణికి పోతుంది. ఇంక అక్కడికి వెళ్ళనంటూంది." వరలక్ష్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చెంగుతో తుడుచుకుంటూ కూర్చుంది ఆమె.

శ్రీదేవి మౌనంగా జాలి చూపడం తప్ప, ఏమీ చెయ్యలేకపోయింది. అటు అత్తగారుకాని, ఇటు భర్త కాని ఎవరో ఒకరు మంచివారైతే, పద్మ కావాలి అనుకుంటే, "వాళ్ళున్నారు, పద్మ కాపరానికి ఫరవాలేదు. కొన్నాళ్ళలో అన్నీ చక్కబడతాయి" అని చెప్పవచ్చు. కాని ఇద్దరిలోను ఎవరూ దయగలవారు కాకపోతే పద్మ కాపరానికి ఎలాంటి భరోసా ఉంది?

పద్మకి జరిగిన అన్యాయం తలుచుకున్న శ్రీదేవికి కోపం వచ్చింది.

వరలక్షి గారిని కూర్చోమని తనే కొబ్బరికాయ పచ్చడి చేసి, బంగాళాదుంపలు వేయించింది శ్రీదేవి. ఇన్నాళ్ళదాకా గుండెలలో బరువుగా ఉన్న కూతురి కథ ఈ రోజు ఈ అమ్మాయితో హృదయం విప్పి చెప్పుకోగానే వరలక్షి కి చాలా భారం తగ్గినట్లయింది.

బాబుకి పాలు పట్టి, పడుకోబెట్టి అందరు భోజనాలు చేసారు. భోజనాల దగ్గిర హైదరాబాద్ విశేషాలు, వింతలు చెప్పింది శ్రీదేవి.

రాత్రి పద్మ గదిలో మంచం మీద బాబుని పడుకోబెట్టి, స్నేహితురాళ్లిద్దరు చాపలు వేసుకుని కింద దగ్గిరిగా పడుకున్నారు.

చాలాసేపు మౌనంగా గడిచి పోయింది. కాని ఇద్దరికీ తెలుసును, ఎవరూ నిద్ర పోలేదనీ, నిద్రపోయినట్లు నటిస్తున్నారనీను. చివరికి శ్రీదేవే అంది. "పద్మా! నేను కాకినాడ ఎందుకు వచ్చానో తెలుసా? చారుమతి నీ విషయం అంతా ఉత్తరంలో రాసింది చాలా రోజుల కిందటే. అప్పటి నించి నీ దగ్గిరికి రావాలని ఒకటే తహతహ. ఇప్పటికి రాగలిగాను."

పద్మ "ఊమ్" అని ఊరుకుంది.

"అమ్మ నా కంతా చెప్పారు. నీ కథ విన్న దగ్గిర నించి నా గుండెలు మండి పోతున్నాయి. పెళ్లి అనగానే ఎన్ని కలలు కంటాం! భావి జీవితాన్ని ఎన్ని రంగుల్లో ఊహించుకుంటాం! అన్నీ నీకు నిరాశాలుగా మారిపోయాయి. అయినా మీ అత్తగారిని కాదు అనవలసినది. తప్పంతా మీ ఆయనది. ఆయనని అంటున్నానని కోపగించుకోకు. మరే అంత చవట ఏమిటి మాధవరావు?"

"నువ్వు ఏ మాట అన్నా, ఎవరిని అన్నా నాకు కోపం రాదు, ఏడుపు రాదు" అంది పద్మ.

"నే నొకమాట అడుగుతాను. చెబుతావా పద్మా? నువ్వు మీ ఆయన్ని మార్చడానికి ఏమైనా ప్రయత్నించావా?"

"అన్నీ అయ్యాయి, దేవీ. ఆయన వాళ్ళ అమ్మ బ్రతికి ఉన్నని రోజులూ మారరు. అమ్మతప్ప ఇంకో మనిషి అవసరం లేదు."

"మీ అత్తగారు కొడుక్కి పెళ్లి ఎందుకు చేసినట్టూ?"

"కొడుకుని కన్నాను, పెంచాను, పెద్ద చేశాను, చదువు చెప్పించాను, పెళ్లి చేసాను అని తను కొడుక్కి చేసిన ఉపకారాలన్నీ వల్లించుకునేందుకు! ఆవిడ కొడుక్కి పెళ్లి మాట్లాడని మానుతో చెయ్యవలసింది, హృదయం ఉన్న మనిషితో కాదు."

"కాని ఎన్నాళ్ళు మీ ఇద్దరూ వేరుగా ఉంటారు?"

"బహుశః జీవితాంతం వరకు." పద్మ గొంతుకలో అంతులేని నిరాశ.

"నీ జీవితం ఇలా చీకటిగా, అడివి కాచిన వెన్నెల్లా గడిచిపోవడం నేను సహించలేను." శ్రీదేవి ఉద్రేకంగా అంది.

పద్మ నవ్వింది. "మరేం చేస్తావు?"

"ఏదో ఒకటి చేయాలి పద్మా. నువ్వు మాధవరావుని వదిలేసి ఇంకెవర్నైనా పెళ్లి చేసుకో." ఆవేశంగా అంది శ్రీదేవి.

"అవన్నీ వట్టి మాటలు దేవీ! మొదటిసారి పెళ్లి కావడానికే ఆడపిల్లలకి ఎంతో కష్టమై పోతూ ఉంది. ఇంకా, ఒకసారి పెళ్లి అయి, రెండేళ్ళు కాపరం చేసిన నన్ను ఎవరు చేసుకుంటారు?"

"నీ లాంటి అందగత్తెను చేసుకోడానికి కోటిమంది ముందుకు వస్తారు."

"అంటా నీ భ్రమ. అలా వచ్చినా నేను చేసుకోను."

"ఎందుకు చేసుకోవూ?" అర్థం కానట్టు అడిగింది శ్రీదేవి.

"ఈ పెళ్లి ఇంత బాగా అయింది. ఈ మొగుడుతో ఇంత చక్కగా సంసారం చేశాను. నాకిప్పుడు పెళ్లి అన్నా, మొగుడన్నా వెగటు పుట్టింది. నా జీవితాన్ని ఇలా వెళ్ళనియ్యి."

"అలా జీవితాన్ని అసహ్యించుకోకు పద్మా. ఏ గొడవైనా కాలగతిలో మానిపోతుంది. కొన్నాళ్ళు గడిచే సరికి నువ్వు ఈ చేదుజీవితాన్ని మరిచిపోయి, నూతన జీవితాన్ని ఆశిస్తావు" అంది శ్రీదేవి.

"నువ్వో పిచ్చిదానివి. అందరినీ ఉద్ధరించాలనుకుంటావు" అంది పద్మ, అటు తిరిగి పడుకుంటూ.

"అవును, నా స్నేహితురాలు సుఖంగా లేదని తెలిస్తే , నేనూ సుఖంగా జీవించలేను" అంది శ్రీదేవి.

పద్మని గురించే ఆలోచిస్తున్న శ్రీదేవికి చాలా సేపటి దాకా నిద్ర పట్టలేదు.

పొద్దున్నే ఇంటికి ప్రయాణమయింది శ్రీదేవి. ఇల్లంతా సందడిగా తిరుగుతూ, ఎండిపోయిన వారి హృదయాలను రంజింపజేస్తూ, తియ్యటి నవ్వులు ఒలకబోస్తున్న చిన్ని అమర్ ని వదలాలనిపించడం లేదు పద్మకి, పద్మ తల్లికి, తండ్రికి కూడా. తాను కాకినాడలో ఉన్నన్ని రోజులు తరుచు పద్మ ఇంటికి వస్తూ ఉంటానని మాట యిచ్చి బయలు దేరింది శ్రీదేవి.

రిక్షా వచ్చింది.

"వెళుతున్నాను, పద్మా. ఇవాళ సాయంత్రం మా ఇంటికి రా. చారుకి కూడా కబురు పంపుతాను. కొంతసేపు ముగ్గురం హాయిగా గడపవచ్చును" అంది శ్రీదేవి.

పద్మ తటపటాయించింది. మద్రాసు నించి వచ్చాక పద్మ ఇల్లు కదిలి బయటికి వెళ్ళలేదు. బయటికి వెళితే ఇరుగుపొరుగు, తెలిసిన వాళ్ళు ఏం ప్రశ్నలు అడుగుతారో అని భయం.

"రాను" అని చెప్పబోతున్న పద్మ జవాబుని ఆపుతూ నారాయణరావుగారే అన్నారు. "పద్మని తప్పక మీ ఇంటికి పంపుతానమ్మా. అయిదు గంటలకి వస్తుంది" అని.

శ్రీదేవి రిక్షా ఎక్కి వెళ్ళిపోయింది.

సాయంత్రం నాలుగు గంటలకి శ్రీదేవి కబురు అందిన చారుమతి ఆమె ఇంటికి వచ్చింది. అమర్ ని చూసి చారుమతికూడా మురిసిపోయింది. వాడిని ఎత్తుకుని ముద్దులు కురిపించింది.

శీతాకాలం పొద్దు. నాలుగు గంటలకే ఎండ తగ్గిపోతూంది. చారుమతి, శ్రీదేవి పెరట్లో మామిడి చెట్టు కింద కూర్చున్నారు.

"ఇంకా పద్మ రాలేదా? వస్తుందని రాశావు చీటీలో" అంది చారుమతి కూర్చుంటూ.

"పద్మ అయిదు గంటలకి వస్తుంది. నీతో ముందు ఏకాంతంగా మాట్లాడవచ్చునని నాలుగింటికే రమ్మన్నాను."

"అంత ఏకాంతంగా మాట్లాడవలిసింది ఏమిటీ?" అంది చారుమతి, కళ్ళు చిట్లించి చూస్తూ.

"మన పద్మ విషయమే. నిన్న రాత్రి వాళ్ళమ్మగారు నాకు పద్మ కథంతా చెప్పారు.పద్మతో కూడా మాట్లాడాను నేను" అంది శ్రీదేవి, బాబుని ఒడిలోకి తీసుకుంటూ.

"నువ్వు పెళ్లి అయినదానివి. అర్థం చేసుకోగలవని పద్మ కథ  చెప్పి ఉంటారు. ఇంతకీ ఏమిటి సంగతి?" అంది కుతూహలంగా చారుమతి.

వరలక్ష్మి గారు చెప్పిన కథ అంతా తిరిగి చెప్పింది శ్రీదేవి. విని ఎంతో బాధ పడింది చారుమతి. పెళ్ళికాని తనకి, పెళ్లి అయిన పద్మకి జీవితంలో భేదం లేదు. పద్మకి ఒక చేదు అనుభవం మాత్రం మిగిలిపోయింది.

"అంటే, కాపరం వదిలేసి వచ్చిందంటావా పద్మ?" అంది చారుమతి.

"అది కాపరమా, చారూ? అతను పద్మని పెళ్లి ఎందుకు చేసుకున్నాడో అర్థం కావటం లేదు. అతనికి విడాకులు ఇచ్చేసి, తిరిగి పెళ్లి చేసుకోమంటున్నాను నేను."

ఆడపిల్లకి పెళ్లి కావటం, సరియైన వరుడు దొరకటం ఎంత కష్టమో స్వానుభవం మీద తెలుసును చారుమతికి.

"మొదటిసారికే దిక్కు లేకపోతే, రెండో పెళ్లి అమ్మాయిని చేసుకోడానికి ఎవరు సిద్ధ పడతారు, దేవీ?" అంది చారుమతి సందేహంగా.

"సహృదయులైన యువకులు మన సంఘంలో ఉండకపోరు, చారూ! అయితే మనం కొంచెం ప్రయత్నించి, వెదకాలి" అంది శ్రీదేవి. చారుమతి మౌనంగా ఊరుకుంది.

"నాకే ఒక అన్న ఉంటే ఈ ఇబ్బంది లేకపోవును కదా అని ఆలోచిస్తున్నాను. నచ్చచెప్పి, ఒప్పించి పద్మని పెళ్ళాడేటట్లు చూద్దును" అంది శ్రీదేవి తిరిగి.

చారుమతికి వెంటనే శంకరం జ్ఞాపకానికి వచ్చాడు. శంకరానికి పద్మ అంటే ఇష్టమే, ఎన్నోసార్లు పద్మ అందాన్ని పొగిడేవాడు.

"నీకు అన్న లేకపోతేనేం? నాలో అన్న ఉన్నాడుగా? అడుగుతాను" అంది చారుమతి.

శ్రీదేవి ఆనందంతో ఎగిరి గంటు వేసినంత పని చేసింది.

"శంకరం మాట నాకు జ్ఞాపకమే రాలేదు, చారూ. నువ్వు తప్పక శంకరాన్ని అడుగు. చిన్నప్పటినించీ తెలిసినది, చెల్లెలు ప్రాణమిత్రురాలూ కనక పద్మ కథ విని, హృదయం కరిగి పెళ్లి చేసుకోవచ్చును" అంది.

"సరే, వాడు రానీ అడుగుతాను. ఉత్తరాలలో రాస్తే ఇలాంటి పనులు జరగవు" అంది చారుమతి.

"శంకరం ఎప్పుడు వస్తాడు?" అడిగింది చారుమతి.

"రెండు నెలలు సెలవు తీసుకుని సంవత్సరాదికి వస్తాడట. మార్చిలో రావచ్చును. ఆ రెండు నెలలలో ఇక్కడ బోల్డు పని ఉంది."

"ఏమిటంత పని?"

"భగవతి పెళ్లిని గురించిన తొందర. భగవతికి మంచి సంబంధం చూసి, వాడు ఉండగానే పెళ్లి చేసెయ్యాలని ఊహ."

"అదేమిటీ? నీకు, మాలతికి పెళ్ళిళ్ళు కాకుండానే చిన్నదానికి చేసేస్తారా?" శ్రీదేవి ఆశ్చర్యంగా అడిగింది.

"మాలతికి సంబంధం నిశ్చయమై పోయింది. మా అత్త కొడుకు గోపాల్ ఇక్కడ రైల్వేలో పని చేస్తున్నాడు. నా సంగతి తరువాత చూసుకోవచ్చును. భగవతికి తొందరగా పెళ్లి చేసుకోవాలని ఉంది" అంది చారుమతి.

"నీ పెళ్లి కాకుండా భగవతి పెళ్లి చెయ్యడం నాకేం నచ్చలేదు" అంది శ్రీదేవి.

"ఒకటి రెండు సంబంధాలు చూశాం. నచ్చలేదు. అంటే, మాకు నచ్చక కాదు. వాళ్లకి చాలా కట్నం ఆశ ఉంది. ఒకరు అయిదువేలు, ఒకరు మూడువేలు కట్నము, లాంఛనాలు ఇవ్వమని కోరారు. వాళ్ళతో మేం తూగలేం. భగవతికి మాత్రం మంచి ఉద్యోగస్తుణ్ణే చేసుకోవాలని ఉంది."

శ్రీదేవి వింటూ ఊరుకుంది.

"మా బావగారిని, అదే భానక్క భర్తని చూశావుగా! ఆయనే పాపం తిరిగి అవస్థపడుతున్నారు. శంకరం వచ్చేలోగా ఏదో ఒకటి స్థిరపరిచేస్తే, వాడు ఉండగానే పెళ్లి చేసెయ్యవచ్చును. మళ్ళీ మళ్ళీ వాడు అంత దూరం నించి ఎక్కడ రాగలడు?"

"భగవతి పెళ్లి, మాలతి పెళ్లి ఒకసారే చేసేస్తారా? ఖర్చు కూడా కలిసి వస్తుంది" అంది శ్రీదేవి.

"ఏమో! నా పెళ్లి అయితే కాని మాలతి పెళ్లి చేసుకోదట. నా కోసం ఆగవద్దని చెబుతున్నాను నేను."

"పోనీలే! మాలతికైనా అక్కని గురించి దిగులు ఉంది."

శ్రీదేవి, చారుమతి మాట్లాడుకుంటూ ఉండగా పద్మ వచ్చింది. ఎన్నాళ్ళ తరవాతో ముగ్గురు వారి కిష్టమైన మామిడి చెట్టు కింద కూర్చుని మాట్లాడుకోవడం సంతోషాన్ని కలిగించింది.

పద్మ ఎదురుగా పెళ్ళిళ్ళ విషయాలు, కుటుంబ విషయాలు మాట్లాడ కూడదనుకున్నారు శ్రీదేవి, చారుమతి. కాస్సేపు పుస్తకాలను గురించి, సినిమాలను గురించి మాట్లాడుకున్నారు. పరిగెడుతూ, పడుతూ లేస్తూ తిరుగుతున్న అమర్ తో ఆడుకున్నారు కొంతసేపు. ఇంతలో శ్రీదేవి లోపలి వెళ్లి ఒక పుస్తకం తెచ్చి చారుమతి చేతిలో పెట్టి, "ఇందులోది ఒకటి పాడు" అంది. చారుమతి ఆ పుస్తకాన్ని అందుకుంది అది శ్రీదేవికి తను పెళ్ళిలో ఇచ్చిన కానుక. అది చూస్తూ, "ఈ పుస్తకం ఇక్కడే మరిచి పోయావా?' అంది.

"ఇక్కడ మరిచి పోతానా? అది నాతోపాటు ఎల్లప్పుడూ ఉంటుంది. నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తుంది" అంది శ్రీదేవి.

చారుమతి బసవరాజు అప్పారావుగారి గేయం పాడింది.

"ఎద మెత్త నౌటకై
సొదగుందరా, అంత
మది గల అహమెల్ల
వదిలి పోవురా."

"కొత్త పాటలు ఏమీ నేర్చుకోలేదా? ఏదైనా కొత్తది పాడు" అంది పద్మ.

చారుమతి తను గోపాల్ దగ్గిర నేర్చుకున్న పాట పాడింది.

"శివ శివ శివ యనరాదా!
శివనామము చేదా!"

"ఈ పాట రేడియోలో వస్తూ ఉంటుంది. నాకు చాలా ఇష్టం" అంది శ్రీదేవి.

చీకటి పడగానే ఇళ్ళకి వెళ్ళిపోవడానికి పద్మ, చారుమతి లేచారు. పద్మ రిక్షా కట్టించుకుని రామారావుపేట వెళ్లి పోయింది. చారుమతి నడచే ఇంటికి బయలుదేరింది. దారి పొడుగునా ప్రతి ఇంటి ముందర నీళ్ళు చల్లి ముగ్గులు తీరుస్తున్నారు ఆడవాళ్ళు. రకరకాలైన ఆ ముగ్గులు చూసుకుంటూ మెల్లిగా నడుస్తూ ఇల్లు చేరింది చారుమతి.

శ్రీదేవి సంక్రాంతి పండగ వెళ్ళేదాకా కాకినాడలోనే ఉంది. పండగ ముందురోజు ఆమె భర్త వచ్చాడు. ప్రతి రోజు పద్మని కలుసుకుని కొన్ని గంటలు గడిపేది శ్రీదేవి. పద్మలో రెండవసారి వివాహేచ్ఛ కలగజేయాలని శ్రేదేవి ఆశయం. పద్మలో కొత్త ఆశలు చిగురించాయి.

భోగినాడు కొడుక్కి భోగిపళ్లు పోసి, పేరంటానికి అందర్నీ పిలిచింది శ్రీదేవి. ఆ రోజు మాలతి ఒక చక్కటి "బేబీ సెట్" తెచ్చి అమర్ కి ఇచ్చింది. శ్రీదేవి పుచ్చుకోడానికి అడ్డు చెపితే, "ఆ రోజు నా కోసం ఎస్.ఎస్.ఎల్.సి. పుస్తకాలు పంపితే నేను వద్దన్నానా? నీ వల్లే ఆ పరీక్ష పాసయ్యాను. ఇవాళ నా ఆనందం కొద్దీ బాబుకి చిన్న కానుక ఇస్తే వద్దంటున్నావా అక్కా" అంది.

"బదులు తీర్చేసుకుంటున్నావా?" అంటూ నవ్వింది శ్రీదేవి.

పండగ వెళ్ళగానే హైదరాబాద్ వెళ్ళిపోయారు శ్రీదేవి, భర్తా.

శంకరం రెండు నెలలు సెలవు తీసుకుని మార్చి పదిహేనవ తారీఖున కాకినాడ వచ్చాడు. శంకరాన్ని కలుసుకోవడానికి ఇంటిల్లి పాదీ స్టేషన్ కి వెళ్ళారు.

శంకరం తల్లిని, చెల్లెళ్ళని, అక్కని చూడగానే కౌగలించుకున్నంత పని చేశాడు. స్టేషన్ లోనే తల్లికి, శారదమ్మకి వంగి నమస్కారం చేశాడు.

"ఇతను గోపాల్" అని గోపాల్ ని పరిచయం చేసింది చారుమతి.

గోపాల్ తో ఆప్యాయంగా కరచాలనం చేసి, "నీ గురించి అంతా ముందుగానే తెలుసునులే" అన్నాడు శంకరం.

ఇంతలో దూరంగా నవ్వుతూ నిలుచున్న రామారావుగారిని చూసి, "మీరూ వచ్చారా మాస్టారూ?" అంటూ నమస్కారం చేశాడు.

"ఇంకా మాస్టారూ అంటావేమిటి? బావగారూ అను అంది" మాలతి.

శంకరం నవ్వుతూ, "బావగారూ!' అంటూ దగ్గిరికి వెళ్లి రెండు చేతులూ పట్టుకున్నాడు.

"పదవోయ్ బావమరిదీ! నువ్వు చూస్తే స్టేషన్ లోనే రోజంతా గడిపేసేటట్టున్నావ్" అంటూ చనువుగా శంకరం వీపు మీద చరిచారు రామారావుగారు.

అందరూ రిక్షా కట్టించుకుని ఇల్లు చేరారు. శాంతమ్మ రాత్రి కొడుకు కోసం పాయసం చేసి, విందు చేసింది. శాంతమ్మ, శారదమ్మ వడ్డిస్తూంటే రామారావుగారు, పిల్లలు వంటిల్లంతా నిండుగా కూర్చుని భోజనం చేశారు. భోజనాల దగ్గిర శంకరం తను వెళ్ళిపోయాక ఇంట్లో జరిగిన మార్పులు, భానుమతి పెళ్లి, మామ్మ చనిపోవడం అన్నీ అడిగి తెలుసుకున్నాడు.

"ఇంటి సంగతులు అలా ఉంచు. నీ కీ ఉద్యోగం ఎలా దొరికిందో చెప్పు" అన్నారు రామారావుగారు.

శంకరం తన కథ చెప్పాడు.

"ఆ రోజు మీ దగ్గిర ఇరవై రూపాయలు, నావి రెండు జతల బట్టలు, దుప్పట్లు తీసుకుని వెళ్లి పోయానా? రాత్రి తిన్నగా స్టేషన్ కి వెళ్లి ఫ్లాటుఫారం మీద ఉన్న రైల్లో యెక్కి కూర్చున్నాను. అది ఎక్కడికి వెళుతుందో కూడా తెలియదు. అసలు నాకు గమ్యమే తెలియదు. 'ఎక్కడికి వెళ్ళాలి? ఏం చెయ్యాలి?' అన్నవి ప్రశ్నలుగానే ఉండిపోయాయి నాకు.

నేను ఎక్కిన రైలు సామర్లకోటలో ఆగిపోయింది. అక్కడ కనుక్కుంటే వాల్తేరు– విజయవాడ పాసెంజర్ ఒకటి అప్పుడు వస్తుందని తెలిసింది. నేను విజయవాడకి టిక్కెట్టు కొని, ఆ రైలులో ఎక్కాను. రాత్రి ప్రయాణం. ప్రయాణీకులంతా నిద్ర పోతున్నారు. నేను మాత్రం కిటికీ దగ్గిర కూర్చుని ముందు దారిని గురించి ఆలోచిస్తున్నాను.

"ఎక్కడికి వెళతారు?' ఆ యెదురు గుండా కిటికీ దగ్గిర కూర్చున్న ఆయన ప్రశ్నించాడు. అతను మంచి బట్టలు వేసుకుని, పెద్ద ఉద్యోగస్థుడిలాగే ఉన్నాడు.

నేను ఆయన వైపు తిరిగి, "విజయవాడ" అని చెప్పి, మళ్ళీ కిటికీలో నించి చూస్తూ కూర్చున్నాను. అతనూ ఇంకేం మాట్లాడలేదు.

నాకే కాస్సేపు ఉన్నాక తోచింది, నలుగురితో మాట్లాడి, నాలుగు విషయాలు తెలుసుకుంటే మంచిదని.

ఆయన వైపు తిరిగి అడిగాను. "మీరెక్కడ పని చేస్తున్నారు?"

"సెంట్రల్ గవర్నమెంటులో, మైన్స్ లో" అన్నారు ఆయన.

నాకు నిరాశ కలిగింది. నా గ్రూపు సైన్స్ కాదు. నేను చదివింది ఇంజినీరింగ్ కాదు, మైన్స్ లో పని దొరకడానికి. మళ్ళీ మౌనంగా కూర్చున్నాను.

"మీరేం చేస్తున్నారు?" ఆయన అడిగాడు. చిన్నవాడినైన నన్ను కూడా మన్నించి, "మీరు" అనడం ఆయన సంస్కార వంతుడని తెలుపుతూ ఉంది.

"నేనేం పని చేయడం లేదండీ. బి.ఏ. పాసై ఊరికేనే ఉన్నాను. ఎక్కడైనా ఉద్యోగం దొరికితే బాగుండును" అన్నాను.

"బి.ఏ. లో ఏ గ్రూపు తీసుకున్నారు?' అన్నాడు అతను.

"లెక్కల గ్రూపు."

అతను మళ్ళీ  మాట్లాడకుండా కూర్చున్నాడు.

"నేను మీకంటే చిన్నవాణ్ణి. నన్ను మీరు మీరు అని సంభోదించకండి. మీరు నా కేదైనా సహాయం చేస్తే కృతజ్ఞుణ్ణి. నాకు ఉద్యోగం లేక మా సంసార ఆర్ధిక పరిస్థితులేం బాగాలేవు" అంటూ నాన్నగారు పోవడం, మన అప్పులూ అన్నీ చెప్పాను.

అన్నీ విని ఆయన చివరికి ఇలా అన్నారు.

"నీకు మా డిపార్ట్ మెంటు లోనే ఉద్యోగం ఇప్పించగలను. కాని అది చెయ్యటానికి నువ్వు సిద్ధ పడాలి" అన్నారు.

"ఏమీ లేనివాడికి ఎక్కడైతే నేం? ఏదైతే నేం? ఒక ఉద్యోగం అంటూ ఉంటే చాలు" అన్నాను ఆత్రంగా.

"ముందర అన్నీ సావకాశంగా విని, ఒక నిశ్చయానికి రా. నేను డ్రిల్లింగ్ డివిజన్ లో నీకు పని ఇప్పించ గలను. ఆక్కడ నీకు మెషీన్స్ అవీ ఎలా నడపాలో నేర్పుతారు. క్రమంగా నువ్వు నేర్చుకుని నీ అంతట నువ్వే నడపగలవు. పనికి రోజుకి ఇంత అని డబ్బు ఇస్తారు. అంటే నెలకి ఇంత అని జీతం ఇవ్వరు. ఎన్ని రోజులు పని చేశావో అన్ని రోజులకి డబ్బు దొరుకుతుంది."

"అంటే, కూలీలలాగా!" అన్నాను నేను చిన్నబుచ్చుకుంటూ.

"నువ్వు ఏమైనా అనుకో. కాని ఒక్క ఏడాదిలో నీకు మంచి ఉద్యోగం దొరుకుతుంది.  జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ గా అయిపోవచ్చు. నెలకి మూడు వందలదాకా వస్తాయి."

నేను మనస్సులో ఆలోచించుకున్నాను. ఒక్క ఏడాది కష్ట పడితే తరవాత మంచి జీతం తీసుకోవచ్చును. ఉద్యోగం కోసం రోడ్లు పట్టుకుని తిరగనవసరం లేదు,

"సరే, నాకా ఉద్యోగం ఇప్పించండి" అన్నాను.

"నాతో రా" అన్నారు ఆయన.

"ఎక్కడికి?"

"నేను మధ్యప్రదేశ్ లో 'బిజోరి' అనే చోట పనిచేస్తున్నాను. అక్కడికే తీసుకు వెళతాను."

"కాని నా దగ్గిర అంత దూరం రావటానికి డబ్బు లేదండీ. నేను ఇంటి నించి తెచ్చింది ఇరవై రూపాయలు. టిక్కెట్టు కొనగా చాలా తక్కువ మిగిలింది" అన్నాను సిగ్గు పడుతూ.

"డబ్బు నేను సర్దుతానులే. మళ్ళీ నీకు సొమ్ము సమకూరాక తీర్చేయ్యవచ్చును" అన్నారు ఆయన.

అలా భాస్కర రెడ్డి గారితో మధ్యప్రదేశ్ వెళ్లాను. ఇంక చెప్పడానికి ఏముంది? రోజువారీ జీతం మీద ఏడాది కష్ట పడిన తరువాత ప్రస్తుతం ఉన్న ఉద్యోగానికి సెలెక్షన్ వచ్చింది" అన్నాడు శంకరం తన కథ ముగిస్తూ.

"ఆ భగవంతుడే ఆ భాస్కర రెడ్డి రూపంలో నీకు కనిపించారు. ఆయన సహాయం చేసి ఉండక పోతే నీ పని ఏమౌనో?" అంది శాంతమ్మ కృతజ్ఞతా భావంతో.

"ఆ భాస్కర రెడ్డిగారితో పాటు మన బావగారి పేరుకూడా తలుచుకో అమ్మా. మాస్టారి కథ విన్నాకే నాకు ఎలాగైనా కష్టపడి ఉద్యోగం సంపాదించుకోవాలన్న పట్టుదల కలిగింది" అన్నాడు శంకరం.

"నువ్వు ఇంకొకరిని కూడా తలుచుకోవాలి శంకరం. మన చారు ఆ రోజు అంత ఘాటుగా మాటలు అని ఉండకపోతే నువ్వు అసలు ఇల్లు కదిలే వాడివా?" అంది భానుమతి.

"మళ్ళీ ఆ రోజు నా మాటలు జ్ఞాపకం చేసి, ఎందుకు నన్ను సిగ్గు పరుస్తావు అక్కా! చిన్నతనంలో ఏదో అన్నాను" అంది చారుమతి సిగ్గు పడుతూ.

"నువ్వు చేసింది చాలా మంచి పని చారూ! భానక్క అన్నట్లు నువ్వు అలాంటి మాటలు అని ఉండకపోతే నాలో వేడి పుట్టేది కాదు. నీ మాటలతో నా కర్తవ్యం గుర్తు చేశావు. నా కళ్ళు తెరిపించావు" అన్నాడు శంకరం.

"మనం ఎంత? మన మాటలకి, చేతలకి ఉండే ప్రభావం ఎంత? మనం మహాత్ములమా? ఏదో సామాన్యులం. ఏటి ఒడ్డున బ్రతికే నీటి పూల వంటివి మన జీవితాలు" అన్నారు రామారావుగారు.

అందులో ఉండే అర్థం గ్రహించిన చారుమతి, 'మాస్టారు మన జీవితాలని ఎంత బాగా పోల్చారు! అతి సామాన్యులం మనం. పుట్టడం, ఇబ్బందులు పడటం, పెళ్లి చేసుకుని పిల్లల్ని కనడం, చనిపోవడం ... ఇదేగా జీవితం! ఏ ఒక గొప్ప పనీ చేయకుండానే, జీవితంలో ఏ ప్రత్యేకతా లేకుండానే తనువు చాలిస్తాం' అనుకుంది.

భోజనాలు చేసి, చేతులు కడుక్కుని వచ్చి, మళ్ళీ అందరూ ముందు గదిలో మాటలకి చేరారు. శంకరం మధ్యప్రదేశ్ విశేషాలను గురించి, తన ఉద్యోగాన్ని గురించి చెబితే, చెల్లెళ్ళు కాకినాడ విశేషాలు, సినిమాలు మొదలయిన వాటిని గురించి చెప్పారు.

తెల్లగా ఉండే శంకరం గోధుమ వర్ణానికి తిరిగాడు. సుకుమారంగా ఉండేవాడు, కొంచెం మోటుదేరి, కొద్దిగా లావయ్యాడు. స్వశక్తి మీద పైకి వచ్చిన అతనిలో ఆత్మ విశ్వాసం, ధైర్యం స్ఫుటంగా కనిపిస్తున్నాయి. కదలికలో ఒక విధమైన హుందా తనం, మాటలో ఒక తరహా నిండుతనం ఉన్నాయి.

'ఎంత మారిపోయాడు శంకరం!' అనుకుంది చారుమతి, రెండేళ్లలో అతనిలో కలిగిన మార్పును గమనిస్తూ.

## 36

శంకరం వచ్చిన వారం రోజులకే భగవతిని చూసుకోవడానికి విశాఖపట్నం నించి పెళ్ళివారు వచ్చారు. పెళ్లి కొడుకు బి.కాం. పాసై హైదరాబాద్ లో ఎల్. ఐ. సి. లో ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లవాడు, తల్లీ భగవతిని చూసుకోవడానికి వచ్చారు. వారికి పిల్ల నచ్చింది. రెండువేల కట్నము, ఆడపడుచు లాంఛనాలు కావాలని కోరారు.

పెళ్లి వారు వెళ్లి పోయాక శాంతమ్మ శంకరంతోనూ, పెద్ద కూతుళ్లిద్దరితోనూ, రామారావు గారితోనూ పెళ్లి విషయం చర్చించింది.

"పెళ్ళికొడుకు ఏం బాగాలేదమ్మా. భగవతిని ఇస్తే కాకి ముక్కుకి దొండ పండులా ఉంటుంది" అన్నాడు శంకరం.

పెళ్లి కొడుకుకి ఇరవైయారు ఏళ్ళు. నల్లని పెద్ద విగ్రహం. కొంచెం పళ్ళు ఎత్తు.

"కాని భగవతికి నచ్చాడు. దాని దృష్టి అంతా అతని ఉద్యోగం మీదే" అంది చారుమతి.

"డబ్బు మాట ఎలాగ?" అంది భానుమతి.

"రెండువేలు లాంఛనాలు అడుగుతున్నారు. పెళ్ళికి మళ్ళీ ఖర్చు ఉంటుంది. అన్నీ కలిపి తడిపి మోపెడు అవుతాయి. మనం ఈ సంబంధానికి తూగలేం" అంది శాంతమ్మ.

"ఏ సంబంధమూ తూగలేమమ్మా. అందరూ బావగారి లాగా, గోపాల్ లాగా ఉచితంగా, కానీ ఖర్చు లేకుండా నీ కూతుళ్ళ మెడలో పుస్తె కట్టెయ్యటానికి అంగీకరించరు" అంది చారుమతి.

"నిజమేనమ్మా. అందరూ మంచివాళ్ళే ఉంటారా? ఇప్పటి కాలంలో పిల్ల అందం చూసి ఎవరు చేసుకుంటున్నారు? డబ్బు కోసం ఆశ పడతారు" అంది శాంతమ్మ.

"ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందాం. ముందర ఈ పెళ్లి విషయం తేల్చండి" అన్నాడు శంకరం.

"పిల్లవాడి తల్లి మంచిది లాగే ఉంది" అంది భానుమతి.

"నన్ను అడిగితే ఈ సంబంధం నిశ్చయం చేసేద్దామంటాను. ఇంతకు మునుపు చూసినవన్నీ ఎస్.ఎస్. ఎల్.సి. పాసైన పెళ్లి కొడుకుల సంబంధాలే. వాళ్ళే వెయ్యి, రెండు వేలు అడిగారు. అంతకంటె కొంచెం డబ్బు ఎక్కువైనా ఈ సంబంధం చేసెయ్యడమే మంచిది" అంది చారుమతి.

"పిల్లవాడు ఉద్యోగంలో పైకి వచ్చే అవకాశం ఉంది" అన్నారు రామారావుగారు.

"సరే, అందరూ ఒప్పుకుంటున్నారు. భగవతి ఇష్టపడుతూంది కనక, ఈ సంబంధం ఖాయం చేసి, పెళ్లి చేసేద్దాం" అన్నాడు శంకరం.

"అన్నిటికీ ముఖ్యం డబ్బు ఉండవద్దుటరా!" అంది శాంతమ్మ.

"డబ్బు విషయం నేను చూసుకుంటాను. అది నాకు వదిలేయ్" అన్నాడు శంకరం.

శంకరం అలా అన్నాడే కాని, మనస్సులో డబ్బు గురించి మథన పడుతూనే ఉన్నాడు. ముందర ఎవరైనా అప్పు ఇస్తే, తరవాత తన ప్రతినెలా కొంత డబ్బు చొప్పున తీర్చెయ్యవచ్చు. కాని అప్పు ఇచ్చే వారెవరు?

మరునాడు శంకరం చారుమతిని పిలిచి అప్పు సంగతి ఎత్తాడు.

"నా దగ్గిర కూడ బెట్టినవి ఆరువందలు ఉన్నాయి. అవి తీసుకో శంకరం. తక్కినది సూరమ్మగారి దగ్గిర అప్పు తెద్దాం" అంది చారుమతి.

"నీ డబ్బు దాచుకోవే. అంతా ఇంటికే వాడేస్తున్నావు" అన్నాడు శంకరం నొచ్చుకుంటూ.

"ఇది ఎప్పటినించీ నేర్చుకున్నావు? నీ డబ్బు, నా డబ్బు అంటూ..." అంది నిష్ఠూరంగా చారుమతి.

"బాధపడకే. ఆడపిల్ల సొమ్ము తీసుకోవాలంటే సంకోచంగా ఉంటుంది. నా దగ్గిర ఒక ఆరువందలదాకా ఉన్నాయి. మనం ఎలా లేదన్నా రెండువేలా అయిదు వందలైనా అప్పు తేవాలి" అన్నాడు శంకరం.

సూరమ్మగారిని కలుసుకుంటానని వెళ్లి, గంటలో ముఖం వేల వేసుకుని తిరిగి వచ్చింది చారుమతి.

"ఏమైంది చారు?" అన్నాడు శనకరం ఆత్రతతో.

"సూరమ్మగారు అంత డబ్బు అప్పు ఇవ్వడానికి వెనక తీస్తూంది. ఏదైనా తాకట్టు పెడితే ఇస్తుందిట. ఇల్లు కుదువ బెట్టమంటూంది" అంది.

శంకరం గుండెల్లో రాయి పడింది. 'ఎప్పుడో తాతలు సంపాదించిన ఇల్లు. అది ఉండటం వల్లే తల దాచుకోవడానికి ఇబ్బంది లేకుండా వుంది. యిల్లు తాకట్టు పెట్టడమా?' అని ఆలోచనలో పడ్డాడు.

"బావగారి సలహా అడిగితే బాగుంటుందేమో?' అంది చారుమతి.

ఆ ఆలోచన నచ్చి శంకరం రామారావుగారి దగ్గిరికి వెళ్లి అప్పు సంగతి, సూరమ్మ ఇల్లు కుదువ బెట్టమనడం చెప్పి, "ఇప్పుడు ఏం చెయ్యమంటారు బావగారూ?" అన్నాడు.

రామారావుగారు చాలా సేపు ఆలోచించారు. చివరికి, "శంకరం! మనం ఏదో తాకట్టు పెట్టందే ఈ కాలంలో మనకి యెవరూ అంత డబ్బు అప్పుగా ఇవ్వరు. ఈ పెళ్లి చెయ్యాలంటే తాకట్టు పెట్టక తప్పదు మరి" అన్నారు.

శంకరం దిక్కు తోచని వాడిలా కూర్చున్నాడు. ఇల్లు తాకట్టుని గురించి వింటే తల్లి బాధ పడుతుంది. కాని వేరే గతి లేదు.

శాంతమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనే ఇంటి తాకట్టుకు ఒప్పుకుని, కాయితాల మీద సంతకం చేసింది.

మంచి ఉద్యోగస్తుడు భర్తగా లభిస్తున్నాడని మురిసిపోతున్న భగవతికి మాత్రం ఇంటి తాకట్టుని గురించి పెద్దవాళ్ళు తెలియనివ్వలేదు.

భగవతి పెళ్ళికి ఏప్రిల్ ముప్ఫైయ్యవ తారీఖున ముహూర్తం పెట్టారు. మంచి రోజు చూసి పసుపు దంపించి, ఇంట్లో పెళ్లి పనులు ప్రారంభించారు. ఇంటికి వెల్ల వేయించి కొన్ని ఏళ్ళు దాటి పోయింది. ఎలాగూ ఖర్చు అవుతూందని శంకరం ఇల్లు బాగు చేయించి, వెల్ల వేయించాడు. గుమ్మాలకి పసుపురంగు రాసి, తెలుపు, ఎఱుపు చుక్కలు పెట్టింది భానుమతి,

శాంతమ్మకి పనులలో సహాయం చెయ్యడానికి శారదమ్మ రోజూ మధ్యాహ్నం వచ్చేది. పప్పులు, బియ్యం బాగు చేయడం, అప్పడాలు, వడియాలు పెట్టడం... వీటితో ఆడవాళ్ళకి ఊపిరి సలపని పని. రామారావుగారికి, చారుమతికి స్కూళ్ళకి ఇంకా సెలవులు ఇవ్వలేదు. పెళ్లి ముందు పదిరోజులు సెలవు పెడతానంది చారుమతి.

బజారు పని అంతా శంకరమే చూసుకుంటున్నాడు. రోజూ బజారు నించి రాగానే, "ధరలు మండి పోతున్నాయమ్మా. ప్రతి వస్తువూ ఖరీదు పెరిగి పోయింది" అనేవాడు.

"అవును నాయనా. రోజురోజుకీ బ్రతకడం కష్టమైపోతూంది. ఎంత వచ్చినా చాలడం లేదు" అనేది శాంతమ్మ.

## 37

ఒక రోజు ఉదయమే బూడిద గుమ్మడికాయ వడియాలు పెడుతూంది శాంతమ్మ. ప్రొద్దున్నే మినపప్పు రుబ్బడానికి సాయంగా శారదమ్మ ముందు రాత్రే వచ్చి పడుకుంది.

మంచం మీద గుడ్డ పరిచి ప్రొద్దున్నే ఇద్దరూ వడియాలు పెడుతున్నారు. వంటింట్లో భానుమతి రామారావుగారికి, శంకరానికి, చారుమతికి వడ్డిస్తూంది. బయటి నించి శాంతమ్మ మాటలు వినిపించాయి.

"ఏమిటోనమ్మా శారదమ్మా! చారు పెళ్లి కాకుండా భగవతి పెళ్లి చేసెయ్యడం నాకేం బాగా లేదు. రేపు పెళ్ళికి వచ్చిన నలుగురు పెద్దలూ, 'ఏమిటమ్మా, పెద్దపిల్లకి పెళ్లి చెయ్యకుండా చిన్నదానికి చేస్తున్నారు?' అంటే ఏమని సమాధానం చెప్పను?"

ఆ మాటలు తల్లి నోటి నించి వింటూనే, చారుమతి గబగబా ఎంగిలి చేత్తోనే బయటికి వచ్చి, విసురుగా అంది. "ఏం సమాధానం చెప్పాలో నేను చెబుతానమ్మా. 'మా చారుమతికి పెళ్లి ఈడు ఎలాగూ దాటి పోయింది. రెండు మూడు సంవత్సరాలు ఇంకా ఆగినా ఫరవాలేదు. భగవతికైనా ఈడు ఉన్నప్పుడే పెళ్లి చెయ్యాలని ఇప్పుడే చేస్తున్నాం' అని చెప్పు. మళ్ళీ మళ్ళీ నువ్వు నా పెళ్లి మాట ఎత్తితే ఊరుకోను. భగవతినైనా సంతోషంగా ఉండనియ్యి."

"అమ్మ మాటలు ఎందుకు పట్టించుకుంటావు చారూ! నువ్వు ముందర వచ్చి భోజనం చెయ్యి" అని చారుమతి ఎడం చెయ్యి పట్టుకుని బలవంతంగా లోపలి తీసుకు వెళ్ళింది భానుమతి.

" చూశావా శారదమ్మా! ఎంతలేసి మాటలంటూందో! వీళ్ళు నా కూతుళ్ళు కాదమ్మా శత్రువులు. దానికి పెళ్లి కాలేదే అని నేను ఎంత బాధ పడుతున్నానో భగవంతుడికే యెరక. నువ్వు అదృష్టవంతురాలివమ్మా. ఒక్క కొడుకుని కని ఊరుకున్నావు. కూతుళ్ళని కనలేదు."

శాంతమ్మ మాటలు వినే వాళ్లకి కష్టం కలిగించాయి.

చారుమతి స్కూలుకి వెళుతూ తను తల్లితో అన్న మాట తప్పేమో అని బాధ పడింది. తనకి ఇప్పటి దాకా పెళ్లి కాదంటే తల్లి తప్పు కాదు. ఆవిడ మాత్రం ఏం చెయ్యగలదు? పరిస్థితులు అలాంటివి. తండ్రి చనిపోవడం, పేదరికం అన్నీ అలా వచ్చాయి.

కాని రోజూ ఒకసారైనా శాంతమ్మ నోటి నించి ఆ మాటలు వింటున్న చారుమతికి విసుగ్గా ఉంటుంది. రామారావుగారి ముందు, శంకరం ముందు అలా తొందర పడకుండా ఉండవలసింది అనుకుంది చారుమతి. పైగా అనవసరంగా తల్లిని బాధ పెట్టానని మనస్సులో యెంతో కష్టపడింది.

పెళ్లిళ్ళని గురించి ఆలోచిస్తూంటే పద్మ జ్ఞాపకం వచ్చింది. 'శంకరాన్ని పద్మని గురించి ఇవాళైనా అడగాలి' అనుకుంది.

సాయంత్రం వస్తూనే ముందు గదిలో పేపరు చూస్తున్న శంకరాన్ని అడిగింది. "అలా జగన్నాథపురం వంతెన దాకా వెళదాం, వస్తావా?" అని.

"ఎందుకు?" అన్నాడు శంకరం.

"నీతో మాట్లాడాలి" అంటూ చారుమతి లోపలి వెళ్లి ముఖం కడుక్కుని, కాఫీ తాగి వచ్చింది. శంకరం బట్టలు వేసుకుని తయారుగా ఉన్నాడు.

"నేనూ, శంకరం అలా బయటికి వెళ్లి వస్తాం. అమ్మ అడిగితే చెప్పు" అని భగవతితో చెప్పి చారుమతి బయటికి వచ్చింది.

ఇద్దరూ మసీదు దగ్గిర మలుపు తిరిగి, మెయిన్ రోడ్డు మీదికి వచ్చారు. మెయిన్ రోడ్డు మీద తిన్నగా ఒక మెయిలు నడిస్తే జగన్నాథపురం వంతెన వస్తుంది. అక్కడ ఉప్పుటేరు మీద పాత వంతెన స్థానంలో కొత్త వంతెన కట్టారు. ఈ వంతెన చాలా విశాలంగా ఉంది. పనిలేని యువకులు, సాయంత్రం కొంత దూరం వాకింగ్ కి వెళ్లాలనుకునేవాళ్ళు జగన్నాథపురం వంతెన దాకా నడిచి వెళుతూ ఉంటారు. వంతెన మీద నిలుచుని చూస్తే సూర్యాస్తమయం చాలా అందంగా కనిపిస్తుంది. ఏరులో పడవలు, ఏటికి రెండు పక్కలా చెట్లు, దూరదూరంగా కనిపించే పచ్చని పొలాలు, పైన యెఱ్ఱని ఆకాశం... చిత్రకారుడు సావకాశంగా కూర్చుని గీసిన వర్ణ చిత్రంలా ఉంటుందా దృశ్యం.

చారుమతీ, శంకరం వంతెన దాటి ఏటికి అవతల వైపున కొంత దూరం నడిచి, మంచి చోటు చూచుకుని కూర్చున్నారు.

విషయాన్ని యెలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తూ, చారుమతి తలవంచుకుని, చేతితో గడ్డి తుంపుతూ కూర్చుంది.

"నాతో ఏకాంతంగా మాట్లాడవలసినంత పెద్ద విషయం ఏమిటే?" ఆనాడు శంకరం, తనే ప్రసంగాన్ని కదుపుతూ.

"మా పద్మ తెలుసుకదా?"

"ఎందుకు తెలియదు? మా కాలేజీ బ్యూటీ కదా, అంత తొందరగా యెలా మరిచిపోతాను?" శంకరం ఆశ్చర్యంగా అడిగాడు.

"పద్మకి పెళ్లి అయింది....." చారుమతి ఇంకా పూర్తి చెయ్యకుండానే శంకరం అందుకున్నాడు. "ఎప్పుడో నాలుగైదు యేళ్ళ కిందటే అయింది కదూ?"

"అవును. కాని పద్మ కాపరం వదిలేసి కాకినాడ వచ్చేసింది. ఏడాది అయింది."

"ఎందుకు వచ్చేసింది?"

"దాని వెనక చాలా కథ ఉంది. పద్మ కాపరం ఒక హృదయ విదారకమైన కథ."

"మీ పద్మ కథ నాకెందుకు?" అన్నాడు శంకరం.

"నువ్వు ముందు విను. తరవాత ఎందుకో చెబుతాను" అంటూ చారుమతి పద్మ కాపరము, అత్తగారి ప్రవర్తన, భర్త మూర్ఖత్వము... అన్నీ చెప్పింది.

"అంటే, మీ పద్మ తప్పేం లేదంటావు?" అన్నీ విని అడిగాడు శంకరం.

శంకరం ప్రశ్న విని ఆశ్చర్య పోయింది చారుమతి.

"అంటే, నీ ఉద్దేశ్యం?"

"పరిస్థితుల్ని అర్థం చేసుకుని, సర్దుకు పోవడానికి ప్రయత్నించాలి. భర్త అనువుగా లేకపోతే, కొన్నాళ్ళు ఓపికగా ఉంది భర్తని మార్చుకోవాలి. అంతేకాని పుట్టిల్లు ఉందికదా అని పరిగెత్తుకు వచ్చేస్తారా?"

"నాలుగేళ్ళు నోరు మూసుకుని అన్నీ సహించడం ఓపిక కాదా?'నువ్వు నాతో మాట్లాడవద్దు, నువ్వు మాకు అనవసరం' అంటూ అసహ్యించుకునే మనుష్యులతో రెండేళ్ళు గడపటం ఓర్మి కాదా? ఆడదానికి మాత్రం అబిమానం ఉండదా?" చారుమతి ఆవేశంగా మాట్లాడింది.

"నువ్వు అలా ఉద్రేక పడిపోకు. మీ పద్మకి కూడా నీ లాగే ఉద్రేకమేమో. భర్త తనతో మాట్లాడడం లేదనే అభిమానంతో తొందరపడి మొగుణ్ణి వదిలేసి ఉంటుంది."

"శంకరం! నువ్వు ఏదో సహృదయతతో పద్మ పరిస్థితి అర్థం చేసుకుంటావనుకున్నాను. కాని లోకం అందరితో పాటు ఆడదానిదే లోపం అంటూ పద్మ భర్తని వెనక వేసుకు వస్తావనుకోలేదు. ఎంత ఆలోచించినా లోకుల ప్రవర్తన అర్థం కాదు నాకు. ఒక భార్యా, భర్తా విడిపోతే, మగవాళ్ళు భర్త వైపే ఉంటారు. స్త్రీలూ భర్తనే చూసి జాలి పడతారు. ఆడ, మగ అందరూ దుయ్యబట్టేదీ తప్పు పట్టేది స్త్రీనే.

'మొగుణ్ణి వదిలేసి వచ్చింది' అని అందరూ అనుకుంటూంటే, బయటికి రాలేక, ఇంట్లో పాతకథలు, బాధలు తలుచుకుంటూ కూర్చోలేక అవస్థ పడే పద్మ ఏం సుఖ పడిపోవాలని కాపరం వదిలేసి వచ్చిందంటావు? ఈ అవమానాలన్నిటికీ కూడా సహించడానికి సిద్ధ పడిందీ అంటే, అత్తగారింట్లో ఇంకా యెన్ని బాధలు పడి వుండాలి అంటావు? భర్త ప్రవర్తన ఎంత వ్యథ కలిగించి వుండాలి? ఆడది తగిన కారణం ఉంటేనే కాని భర్త గృహాన్ని వదిలి యెప్పుడూ రాదు" అంది చారుమతి. శంకరం పద్మని అర్థం చేసుకోలేకపోతున్నాడని దుఃఖ పడింది. పద్మ మీద జాలితో హృదయం ద్రవించింది.

శంకరం చాలా సేపటి వరకు ఏమీ మాట్లాడలేదు. చివరికి, "నువ్వు చెప్పింది నిజమే అనవచ్చు చారూ. ఆడది ఆడదాన్ని అర్థం చేసుకున్నట్టు మగవాడు స్త్రీని ఎప్పుడికీ అర్థం చేసుకోలేదు" అన్నాడు.

"అవును, ఇది మగవాళ్ళ ప్రపంచం. వాళ్ళు ఏం చేసినా చెల్లుతుంది. ఏది చేసినా ఒప్పే. ఆడదాన్ని అర్థం చేసుకోడానికి ఏ మగవాడూ ప్రయత్నించడు" అంది చారుమతి దూరంగా ఎక్కడో చూస్తూ.

"ఇంతకే ఈ కథ ఇప్పుడు ఎందుకు చెప్పినట్టు?" అన్నాడు శంకరం.

"ఏమీ లేదు" అంటూ లేచింది చారుమతి. పద్మని పెళ్లి చేసుకోమని శంకరాన్ని అడగాలనిపించలేదు. అడిగినా ఒప్పుకుంటాడనే నమ్మకం లేదు.

"ఏమిటో నువ్వు! ఏదో మాట్లాడాలి అంటూ నన్ను తీసుకు వచ్చావు. ఇప్పుడు ఏమీ లేదు అంటావు" అంటూ విసుక్కుంటూ చారుమతిని అనుసరించాడు శంకరం.

ఇద్దరూ మౌనంగా వంతెన మీదికి వచ్చారు. తట్టలలో అప్పుడే విచ్చుకున్న మల్లె దండలు అమ్ముతున్నారు చాలామంది కుర్ర వాళ్ళు.

"మల్లె పూలు కొంటావా?' అన్నాడు శంకరం.

"ఇప్పుడేం వద్దు" అంది చారుమతి.

చారుమతి మనస్సెందుకో బాగా లేదనుకున్నాడు శంకరం. 'శంకరాన్ని అడుగుతా' నని మాట ఇచ్చింది శ్రీదేవికి. శంకరానికి పద్మ అంటే ఇష్టమనీ, తప్పక పెళ్లి చేసుకుంటాడనీ నమ్మింది ఇన్నాళ్ళూ. కాని శంకరం ఈ రోజు పద్మదే తప్పని మాట్లాడుతూంటే సహించలేక పోయింది చారుమతి. 'ఏం మగవాళ్ళు!' అనుకుంది, మగవాళ్ళ మీద విముఖత్వంతో.

పెళ్ళికి ఒకరోజు ముందు, ఇరవై తొమ్మిదో తారీఖు సాయంత్రం దిగారు మగపెళ్ళివారు. తమ ఇల్లు చిన్నదౌతుందని బంగారువారి సత్రంలో పెళ్లి ఏర్పాట్లు చేశాడు శంకరం. సత్రంలోనే ఒకపక్క మగపెళ్ళివారికనీ కొన్ని గదులు కేటాయించారు.

పెళ్లి ఇంకా రెండు రోజులు ఉందనగానే ఆడపెళ్ళివారు సత్రంలోకి మారిపోయారు. ఇంటినించి సత్రానికి ప్రతి వస్తువు తరలించుకు వెళ్ళడం కష్టమే అనిపించింది.

పెళ్ళికొడుకు కృష్ణమూర్తికి ఒక అన్న, ఇద్దరు అక్కలు ఉన్నారు. అన్నకి అక్కలకి పెళ్ళిళ్ళు అయిపోయాయి. తండ్రి లేరు. పది సంవత్సరాల కిందటే స్వర్గస్థులయ్యారుట.

మగపెళ్లి వారంతా ఆడపెళ్ళివారికి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారు. ఆడపెళ్లివారింట్లో అంతా తెల్లటి రంగు. మగపెళ్లి వారింట్లో అంతా నల్లటి నలుపు. వారంతా భగవతిని చూసి చాలా మురిసి పోయారు. తెల్లటి కోడలు వస్తూందని పెళ్లికొడుకు తల్లి చాలా ఆనందించింది.

పెళ్ళికి పదిరోజుల ముందు విశాఖ నించి రేవతి, భర్త, పిల్లలు వచ్చారు. రేవతి, భానుమతి పెళ్లి పనులలో, భగవతిని అలంకరించటంలో చాలా శ్రద్ధ చూపారు. మాలతి ఇంటికి వచ్చిన అతిథులకు మర్యాదలు చేసింది. శాంతమ్మ, శారదమ్మ వంటలు, వడ్డనలు చూసుకున్నారు. మగవాళ్ళంతా పెళ్లి పనులు, వస్తువులు అందించడం చూసుకున్నారు. చారుమతే దూరంగా ఉండిపోయింది.

చారుమతికి ఏమిటో ఈ లోకంలో తానే ఒంటరిగా మిగిలి పోయినట్టు అనిపించింది. అందరికి అందరు ఉన్నారు. మాలతికి కూడా గోపాల్ ఉన్నాడు. తనే ఎవరికీ చెందదు. పైగా, వచ్చిన ప్రతివాళ్ళు శాంతమ్మని అడగడమే, "పై పిల్లలిద్దరికి పెళ్లి చెయ్యకుండా చిన్నపిల్లకి చేస్తున్నారేం?" అని. శాతమ్మ నసిగేది, బాధ పడేది. "మాలతిని మా ఆడపడుచు కొడుక్కి స్థిరం చేసుకున్నాం. అతను రెండేళ్ళు పోయాక చేసుకుంటానన్నాడు. చారుమతికి ఇంకా ఏ సంబంధమూ కుదరలేదు" అనేది.

'చారుమతికి సంబంధం ఎందుకు కుదరలేదు? ఆ అమ్మాయిలో ఏమిటి లోపం? వయస్సు ముదిరిపోతూ ఉంటే ఇంకా ఎన్నాళ్ళు ఇంట్లో కూర్చుండ బెట్టుకుంటారు?' రకరకాల ప్రాశ్నలు ఉదయించేవి బంధువర్గం నించి. ఈ ప్రశ్నలు వినలేక చారుమతి విసుక్కునేది; కోపగించుకునేది; ఉక్రోష పడేది.

పెళ్లి ముహూర్తం రాత్రి పదిగంటలకి. ఉదయం మగపెళ్లివారు పెళ్ళికూతురుకి ప్రధానము, పెళ్లి కొడుక్కి స్నాతకం చేసుకున్నారు. ఏమీ తోచకుండా, అందరితోనూ సరదాగా తిరగ లేకుండా ఉన్న చారుమతికి పద్మ రాక ఎంతో సంతోషాన్ని కలిగించింది. వీధి పద్మ రిక్షా దిగుతూ ఉండగానే, చారుమతి ముందుకి వెళ్లి, చెయ్యి పట్టుకుని తీసుకు వచ్చింది.

"చివరికి వచ్చావన్న మాట! రావని భయపడ్డాను" అంది చారుమతి.

"నువ్వంతగా చెప్పి, ఒట్టు వేయించుకున్నావు కదా! రాకుండా ఉంటానా! పైగా అమ్మ, నాన్నగారూ నిన్నటి నించి ఒకటే పోరు, వెళ్ళమని" అంది పద్మ.

ఆకుపచ్చ పట్టుచీర కట్టుకుని, పూర్తిగా పైట చెంగుతో వీపంతా కప్పుకుని కూచుంది పద్మ. ఎంత అందంగా ఉన్నా, కళ్ళలో దీనత్వం, మనిషిలో ఒక విధమైన గంభీరత్వం మనిషిని పూర్తిగా మార్చేశాయి.

భగవతికి పసుపు, కుంకుమ, పట్టుచీర, ఉంగరం ఇచ్చి ప్రధానం చేసుకుంటున్నారు మగపెళ్ళివారు. మౌనంగా చూస్తూ కూర్చుంది పద్మ. ఆమెలో ఏ చలనమూ లేదు. కదలిక లేకుండా, భావరహితంగా ఉన్న అందమైన శిల్పంలా ఉంది.

ఎదురుగుండా జరుగుతున్న వేడుకలు చూస్తున్న చారుమతి ఎందుకో తల ఎత్తి చూసింది. కొంచెం దూరంలో శంకరం నిలుచుని తదేకంగా పద్మనే చూస్తున్నాడు. శంకరం పక్కన పద్మని నిలబెట్టి మనస్సులో ఒకసారి ఊహించుకుంది చారుమతి. వాళ్ళిద్దరూ అందమైన జంట అనిపించింది. కాని ఏం లాభం? దేనికేనా అదృష్టం ఉండాలి. పద్మ లాంటి అందమైనది, మంచిది భార్యగా వచ్చే అదృష్టాన్ని కూలదోసుకుంటున్నాడు శంకరం.

పద్మ ఉన్నంతసేపు శంకరం దృష్టి ఆమెమీదే ఉండటం గమనించింది చారుమతి. గోపాల్ మాలతిని అస్తమానం చూపులతో వెంబడిస్తున్నట్లే, శంకరం చూపులు పద్మని వెంటాడుతున్నాయి.

పెళ్లి ఏ ఆటంకాలు, గొడవలు లేకుండా బాగా జరిగిపోయింది. కట్న కానుకలు, వియ్యాలవారు జరిపిన మర్యాదలు చూసి మగపెళ్ళివారు సంతుష్టులయ్యారు. భగవతి కృష్ణమూర్తి భార్య అయిపోయింది.

రెండో రోజు వధూవరులను తీసుకొని విశాఖపట్నం గృహప్రవేశం చేసుకోడానికి వెళ్ళిపోయారు మగపెళ్ళివారు. పెళ్ళికూతురికి సాయంగా రేవతి వెళ్ళింది.

పెళ్ళివారు వెళ్ళిపోగానే ఇల్లు పెద్ద వాన కురిసి వెలిసిపోయినట్లు వెలితిగా అయిపోయింది. శంకరం, రామారావుగారు పెళ్లివారిని దిగబెట్టి, స్టేషన్ నించి ఇంటికి వచ్చారు. 'అమ్మయ్య' అని కూలబడుతున్న శంకరాన్ని చూసి, "బాబు, నీ పని ఇంకా అయిపోలేదురా. సామాను కొంచెం సత్రపు గదిలో ఉండిపోయింది. తీసుకురావాలి" అంది శాంతమ్మ.

"ఇంకా నా కోసం పని మిగిల్చావుటమ్మా!" అంటూ శంకరం తిరిగి సత్రంకు ప్రయాణమయ్యాడు.

చారుమతి అక్కడే కూర్చుని పత్రిక చూస్తుంది.

"చారూ, నువ్వు రారాదూ? రిక్షాలో వెళ్లి వచ్చేద్దాం" అన్నాడు శంకరం. "సరే" అంటూ బయలుదేరింది చారుమతి.

రిక్షా ఎక్కాక అడిగాడు శంకరం.

"మీ పద్మ అలా అయిపోయిందేం?"

"ఎలా అయిపోయింది?" ఏమీ తెలియనట్టు అంది చారుమతి.

"పూర్తిగా చలనం లేని బొమ్మలా, ప్రాణం లేని మనిషిలా ఎంత మారిపోయింది!" అన్నాడు. శంకరం గొంతుకలో ఉన్న బాధ చూసి చకితురాలైంది చారుమతి.

"మద్రాసునించి వచ్చిన దగ్గిర్నించి అలాగే స్తబ్దుగా తయారైంది పద్మ. పూర్వం కంటె ఇప్పుడు కొంచెం నయం. మద్రాసు నించి వచ్చినప్పుడు చూడవలిసింది నువ్వు. ఉఫ్ అంటే పడిపోయేటంత నీరసంగా, ఎండుపుల్లలా ఉంది."

"పాపం, నువ్వు చెప్పిన పద్మ కథ అంతా నిజమేననిపిస్తూంది ఇప్పుడు" అన్నాడు శంకరం తిరిగి నొచ్చుకుంటూ.

చారుమతి ఏమీ మాట్లాడలేదు. సామాను తీసుకుని సత్రం నించి వచ్చేస్తూ ఉంటే, తిరిగి శంకరమే అన్నాడు. "భార్యాభర్తలు సినిమా బాగుందిట. సాయంత్రం అందరం వెళదామా?"

"నీ ఇష్టం! కలిసి వెళితే సరదాగానే ఉంటుంది" అంది చారుమతి.

శంకరం కాస్సేపు తటపటాయించి, చివరికి అన్నాడు. "మీ పద్మని కూడా పిలుచుకు రాకూడదూ? సినిమా చూసినంతసేపైనా తన కష్టాలు మరిచి పోతుంది."

"నీకెందుకో పద్మ మీద అంత శ్రద్ధ?" చారుమతి హాస్యం చేస్తూ అంది.

"నీ స్నేహితురాలు కనక. బాధలలో ఉన్నవారిని ఎవరిని చూసినా కలిగే జాలి వల్ల" అన్నాడు శంకరం.

కథ మలుపు తిరుగుతూంది మనస్సులోనే అనుకుంది చారుమతి.

★★★★★

ఆ రోజు మే పదవ తారీఖు. కృష్ణమూర్తి భగవతిని కాపరానికి హైదరాబాద్ తీసుకు వెళ్లి పోయాడు. కూతురు అంత తొందరలో కాపరానికి వెళ్లి పోతుందనుకోలేదు శాంతమ్మ. భగవతి, భర్త హైదరాబాద్ ప్రయాణానికి రెండు రోజులు ముందుగా కాకినాడలో దిగారు. అప్పటికప్పుడు శంకరం, భానుమతి బజారుకి వెళ్లి వంటగిన్నెలు, మంచినీళ్ళ బిందె, అన్నం తినే కంచాలు, గ్లాసులు, ప్లేతులు... సంసారం పెట్టడానికి కావలిసిన సామానంతా కొని తెచ్చారు. మిఠాయి ఉండలు, చలిమిడి చేసింది శాంతమ్మ.

కొత్తచీర, పసుపు, కుంకుమ, చలిమిడి, కొబ్బరికాయ భానుమతి చేత చిన్నకూతురి చేతిలో పెట్టించి, కాపరానికి పంపుతూ ఉంటే కంటినీరు తిరిగింది శాంతమ్మకి. 'చిన్నపిల్ల, సంసారం ఎలా దిద్దుకుంటుందో?' అనుకుంది మనసులో. ఎంత పెద్ద పిల్ల అయినా తలితండ్రుల దృష్టిలో చిన్నపిల్లగానే కనపడుతుంది మరి!

"నా కాజువల్ లీవు అంతా అయిపోయింది. సెలవు దొరకదు" అంటూ మాలతి ఇంటిదగ్గిరే చెల్లెలికి, మరిదికి వీడ్కోలు చెప్పి ఆఫీసుకి వెళ్లి పోయింది. తక్కిన వాళ్ళంతా స్టేషన్ కి వెళ్లి వధూవరుల్ని సాగనంపారు. ఇంటినించి కొత్తచీర కట్టుకుని పెద్దలకి, అక్కలకి నమస్కరించింది భగవతి. అందరి కళ్ళల్లోను నీళ్ళు తిరిగాయి.

శాంతమ్మ రైలు కదిలేదాకా కూతురికి కొత్త కాపరం ఎలా చేసుకోవాలో చెబుతూనే ఉంది. భానుమతి ఉత్తరాలు మర్చిపోకుండా వారానికి ఒకటి రాయాలని కోరింది చెల్లెల్ని.

టికట్లు కొనడానికి వెళ్ళిన శంకరం తరిగి వచ్చి, "చారూ! సామర్లకోట దాకా మనిద్దరికీ కూడా టికట్లు కొన్నాను. మనం వెళ్లి వద్దాం" అన్నాడు. చారుమతి ఆశ్చర్య పోయింది. ఇంతకుముందు సామర్లకోట దాకా వెళ్ళాలన్న ప్రసక్తే రాలేదు.

రైలు కదిలింది.రైల్లో కూర్చున్న భగవతి కళ్ళనీళ్ళు నింపుకుంటూ తల్లికి, తక్కినవాళ్లకి చెయ్యి ఊపింది.

ప్లాటుఫారం మీద నిలుచున్న శాంతమ్మ, భానుమతి కళ్ళు తుడుచుకున్నారు.

భగవతి భర్త పక్కనే కూర్చుంది. ఇద్దరు చాలా దగ్గిరిగా, ఒక్కళ్ళ నొకళ్ళు తగులుతూ ఉన్నారు. భగవతిలో ఒక సంతోషం, కించిత్తు గర్వం తొంగి చూస్తున్నాయి. మాటలలో, చూపులలో చలాకీతనం హెచ్చు అయింది. 'వారం రోజులలోనే ఎంత మారిపోయింది భగవతి' అనుకుంది చారుమతి

సామర్లకోటలో రైలు మారేదాకా నలుగురూ మాట్లాడుకుంటూ కూర్చున్నారు. కృష్ణమూర్తి చాలా నెమ్మది. అంత మాటకారి కాదు. భగవతి ఉరకలు వేస్తూ పరుగులు తీసే సముద్రమైతే, అతను నెమ్మదిగా పారే నది.

హైదరాబాద్ రైలు కదిలింది. భగవతి భర్తతో కాపరానికి సాగింది. 'భగవతి కోరిక తీరింది. పద్దెనిమిది ఏళ్లకే పెళ్లి కూతురైంది. మంచి ఉద్యోగస్థుడు భర్తగా లభించాడు. భగవతి సుఖంగా ఉండాలి. డబ్బు ఇబ్బందులు లేకుండా హాయిగా జీవించాలి' అనుకుంది చారుమతి.

శంకరం, చారుమతి కాకినాడ తిరుగు ప్రయాణానికి రైల్లో ఎక్కి కూర్చున్నారు. ఆ రైలు ఇంకా అరగంటకి కాని సామర్లకోట నించి బయలుదేరదు. ప్రయాణికులు ఒక్కొక్కరుగా వచ్చి ఎక్కుతున్నారు. కంపార్టుమెంటు చాలామట్టుకు ఖాళీగానే ఉంది.

చారుమతి ఆలోచనలు మారుస్తూ శంకరం అన్నాడు. "ఆ రోజు వంతెన దగ్గిరికి తీసుకు వెళ్లి మీ పద్మ కథంతా నాకు ఎందుకు చెప్పావో ఇప్పుడు తెలిసింది."

"ఎందుకు?"

"నేను పద్మని పెళ్లి చేసుకోవాలని నీ ఊహ."

చారుమతి శంకరాన్ని చూస్తూ మౌనంగా ఊరుకుంది.

"అవునా?" సందేహంగా అడిగాడు శంకరం.

అప్పటికి కూడా చారుమతి తన  ఉద్దేశం చెప్పలేదు.

"ఏం నువ్వు పద్మని చేసుకోవాలనుకుంటున్నవా?" అంది.

"చేసుకోవాలనుకోవడం తప్పా?' శంకరం ఎదురు ప్రశ్న వేశాడు.

శంకరం మనస్సు తెలిసినందుకు సంతోషించింది చారుమతి.

"తప్పు లేదు, ఎంతో ఒప్పు!" నవ్వుతూ అంది.

చెల్లెలి నవ్వు చూసి తనూ నవ్వాడు శంకరం.

"ఆనాడు పద్మదే తప్పంతా అన్నట్టు మాట్లాడావు." చారుమతి అడిగింది.

"ఆ రోజు మొదటిసారి వినడం. ఎక్కువ ఆలోచించ లేదు. పద్మ తొందర పడిందేమో ననుకున్నాను."

"మరి, ఇప్పుడు పద్మ తప్పేం లేదని ఎలా తెలిసింది?"

"పద్మని చూశాక నా అభిప్రాయాలు మారి పోయాయి."

"పద్మని చూశాకా? లేక పద్మ అందం చూశాకా?" చారుమతి కొంచెం హేళనగా అంది.

"చారూ! నువ్వు అలా మాట్లాడితే నేను ఏం చెప్పలేను. ఆడదాని అందానికి ప్రాముఖ్యం లేదనను. కాని అది ఒక్కటే మగవాణ్ణి మారుస్తుంది. ఆకర్షిస్తుంది అంటే పొరబాటే. అందం వెనక ఉండే మనస్సు, మనిషి ప్రవర్తన ఎంతో ముఖ్యమయినవి. పద్మ స్థితి చూసిన నా మనసులో ఇప్పుడు ఎంతో బాధగా ఉంది. పాతికేళ్ళు అయినా నిండని ఆమె జీవితం అంతా అడివి కాచిన వెన్నలలా అయిపోయిందంటే జాలి వేస్తూంది. నిజంగా ఆమె భర్త దురదృష్ట వంతుడు. రంభ లాంటి భార్యని పెట్టుకుని అలా ఎలా ఉన్నాడో? అనుభవించడానికి కూడా అర్హత కావాలి."

"ఆ అర్హత నీకు ఉందంటావా?"

"నువ్వు అలా వ్యంగ్యంగా మాట్లాడితే నేను నీతో మాట్లాడను, చారూ! నేను తీవ్రంగా అడుగుతున్నాను. పద్మని నేను తిరిగి పెళ్లి చేసుకుంటానంటే పద్మ ఒప్పుకుంటుందా? ఆమె తలితండ్రులు అంగీకరిస్తారా?"

"పద్మ, వాళ్ళ నాన్నగారు, అమ్మగారు ఇష్టపడతారో లేదో నాకెలా తెలుస్తుంది?"

"మరి ఎవరికి తెలుస్తుంది?" చెల్లెలు తనతో ఆటలాడుకుంటూందని శంకరానికి కోపం వచ్చింది.

"ఏమో?" చారుమతిలో ఇంకా చిలిపితనం పోలేదు. శంకరం కోపంగా ఉండటం చూసి పక్కుమని నవ్వింది.

"చారూ! నువ్వు చాలా మారిపోయావు. ఎదటి మనిషిని అర్థం చేసుకోవేం? నువ్వు వంతెన దగ్గిర పద్మని గురించి చెప్పిన దగ్గిరినించి రోజూ నేను ఆమెని గురించే ఆలోచిస్తున్నాను. పద్మని భగవతి పెళ్లిలో చూసిన దగ్గిరినించి పెళ్లి చేసుకోవడం ఎలాగా? సాధ్యమౌతుందా? అని ఒకటే మథన పడుతున్నాను. నాకు నువ్వే సహాయం చేస్తావని, ఆమె నీ స్నేహితురాలు కనక నువ్వు నా అభిప్రాయం విని సంతోషిస్తావని అనుకున్నాను. ఇప్పుడు నువ్వేమో ఇలా మాట్లాడుతున్నావు!"

చారుమతి నవ్వడం మానేసి, గంభీరంగా మారిపోయింది.

"నువ్వు పద్మని పెళ్లి చేసుకోవడం నాకు చాలా సంతోషం. అంతకంటె నాకు ఏం కావాలి? నీ హృదయ పూర్వకంగా నువ్వే పద్మని పెళ్లి చేసుకోడానికి నిశ్చయించుకొడం ఇంకా సంతోషం . ఆ మాట నీ నోటి ద్వారానే చెప్పించాలని అలా వ్యంగ్యంగా మాట్లాడాను. మరోలా భావించకు. శంకరం! నువ్వు పద్మని చేసుకుంటే బాగుంటుందని నేను, శ్రీదేవి చాలారోజుల కిందటే అనుకున్నాం. అందుకే నీతో పద్మ కథ చెప్పాను." చారుమతి ఆప్యాయంగా శంకరం చేతిలో తన చెయ్యి వేసింది.

"పద్మని, వాళ్ళ తలిదండ్రులని ఒప్పించడం బాధ్యతంతా నీ మీదే పడుతున్నాను చారూ! అది నువ్వు ఒకర్తివే నిర్వహించగలవు" అన్నాడు శంకరం.

"మీ ఇద్దరి పెళ్లి అంత సుళువుగా తేలిపోయేది కాదు. ముందర మాధవరావుకి విడాకులు ఇప్పించాలి. తరవాత పద్మని, తలిదండ్రుల్ని ఒప్పించాలి. తలుచుకుంటేనే చాలా కష్టం అనిపిస్తూంది. అన్నిటికంటే ముఖ్యం, పద్మ రెండవ పెళ్ళికి ఒప్పుకుంటుందా అని! అదే భయం."

"నాకూ అదే భయం, చారూ! ఆ రోజు 'భార్యాభర్తలు' సినిమాకి వచ్చినప్పుడు చూశానుగా, పద్మ ఎంత ముభావంగా ఉందొ! ఒక్కమాట మాట్లాడలేదు. నమస్కారం చేస్తే తిరిగి నమస్కరించి ఊరుకుంది. నన్ను అసలు కళ్ళు ఎత్తి చూడను కూడా చూడలేదు."

స్టేషన్ లో గంట మోగి, రైలు కదలడంతో సంభాషణ ఆగిపోయింది. రైలు శబ్దంలో మాటలు వినిపించాలంటే గొంతు పెద్దది చేసి మాట్లాడుకోవాలి. అక్కన కూర్చున్న ప్రయాణికులకు వినిపిస్తాయి మాటలు.

కాకినాడ టౌన్ స్టేషన్ లో దిగి, ఇంటికి వచ్చి రిక్షా మాట్లాడుకున్నారు.

"ఇంటికి వెళితే ఇంకా ఈ పెళ్లి విషయం మాట్లాడుకోలేము. రేపు నేను ఊరు విడిచి వెళ్ళిపోతున్నాను. ఇప్పుడే మాట్లాడుకోవాలి" అన్నాడు శంకరం, రిక్షా ఎక్కి కూర్చోగానే.

"పద్మ విషయమే నేనూ ఆలోచిస్తున్నాను, శంకరం. ఒకసారి చేసుకున్న వివాహం విఫలమైతే, అది హృదయానికి మానని గాయంగా మారిపోతుంది. తను ఆ దెబ్బ నుంచి కోలుకుని నిన్ను తిరిగి వివాహం చేసుకోడానికి ఇష్టపడుతుందా అన్నది సంశయమే. వైవాహిక జీవితంలో ఒకసారి మోసపోయిన స్త్రీ అది తొందరగా మరిచి పోలేదు.

పోతే, పద్మ తలిదండ్రుల విషయమూ మనం చూసుకోవాలి. ఒకసారి నలుగురి పెద్దల ముందు, బంధువుల ఎదట కూతురికి వైభవంగా పెళ్లి చేసి, ఇప్పుడు ఆ కూతురి చేత విడాకులు ఇప్పించ గలరా? తిరిగి అదే పెద్దల ముందు రెండవ వివాహం చెయ్యడానికి ధైర్యం ఉంటుందంటావా?' అంది చారుమతి.

"తిరిగి కూతురి వివాహం చెయ్యగలగడం, ధైర్యంగా ఉండటం తల్లిదండ్రుల సంస్కారం మీద, ఆత్మ విశ్వాసం మీద ఆధారపడి ఉంటాయి. కూతురితో కాపరం చెయ్యడానికి ఇష్టపడని అల్లుడికి విడాకులు ఇప్పించడంలో ఏ తప్పూ లేదు. రెండోది, కూతురు సుఖం కోసమే

వారు రెండవ వివాహం చేస్తున్నారు. పద్మ, తల్లీ, తండ్రి కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తే విడాకులకి, రెండవ వివాహానికి తప్పక అంగీకరిస్తారనిపిస్తూంది" అన్నాడు శంకరం.

చారుమతి శంకరం మాటలు వింటూ మౌనంగా ఊరుకుంది. తిరిగి శంకరమే అన్నాడు. "పెళ్లి చేసుకున్నాక, పద్మని ఈ ఊళ్ళో ఉంచబోను నేను. నా ఉద్యోగం ఎలాగా ఉత్తర దేశంలోనే స్థిరమౌతుంది. ఈ పరిసరాలకి దూరంగా ఉన్న పద్మ పాత జీవితం మరిచిపోవచ్చును తొందరగా."

"నిజమే! కాలము, పరిసరాలు మనిషి జీవితాన్ని మారుస్తాయి. పద్మ దూరంగా వెళ్ళిపోతే, మంచి భర్త లభిస్తే తప్పక సంతోషంగా ఉంటుంది" అంది చారుమతి.

"రేపు నేను మధ్యప్రదేశ్ వెళ్లిపోతున్నానా? ఇంకా బాధ్యత అంతా నీదే. ఇటు అమ్మని, అటు పద్మా వాళ్ళని ఒప్పించాలి. నాకు అన్నీ వివరంగా ఉత్తరాలు రాయి. అవసరమైతే నేను పద్మకి, వాళ్ళ నాన్నగారికి ఉత్తరాలు రాస్తాను" అన్నాడు శంకరం.

'ఏమిటీ బాధ్యతలు! ఒకటి తప్పింది అనుకుటే వేరొకటి! భగవతి పెళ్లి భారం తీరిందంటే, శంకరం పెళ్లి మీద పడింది.

ఎవరి ఆలోచనలు, ఎవరి సుఖాలు వాళ్ళవి. పాతికేళ్ళైయినా నిండని పద్మ జీవితం అడివి కాచిన వెన్నెల అయిపోతూందిట! ఇటు నా జీవితం చీకటిలా అయిపోవడం లేదా? చెల్లెలు జ్ఞాపకం రాదా? చెల్లికి మాత్రం పెళ్లి, సుఖాలు అక్కరలేదా?' తనలో తనే నిట్టూర్చింది చారుమతి.

పైకి మాత్రం, "అలాగే శంకరం. నా సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాను" అంది.

రిక్షా ఇంటిదగ్గిర ఆగింది.

మరునాడు శంకరం తన భారం చెల్లెలి మీద వదిలేసి మధ్యప్రదేశ్ వెళ్ళిపోయాడు.

## 30

పెరటి దారి గుండా చుట్టు తిరిగి లోపలి ఇంట్లోకి వచ్చాడు గోపాల్. వరండాలో జాకెట్టు కుట్టుకుంటూ కూర్చుంది చారుమతి.

"వదినా! ఇవిగో పూలు" అంటూ జేబులోంచి బొగడ పూలు తీసి చారుమతి దోసిలి నిండా పోశాడు గోపాల్.

"రోజూ కష్టపడి ఎందుకు తెస్తావు బాబూ!" అంది చారుమతి, పువ్వులు ఆప్యాయంగా అందుకుని, వాసన చూస్తూ.

"నీ కిష్టమైన పువ్వులు ఇవ్వడంలో నాకెంతో సంతోషం ఉంది" అన్నాడు గోపాల్, చెమట పట్టిన ముఖాన్ని రుమాలుతో తుడుచుకుంటూ.

అతనికి తనమీద ఉండే అభిమానానికి ఆర్ద్రమయింది చారుమతి హృదయం. 'గోపాల్ వంటి స్నేహితుడు, సహృదయుడు లభించకపోతే తన జీవితం ఎంత నిస్సారంగా ఉండేదో?' అనుకుంది చారుమతి.

"విజయనగరం నించి ఎప్పుడు వచ్చావు?" చారుమతి అడిగింది.

"నిన్న రాత్రి" అన్నాడు గోపాల్. తిరిగి అతనే, "భగవతికి కవలపిల్లలు పుట్టారని విన్నాను, ఎక్కడా?" అన్నాడు.

"రా..రా. చూద్దువుగాని. గదిలో ఉన్నారు" అంది చారుమతి లేస్తూ.

సాయంత్రం ఆరుగంటలవుతూంది. భగవతి పురిటిగదిలో వెలుతురు ఎక్కువగా లేదు. మంచం మీద భగవతికి రెండు వైపులా ఇద్దరు ఆడపిల్లలు పదిహేనురోజుల పసివాళ్ళు పడుకుని ఉన్నారు.

"భగవతీ! బాగున్నావా?" పలకరించాడు గోపాల్.

"రా బావా" అంటూ లేచి కూర్చుంది భగవతి.

గోపాల్ స్టూలు తెచ్చుకుని భగవతి మంచానికి కొంచెం దూరంలో వేసుకుని కూర్చున్నాడు. పెళ్లి అయిన నాలుగేళ్లలో రెండు సార్లు పురిటికి వచ్చి ముగ్గురు పిల్లల తల్లి అయింది. పెళ్ళికి ముందు ఉండే చిన్నతనం, ఉద్రేకం పోయి పెద్దరికం వచ్చింది. తమలపాకులతో ఎఱ్ఱబడిన పెదవులతో నడుంకట్టుతో పురిటాలు ఎంతో అందంగా ఉంది.

"అభినందనలు" అన్నాడు గోపాల్.

"ఎందుకు?" అంది భగవతి.

"ఎందుకేమిటి? ఒక్కసారీ ఇద్దరినీ కన్నందుకు" అన్నాడు గోపాల్ నవ్వుతూ.

"నాకేం సంతోషంగా లేదు, బావా! నాకు కూతుళ్ళు వద్దనుకున్నాను. ఏకంగా భగవంతుడు ఇద్దరిని ప్రసాదించాడు" అంది భగవతి విచారంగా.

"ఒక కొడుకు ఉన్నాడుగా నిన్ను ఉద్ధరించడానికి? అయినా విచారం ఎందుకు? ఈ కాలంలో కొడుకులు, కూతుళ్ళు ఒకటే" అన్నాడు గోపాల్.

"కొడుకు, కూతురు ఎప్పటికీ సమానం కారు బావా! కూతురు ఎప్పటికీ భారమే. కూతుళ్ళ పెళ్ళిళ్ళకి ఎంత అవస్థపడాలని!" అంది భగవతి విచారమైన ముఖం పెట్టి.

గోపాల్ పెద్దపెట్టున నవ్వాడు.

"భగవతీ! నిన్ను చూస్తే, నీ మాటలు వింటే నవ్వు వస్తుంది. కూతుళ్ళు పుట్టి ఇంకా పదిహేను రోజులు కాలేదు. అప్పుడే వాళ్లకి చెయ్యబోయే పెళ్లిల్లని గురించి ఆలోచిస్తున్నావు. అది ఇంకా ఎన్నాళ్ళ మాట?" గోపాల్ పగలబడి నవ్వుతూ ఉండగానే, శాంతమ్మ కుంపటిలో నిప్పులు వేసుకుని వచ్చింది.

"ఏమిటి బాబూ, అంత నవ్వుతున్నావ్?" అంది, చంటిబిడ్డని చేతిలోకి తీసుకుని, సాంబ్రాణి పొగ వేస్తూ.

"చూడత్తా, మీ భగవతి ఎంత తెలివైనదో! కూతుళ్ళ పెళ్ళిళ్ళని గురించి ఇప్పటి నించే ఆలోచిస్తూంది" అంటూ మళ్ళీ నవ్వాడు. అప్పుడే పుట్టిన బిడ్డలకి ఎప్పుడో జరగబోయే పెళ్ళిళ్ళని గురించి భగవతి ఆలోచిస్తూ ఉందంటే, గోపాల్ కి విపరీతంగా నవ్వు వస్తూంది. వరండాలో కూర్చున్న చారుమతితో, వంట చేస్తున్న భానుమతితో, భగవతి పెద్దకొడుకు వాసుని ఆడిస్తున్న మాలతితో ... అందరితోను చెప్పి, మళ్ళీ మళ్ళీ నవ్వాడు.

ఆ మాట విన్న ఎవ్వరికీ గోపాల్ కి వచ్చినట్టు నవ్వు రాలేదు. భగవతి మాటల వెనక ఉన్న వ్యథ అర్ధమయింది.

గోపాల్ కాస్సేపు మాలతితో డాబా మీద కూర్చుని మాట్లాడి, ఇంట్లో అందరి దగ్గిర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. మాలతి, గోపాల్ అందరి ముందరా మాట్లాడుకోవడానికి పూర్వంలా సిగ్గు పడటం లేదు. ఇద్దరు కలిసి అప్పుడప్పుడు సినిమాలకి, షికార్లకి వెళ్ళుతున్నారు.స్కూల్ ఫైనల్ మాత్రం చదివాడని పెళ్లి చేసుకోవడానికి భగవతి తోసి పుచ్చిన గోపాల్ ఇప్పుడు ప్రైవేటుగా పి.యు.సి. పాసై, బి.ఏ. పరీక్ష కూడా రాసాడు. ఈ ఏటితో అతని బి.ఏ. పరీక్ష పూర్తి అవుతుంది. మాలతిని కూడా ప్రోత్సహించి ప్రైవేటుగా పి.యు.సి. పరీక్షకి చదివిస్తున్నాడు. 'ఈడైనవాడు, సహృదయుడు, సరసుడు అయిన గోపాల్ ని భర్తగా పొందుతున్న మాలతి అదృష్టవంతురాలు' అనుకుంది చారుమతి. గోపాల్

ని చూసినప్పుడల్లా మాలతి అదృష్టమే తలపులోకి వస్తుంది ఆమెకు. వాళ్ళిద్దరి పెండ్లికి తను అడ్డుగా ఉందే అని బాధ పడుతుంది. అక్క పెండ్లి కానిదే తను చేసుకోనని పట్టుబట్టి కూర్చుంది మాలతి.

ఈ నాలుగేళ్ళలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. చెల్లెలి కంటె ముందు పెళ్లి అయిన భానుమతికి పిల్లలు కలగలేదు. భగవతికి నాలుగేల్లలోను ముగ్గురు పిల్లలు. శాంతమ్మకి భానుకి పిల్లలు కలగనందుకు ఒక పక్క విచారము, భగవతికి పిల్లలు పుట్టినందుకు సంతోషం ఒకపక్కాను.

ఒంటరిగా కాపరం పెట్టడానికి వెళ్ళిన భగవతి ఇల్లు రెండేళ్లలో ఉమ్మడి కుటుంబంగా మారిపోయింది. భగవతి తోటికోడలు ఇద్దరు పిల్లల్ని, భర్తని ఈ లోకంలో వదిలి పరలోకయాత్ర చేసింది. పెద్దకొడుకు పిల్లల్ని పెట్టుకుని భగవతి అత్తగారు భగవతి ఇంట్లోనే ఉంటూంది.

'ఏ మార్పూ లేనిది నా జీవితమే' అనుకుంది చారుమతి. రెండేళ్ళకి ఒకసారి కాకినాడ వచ్చే శంకరానికి చారుమతి పెళ్లి మీద కంటె, పద్మతో తనకి జరగబోయే పెళ్లి మీదే శ్రద్ధ ఎక్కువ. అతని నిరంతర కృషి వల్ల, చారుమతి పద్మకి ఇచ్చిన ప్రోత్సాహం వల్ల పద్మ, మాధవరావు విడాకులు తీసుకున్నారు. పద్మ ఇప్పుడు శంకరంతో పెళ్లి కోసం ఎదురుచూస్తూంది.

చారుమతికి ఒకటి రెండు సంబంధాలు వచ్చినా, కట్నాలు ఇవ్వడానికి భయపడి అంతా వెనకతీసారు. భగవతి పెళ్ళికి చేసిన అప్పు తీరటానికి అతి కష్టమయింది. తాకట్టు మీద ఉన్న ఇల్లు అప్పు తీర్చి, విడిపించుకోవడానికి తాతలు దిగివచ్చారు. పైగా మధ్య మధ్య భగవతి పురిటి ఖర్చులు, ప్రయాణాలు, ఇక ఎవరి సంసారాలు వారికి ఏర్పడబోతున్నప్పుడు, మళ్ళీ చారుమతి పెళ్ళికి అప్పు చేస్తే ఎవరు తీర్చుకుంటారు? మాలతి, గోపాల్ చారుమతి పెళ్లి కోసం ఎదురు చూస్తున్నారు. అక్క పెళ్లి అవగానే మాలతి వివాహం చేసుకుని భర్త గృహానికి వెళ్ళిపోతుంది. శంకరం వివాహం చేసుకుని సంసారం పెట్టుకుంటే, డబ్బు ఎత్తి పంపి అప్పులు తీర్చడం కాని పని.

ఇరవై ఏడేళ్ళు వచ్చిన చారుమతి కన్యగానే మిగిలిపోయింది.

రాత్రి ఏడు గంటలు అవగానే భగవతికి భోజనం పెట్టేస్తుంది శాంతమ్మ. పురిటాలు తొందరగా భోజనం చేస్తే, పడుకునే లోగా అన్నం అరిగిపోతుందని, ఆరోగ్యంగా ఉంటుందని ఆవిడ నమ్మకం.

"ఇంకొంచెం నెయ్యి వేసుకు తిను." బలవంత పెడుతూంది శాంతమ్మ.

"ఇంకెంత వేసుకోనమ్మా కంపు నెయ్యి?" అంది భగవతి విసుగ్గా.

"ఏమోనమ్మా, కంపో, మంచో ఏదో ఒక నెయ్యి వేసి, దగ్గిర కూర్చుని పెడితేనే నాకు తృప్తి. నువ్వు పుష్టికరమైన ఆహారం తీసుకోకపోతే తరవాత నీరసించిపోతావు. పిల్లలందరినీ చూసుకోవద్దూ? మీ అత్తగారు రోగిష్టి అంటున్నావు!" శాంతమ్మ అంది.

"ఆవిడ ఒక రోజు లేచి తిరిగితే, రెండు రోజులు పడక వేస్తుందమ్మా. చూశావుగా మనిషి ఎంత లావో! ఒకటే ఆయాసం, పని చెయ్యక పోతేనే నయం! ఆవిడ మంచం ఎక్కిందంటే నా పని అవుతుంది. ఇటు ఈ పిల్లలిని చూసుకోవడము, అటు ఆవిడ సేవలూను." భగవతి తల్లితో సంసారంలో ఉండే కష్టాలు చెప్పుకుంటూంది.

"చంటి పిల్లలతో, అందులోనూ కవలలతో ఎలా అవస్థ పడతావో?" అంది నిట్టూరుస్తూ శాంతమ్మ.

"చంటి పిల్లలు ఫరవాలేదమ్మా. కాలు వచ్చిన వాసుతోనే అవస్థ. అటు, ఇటు వెళ్ళిపోతాడు. ఏ రోడ్డు మీదికి వెళ్ళిపోతాడో అని భయం. అస్తమానం కార్లు, సైకిళ్ళు తిరుగుతూంటాయి."

"మీ బావగారి పిల్లలు కొంచెం పెద్దవాళ్ళేమో! పెద్ద పిల్లవాడికి పదేళ్ళు ఉంటాయా? వాళ్ళు వాసుని ఆడించరా?" అంది శాంతమ్మ.

"అయ్యో! మా బావగారి పిల్లలా! వాసుని ఆడించదమా! అంత అదృష్టమా! వీణ్ణి ఏడిపించకుండా ఉంటే చాలు! ఆ పిల్లలిద్దరూ తెగ అల్లరి చేస్తారు. మాట వినరు. పైగా, తల్లి లేని పిల్లలు అంటూ తెగ ముద్దు చేస్తారు మా అత్తగారు" అంది భగవతి.

"పాపం, తల్లి లేని పిల్లలు! మీ బావగారు మళ్ళీ పెళ్లి చేసుకోరా?"

"ఎందుకు చేసుకోరమ్మా? మన చారు అక్కని ఇవ్వకూడదూ? మా అత్తగారుకూడా ఒకసారి అన్నారు."

వరండాలో కూర్చుని వీళ్ళ సంభాషణ వింటున్న చారుమతి, వెంటనే కోపంగా లోపలి వచ్చింది.

"భగవతీ! అక్కకి పెళ్ళికొడుకుని చూసే అంత ఆరిందావై పోయావా? ఇన్నాళ్ళు నాకు తెలియదు. నువ్వు అక్క కోసం అంత జాలిపడి, సంబంధాలు చూడ నవసరం లేదు" అంటూ విసురుగా వెళ్లి పోయింది.

శాంతమ్మ, భగవతుల నోళ్ళు కట్టుబడ్డాయి. తిరిగి వాళ్ళు ఆ ప్రసక్తి తీసుకురాలేదు.

భగవతి మీద కోపగించుకుంది కాని, చారుమతి ఆలోచనలనించి తప్పించుకోలేక పోయింది.

ఏమిటీ జీవితం! ఎన్నాళ్ళీ జీవితం! జీవితమంటేనే అయిష్టంగా ఉంది. రోజూ తినడం, స్కూలుకు వెళ్ళడం, వచ్చి నిద్ర పోవడం. ఎన్నాళ్ళైనా అదే స్కూలు, అవే పాఠాలు. ఇటు జీవితంలో మార్పు లేదు. అటు ఉద్యోగంలో మార్పు లేదు. చెప్పిన పాఠాలే చెప్పడం విసుగు.

పోనీ, తనూ మాలతిలా పరీక్షలకి చదివి, పాసై, డిగ్రీ తెచ్చుకుందామనుకుంది. డిగ్రీ తెచ్చుకుని ఏం చేస్తుంది? పెద్ద ఉద్యోగం వచ్చి, ఇంకొంచెం జీతం వస్తుంది. తన జీతం ఎవరికీ కావాలి? ఎవరి కోసం సంపాదన? తల్లితప్ప అందరికి అందరూ ఉన్నారు. తల్లిని చూసుకోవడానికి శంకరం ఉన్నాడు. తను ఎవరిని చూసుకోవాలి? ఎవరి కోసం ఎక్కువ డబ్బు సంపాదించాలి?

మంచి సంబంధం దొరుకుంది, పెళ్లి అవుతుంది అంటే ఆ ఆశా లేదు. భానుమతిలాగా ధైర్యంగా భర్తని ఎన్నుకుని, అర్థించి పెండ్లి చేసుకోలేదు. ఈడైన వరుడు వెతుక్కుంటూ వచ్చిన మాలతి అదృష్టం తను లేదు. పోతే, భగవతిలా ఇంట్లో అందర్నిబెదిరించి, సాధించి మంచి ఉద్యోగస్థుణ్ణి చేసుకునే చొరవా లేదు. తన తల్లి ఏమైనా సహాయం చేస్తుందా అంటే, అక్కడా చుక్కెదురే! ఆవిడ మాటలలో బాధ వెల్లడించగలదు. ఎదటివాళ్ళ అదృష్టం చూసి ఈర్ష్యపడగలదే కాని, తనంతట తను ఏ పనీ సాధించలేదు. ఏ కూతురికీ పెళ్లి చెయ్యలేదు. ఆవిడ అదృష్టం బాగుంది నలుగురు కూతుళ్ళకి భర్తలు దొరికారు. దురదృష్టవంతురాలు చారుమతి మిగిలిపోయింది.

జీవితంలో ముందు జరిగే అభివృద్ధినిచూసి, తలుచుకునే మనిషి ఉత్సాహంగా జీవించగలడు. ప్రగతి లేని జీవితం సారవిహీనంగా ఉంటుంది. రైలు కదులుతూ ఉంటే ఎన్ని రోజులైనా ప్రయాణం చెయ్యగలం. కదలని రైలులో ఎంతసేపు కూర్చోగలం? ఉద్యోగంలో అభివృద్ధి, కుటుంబం పురోభివృద్ధి చూసుకునే మనిషి జీవించగలుగుతున్నాడు. పెళ్లి, సంసారం, పిల్లలు కొండలు, కోనలు దాటుకుంటూ ముందుకు పరిగెడుతున్న ప్రవాహం లాంటి జీవితం. పెళ్లి, సంసారం లేని జీవితం నిలిచిపోయిన నూతిలోని నీరులా నిశ్శబ్దమైనది. ప్రతి మనిషి ఉత్సాహంగా పరుగులిడే ప్రవాహం లాంటి జీవితాన్ని వాంఛిస్తాడు.

ఆగిపోయిన జీవితం చారుమతిది. తను ముందరికి జరుపుకోలేదు. ఇంకొకరు వెనకనించి వచ్చి ముందరికి తోసి సహాయం చెయ్యరు. మరి ఎలా కదులుతుంది?

కదలని జీవితాన్ని తలచుకుంటే చారుమతికి దుఃఖం వస్తూంది. శ్రీదేవి, పద్మ తన స్నేహితురాండ్రు అయితేనేం! మూడు జీవితాలూ మూడు రకాలు. శ్రీదేవి పుట్టినప్పటినించి అదృష్టవంతురాలు. వడ్డించిన విస్తరి ఆమెది. పద్మ మధ్యలో అగాధంలో చిక్కుకుని పోయినా, ఎలాగో ఒడ్డు చేరి, శంకరం అనే అదృష్టాన్ని చేయూతగా తీసుకుని కొత్త లోకాలకు పయనిస్తూంది. ఎటూ మిగిలింది తనే. ఎవరికీ అక్కరలేనిది, ఏ అదృష్టం వరించనిదీను!

కదలని ఈ జీవితం విసుగు. ఉద్యోగం విసుగు. తన చేతులతో తనే ప్రాణాలు తీసుకునే ధైర్యం లేదు. ఇచ్ఛా లేదు. అలా అని జీవచ్ఛవంలా బ్రతకనూ లేదు.

భగవతి బావగారిని పెళ్లి చేసుకుంటే జీవితంలో వచ్చే మార్పయినా ఉంది. అయితే తాను కలలు కనే జీవితం ఎలాగా మృగ్యమే! కాని ఒక ఉద్యోగం నించి ఇంకో ఉద్యోగానికి మార్పు ఉంటుంది. ఒక ఊరినించి ఇంకో ఊరుకు మార్పు. ఒక విసుగు నించి ఇంకో విసుగైన జీవితానికి మార్పు. జీవితంలో చలనము, ముందుకు కదలిక లేక పోయినా, మార్పు ఉంటుంది. ఏదో ఒకటి! తను సామాన్యురాలు. తన జీవితం ఏటి ఒడ్డున పూచే సామాన్యమైన పూవులాంటి జీవితం. కోటి మంది సామాన్యులలో, దురదృష్టవంతులలో తను ఒకర్తి.

తెల్లవారి లేస్తూనే భగవతితో చెప్పింది. "మీ అత్తగారికి రాయి, మా అక్క మీ పెద్దబ్బాయిని చేసుకుంటుందని."

చారుమతి మాటలు విన్న భగవతి ఆశ్చర్యంతో బొమ్మలా నిలబడిపోయింది!

శ్రీదేవి, పద్మ, చారుమతులతో పాటు వారి స్నేహం కూడా పెరుగుతూ వచ్చింది. అయితేనేం, మూడు జీవితాలూ మూడు రకాలుగా రూపొందాయి. అదృష్టవతురాలు శ్రీదేవికి అనురూప వరుడు దొరికి, జీవితం వడ్డించిన విస్తరిగానే సాగిపోయింది. 'అమ్మకూచి' ప్రాప్తించిన పద్మ బ్రతుకు అగాధాల్లో చిక్కు పడినా ఆనందానికి ఎదురు చూచే భాగ్యం కలిగింది. ఎటొచ్చీ చారుమతి మాత్రమే ఎలా ఉన్నది అలా మిగిలి పోయింది, ఎవరికీ అక్కర లేకుండా, ఏ అదృష్టమూ వరించకుండా, ఏటి ఒడ్డున నీటి పువ్వులాగ.